ఆంధ్రజ్యోతి 5 ప్రకాశం
సోమవారం 7, ఏప్రిల్ 2025




ఒంగోలు మామిడిపాలెం కొండ మీద గుడిలో సీతారాముల వారికి తలంబ్రాలు పోస్తున్న పురోహితులు

# అంతా రామమయం



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

- ఘనంగా శ్రీరామనవమి వేడుకలు
- కన్నుల పండువగా సీతారాముల కల్యాణం
- పలుచోట్ల భక్తులకు అన్నదానాలు





స్వామి కల్యాణంలో ఎస్పీ దామోదర్ దంపతులు

జిల్లావ్యాప్తంగా ఆదివారం ఆధ్యాత్మిక శోభ నెలకొంది. అంతటా రామనామం మార్మోగింది. శ్రీరామనవమిని ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మేళతాళాలు, భక్తుల జయజయధ్వానాల మధ్య ఊరూరా సీతారాముల కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. భక్తులు తిలకించి పులకించి పోయారు. అనంతరం నిర్వాహకులు వడపప్పు, పానకం పంపిణీ చేశారు. పలుచోట్ల అన్నదానాలు జరిగాయి. ఒంగోలు పోలీసు క్వార్టర్స్‌లో ఉన్న శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ దామోదర్ దంపతులు కల్యాణకర్తలుగా వ్యవహరించారు. నగరంలోని మామిడిపాలెం కొండ మీద శ్రీసీతారామస్వామి కల్యాణోత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఉగాది మరుసటి రోజు నుంచి ప్రారంభమైన వసంత నవరాత్రి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి.

- లోపలి పేజీల్లో..

# పరీక్షలకు వెళ్తే పీల్చిపిప్పి..!

## వ్యాధి నిర్ధారణ కేంద్రాల్లో నిలువు దోపిడీ

- అడ్డగోలుగా ఫీజులు
- వైద్యం కన్నా వీటికే ఎక్కువ ఖర్చు
- పూర్తిస్థాయి రక్తపరీక్షలకు వేలల్లో చెల్లించాల్సిందే!
- బెంబేలెత్తిపోతున్న రోగులు

**జిల్లాలోని వ్యాధి నిర్ధారణ కేంద్రాల నిర్వాహకులు రోగులను నిలువు దోపిడీ చేస్తున్నారు. వైద్య పరీక్షలకు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నారు. సిండికేట్‌గా మారి మేమింతే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. వైద్యులు, పీఎంపీలు, ఆర్ఎంపీలకు భారీ మొత్తంలో కమీషన్‌లు ఆశ చూపడంతో వారు అవసరం లేని పరీక్షలు కూడా చేయించుకోవాలని రోగులకు సూచించి సదరు ల్యాబ్‌లకు పంపుతున్నారు. అక్కడికి వెళ్లిన వారిని నిర్వాహకులు పిండేస్తున్నారు. ఇక కార్పొరేట్ వైద్యశాలల్లో అయితే సరేసరి. దీంతో రోగం బారిన పడిన వారు వ్యాధి నిర్ధారణ పరీక్షల భారం మోయలేక అల్లాడుతున్నారు. ఇంత జరుగుతున్నా వైద్యారోగ్యశాఖ అధికారులు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.**

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వ్యాధి నిర్ధారణ పరీక్షల పేరుతో వ్యాపారం జరుగుతోంది. సాధారణ జ్వరం బారిన పడి ఏ ప్రైవేటు వైద్యశాలకు వెళ్లినా, అస్వస్థతకు గురై డాక్టర్‌ను సంప్రదించినా ముందుగా వ్యాధి నిర్ధారణ కేంద్రాలకు (డయోగ్నోస్టిక్ సెంటర్‌లు) పంపించడం ఆనవా

**వైద్యులకు భారీగా కమీషన్లు**

జిల్లాలోని పలువురు వైద్యులు, ఆర్ఎంపీలు, పీఎంపీలతో వ్యాధి నిర్ధారణ కేంద్రాల నిర్వాహకులు లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. భారీ మొత్తంలో కమీషన్‌లు ఆశ చూపుతున్నారు. కొందరు పరీక్షలకు వసూలు చేస్తున్న మొత్తంలో 50శాతం నుంచి 60శాతం వరకూ కమీషన్ చెల్లిస్తున్నారు. దీంతో వైద్యులు రోగులకు అవసరం లేని పరీక్షలు కూడా రాస్తున్నారు. ల్యాబ్‌ల నిర్వాహకులు భారీ మొత్తంలో గుంజుతున్నారు. మరోవైపు కొన్ని డయోగ్నోస్టిక్ సెంటర్‌ల నిర్వాహకులు ప్యాకేజీల పేరుతో రోగులను మభ్యపెట్టి సాధారణ రక్తపరీక్షలకు కూడా వేల రూపాయలు వసూలు చేస్తున్నారు. ఈ వ్యవహారానికి అడ్డుకట్ట వేయాల్సిన వైద్యారోగ్యశాఖ అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. వారికి కూడా మామూళ్లు ముడుతుండటంతో మొక్కుబడి తనిఖీలు నిర్వహించి మమ అనిపిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.


యితీగా మారింది. దీనిని ఆసరా చేసుకుని ఆయా సెంటర్ల నిర్వాహకులు దండిగా సొమ్ము చేసుకుంటున్నారు. ఇటీవల కాలంలో వీరి దోపిడీ మరింత ఎక్కువైంది.

**కొన్నింటికే అనుమతి..**

రక్త పరీక్షల ల్యాబ్‌లు, సిటీ స్కాన్, ఎంఆర్ఐ స్కానింగ్.. ఇలా వ్యాధి నిర్ధారణ పరీక్ష కేంద్రాలు జిల్లాలో 300కుపైగా ఉన్నాయి. అందులో ఒంగోలులోనే 150కి పైన నడుస్తున్నాయి. మొత్తం సెంటర్‌లలో కొన్నింటికి మాత్రమే అనుమతులు ఉన్నాయి. వాటితోపాటు ప్రతి ప్రైవేటు ఆసుపత్రిలో దానికి అనుసంధానంగా ల్యాబ్ ఉంది. బయట డయోగ్నోస్టిక్ సెంటర్‌ల నిర్వాహకులంతా సిండికేట్‌గా మారి ఒకేరకమైన రేట్లు నిర్ణయించి వసూలు చేస్తుండగా ప్రైవేటు ఆసుపత్రులకు అనుసంధానంగా ఉన్న ల్యాబ్‌లలో మాత్రం నోరెళ్లబెట్టాల్సి వస్తోంది. వారు చెప్పిందే ఫీజు, వారి ఇచ్చిందే రిపోర్టు అవుతోంది. దీంతో ప్రజలు తనకు వచ్చిన రోగం కంటే అక్కడ పరీక్షలకు అయ్యే ఖర్చులను తలచుకుని మరింత ఆందోళన చెందుతున్నారు.

**అమలు కాని నిబంధనలు**

జిల్లాలోని అనేక ల్యాబ్‌లలో ప్రభుత్వ నిబంధనలు అమలు కావడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. చిన్నపాటి ల్యాబ్ ఏర్పాటు చేయాలన్నా కనీసం ఎంబీబీఎస్ అర్హత గల వైద్యుడి పర్యవేక్షణ ఉండాలి. పెద్దస్థాయి వ్యాధి నిర్ధారణ కేంద్రాల్లో అయితే పెథాలజీ, రేడియాలజీ, మైక్రో బయాలాజీ తదితర అర్హత కలిగిన వారు ఉండాలి. వీరికి సహాయకులుగా ల్యాబ్ టెక్నీషియన్‌లు వ్యవహరిస్తారు. డిప్లమో, డిగ్రీ కోర్సు పూర్తి చేసిన వారిని సిబ్బందిగా నియమించాలి. కానీ అనేక డయోగ్నోస్టిక్ సెంటర్‌లలో ఈ నిబంధనలు పాటించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రైవేటు ఆసుపత్రులకు అనుబంధంగా ఉన్న ల్యాబ్‌లలో అయితే అక్కడి వైద్యుడి పేరుతో ఇతర వ్యక్తులు నడుపుతున్నారు. కొన్నిచోట్ల ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన వారు ల్యాబ్‌లు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.



| ఒంగోలులోని ల్యాబ్‌లలో ముఖ్యమైన రక్త పరీక్షలకు వసూలు చేస్తుంది ఇలా.. |
|---|
| కంప్లీట్ బ్లడ్ కౌంట్ : రూ.800 |
| కంప్లీట్ హిమో గ్లోబిన్ : రూ.700 |
| కొలెస్ట్రాల్ డైరెక్ట్ : రూ.300 |
| కొలెస్ట్రాల్ ఇన్‌డైరెక్ట్ : రూ.300 |
| హెచ్ఐవీ : రూ.300 |
| బీ12 పరీక్ష : రూ.800 |
| ఫోలిక్ యాసిడ్ : రూ.800 |
| లిపిడ్ ప్రొఫైల్ : రూ.3,000 |
| లివర్ ఫంక్షన్ టెస్ట్ : రూ.550 |
| మైక్రోబయాలజీ అరోబిక్ కల్చర్ : రూ.2,200 |
| ఆర్ఏ ఫ్యాక్టర్ - రూ.200 |

# నేడు, రేపు మంత్రి స్వామి డెహ్రాడూన్ పర్యటన

## కేంద్రం నిర్వహించే చింతన్ శివిర్‌కు హాజరు



మంత్రి స్వామి

ఒంగోలు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు చెందిన రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సోమ, మంగళవారాల్లో ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్‌లో పర్యటించనున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అక్కడ రెండు రోజులపాటు నిర్వహిస్తున్న చింతన్ శివిర్‌కు ఆయన హాజరుకానున్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల అభ్యున్నతి కోసం అమలు చేస్తున్న పథకాలు, వాటి అమలు తీరును సమీక్షించేందుకు కేంద్ర సామాజిక న్యాయ సాధికార శాఖ ఈ సదస్సును ఏర్పాటు చేసింది. ఇందులో ఆయా వర్గాల అభ్యున్నతితోపాటు సామాజికన్యాయ అంశాలపై చర్చించనున్నారు. కేంద్ర సామాజికన్యాయ శాఖ మంత్రి నరేంద్రకుమార్, ఉపమంత్రులు రాందాస్ అధివాలే, బీఎల్ వెర్మా నేతృత్వం వహిస్తున్నారు. ఈ సదస్సుకు దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సంక్షేమశాఖ మంత్రులు హాజరుకానున్నారు. మన రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా మంత్రి డాక్టర్ స్వామి పాల్గొంటున్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఆయన కేంద్రం దృష్టికి తీసుకెళ్లనున్నారు. వాటి అమలుకు అవసరమైన నిధులను ఇవ్వాలని కోరనున్నట్లు సమాచారం.

# ఇంటర్ పుస్తకాలు వచ్చేశాయ్!

## ప్రభుత్వ కళాశాలలకు పంపిన అధికారులు

ఒంగోలు విద్య, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ విద్యార్థులకు ఉచిత పాఠ్య, నోటు పుస్తకాలు వచ్చాయి. ఇంగ్లీషు మీడియం సీనియర్ విద్యార్థులకు 7,742 పుస్తకాలు సరఫరా కాగా వాటిని సంబంధిత కాలేజీలకు పంపినట్లు బోర్డు ఆర్ఐవో సైమన్ విక్టర్ తెలిపారు. మోడల్ స్కూళ్లు, కేజీబీవీలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, హైస్కూల్ ప్లస్ విద్యార్థులకు ఒక్కొక్కరికి 12 చొప్పున 1.07 లక్షల నోట్ పుస్తకాలు కూడా సంబంధిత కళాశాలలకు పంపినట్లు ఆయన చెప్పారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సరిపడా నోట్ పుస్తకాలు వచ్చాయన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో తరగతులకు హాజరవుతున్న సీనియర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కల్పించడంతోపాటు ఆర్టీసీ బస్సు పాస్‌లు ఇప్పిస్తున్నట్లు సైమన్ విక్టర్ తెలిపారు. జూనియర్ ఇంటర్ విద్యార్థులకు కూడా పాఠ్యపుస్తకాలు వచ్చిన వెంటనే ఉచితంగా అందజేస్తామని ఆయన చెప్పారు.




# ఏఎన్ఎంల ఉద్యోగోన్నతి అక్రమాలపై విచారణ

## 11న డీఎంహెచ్‌వో కార్యాలయంలో నిర్వహణ

## నోటీసులు జారీ చేసిన డీపీఎం

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : వైద్యారోగ్య శాఖలో గత నెలలో నిర్వహించిన సచివాలయ ఏఎన్ఎంల ఉద్యోగోన్నతుల్లో అక్రమాలు చోటుచేసుకున్నట్లు వస్తున్న ఆరోపణలపై ఈనెల 11న విచారణ జరగనుంది. ఈమేరకు విచారణాధికారి నోటీసులు జారీ చేశారు. సచివాలయ ఏఎన్ఎంల ఉద్యోగోన్నతుల్లో పలు అక్రమాలు చోటుచేసుకున్నాయని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బిళ్లా చెన్నయ్య ఇటీవల జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణకు ఫిర్యాదు చేశారు. సీనియారిటీ జాబితాలో పలు అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆయన ఆరోపించారు. బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై సమగ్ర విచారణ చేసి నివేదిక సమర్పించాలని డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఎస్‌డీసీ మాధురిని జేసీ ఆదేశించారు. దీంతో ఆమె విచారణకు సిద్ధమయ్యారు. ఈనెల 11వతేదీ ఉదయం 11.30 గంటలకు ఒంగోలు కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని వైద్యారోగ్యశాఖ అధికారులతోపాటు, ఫిర్యాదుదారుడైన చెన్నయ్యకు నోటీసులు ఇచ్చారు. ఉద్యోగోన్నతులకు సంబంధించిన మెరిట్ జాబితాలతోపాటు అందుకు సంబంధించిన అన్ని ఫైళ్లను అందుబాటులో ఉంచాలని ఆ నోటీసుల్లో ఆమె పేర్కొన్నారు.

# దాహార్తి తీర్చుదాం

## జిల్లాలో 600కుపైగా చలివేంద్రాల ఏర్పాటుకు చర్యలు

- పంచాయతీలు, స్వచ్ఛంద సంస్థల సహకారం
- అందుబాటులో ఓఆర్ఎస్ ప్యాకెట్లు
- వేసవి నేపథ్యంలో యంత్రాంగం చర్యలు
- ఎండల తీవ్రతపై కరపత్రాల ద్వారా ప్రజలకు అవగాహన



దర్శిలో రెండురోజుల క్రితం చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రోజురోజుకూ ఎండల తీవ్రత పెరుగుతుండటంతో ప్రజల దాహార్తిని తీర్చేందుకు అధికార యంత్రాంగం ఉపక్రమించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాలతో పంచాయతీ అధికారులు కదిలారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల ప్రధాన కూడళ్లు, బస్టాండ్ సెంటర్లలో చలివేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు ప్రారంభించారు. కొన్నిచోట్ల మజ్జిగ కేంద్రాలు కూడా ఏర్పాటు చేయనున్నారు. పక్షంరోజులుగా జిల్లాలో ఎండతీవ్రతతోపాటు వేడిగాలులు వీస్తున్నాయి. రానున్న రోజుల్లో మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లాలో 729 గ్రామ పంచాయతీలు ఉండగా, కనీసం 650 చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.



**ఎండ తీవ్రతపై అప్రమత్తం**

వైద్యారోగ్యశాఖ సహకారంతో చలివేంద్రాల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లను కూడా అందుబాటులో ఉంచనున్నారు. ఎండల నుంచి రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కూడా కల్పించనున్నారు. అందుకోసం విస్తృతంగా కరపత్రాల పంపిణీతో పాటు, ప్రత్యేక కార్యక్రమాలను కూడా నిర్వహించాలని నిర్ణయించారు. ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంత ప్రజలతో పాటు అటుగా ప్రయాణం చేసే వారికి కూడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు.

కలెక్టర్ తమీమ్ అన్సారియా ఇటీవల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఆమె ఆదేశాలతో జిల్లా పంచాయతీ అధికారి గొట్టిపాటి వెంకటనాయుడు చర్యలు చేపట్టారు. గ్రామ పంచాయతీల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కార్యదర్శులు,

**దాతల సహకారంతో మజ్జిగ కేంద్రాలు**

ఈవోఆర్‌డీలు, డీఎల్‌పీవోలకు సర్క్యులర్‌ను జారీ చేశారు. గ్రామపంచాయతీలతోపాటు స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని కూడా తీసుకొంటున్నారు. మేజర్ పంచాయతీల్లో కనీసం ఒక చలివేంద్రం, ఒక మజ్జిగ కేంద్రం ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేస్తున్నారు.

**జిల్లావ్యాప్తంగా చలివేంద్రాలు ఏర్పాటు**

**గొట్టిపాటి వెంకటనాయుడు, డీపీవో**

జిల్లాలో ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని అన్ని గ్రామ పంచాయతీల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కార్యదర్శులను ఆదేశించాం. స్వచ్ఛంద సంస్థల సహకారంతో మజ్జిగ కేంద్రాల ఏర్పాటుతోపాటు గ్రామంలోని ముఖ్యకూడళ్లతోపాటు బస్టాండు, మార్కెట్ల వద్ద ఈ చలివేంద్రాలు ఏర్పాటు చేస్తాం.



ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలో నవమి వేడుకలు



నిర్మల్‌నగర్‌లో స్వామివారి కల్యాణం



రంగారాయుడు చెరువు కట్టపై..



ఓబన్నపాలెంలో ఎమ్మెల్యే బీఎన్ పూజలు

# శ్రీసీతారాముల కల్యాణం చూతము రారండీ..!

- ఘనంగా శ్రీరామనవమి వేడుకలు
- వైభవంగా సీతారాముల కల్యాణాలు
- పలు చోట్ల భక్తులకు అన్నప్రసాదాలు



లాయర్‌పేటలో శిద్దా రాఘవరావు పూజలు



ఉప్పుగుండూరులో కోలాట ప్రదర్శన



కొండపిలో కల్యాణ కార్యక్రమం

ఒంగోలు కల్చరల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి పండుగను ఆదివారం ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. జిల్లాకేంద్రమైన ఒంగోలు నగరం పోలీస్‌క్వార్టర్స్‌లో ఉన్న శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. ఎస్పీ ఆర్.దామోదర్ దంపతులు కల్యాణకర్తలుగా వ్యవహరించారు. పట్టువస్త్రాలను సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఎం.రమణదీక్షితులు, వేదపండితులు దక్షణామూర్తి మంత్రోపచరణాల మధ్య సీతారాముల కల్యాణం నిర్వహిచారు. పోలీసు కుటుంబాలతోపాటుగా వందలాది మంది కల్యాణోత్సం తిలకించారు. అన్నదానం జరిగింది. కార్యక్రమంలో సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్, ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, నగర మేయర్ గంగాడ సుజాత, డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, పోలీసు అధికారులు పాల్గొన్నారు. నిర్మల్‌నగర్ పార్క్ వద్ద ఏర్పాటుచేసిన శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా ప్రముఖ వేద పండితులు పరాంకుశం కేశవాచార్యులు యాజ్ఞీకంలో సీతారామ కల్యాణం కన్నుల పండుగగా జరిగింది. నిర్వహణ కమిటీ గౌరవాధ్యక్షులు తాటిపర్తి గోపాల్‌రెడ్డి, డాక్టర్ కె.సీతారామయ్య, నాగబోయిన భాస్కర్‌రావు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. లంబాడి డొంక, సత్యనారాయణపురం, కొణిజేడు బస్టాండు, గద్దలగుంట, కొత్తమామిడిపాలెం ప్రాంతాల్లో కల్యాణోత్సవాలు ఘనంగా జరిగాయి

మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతుల ఆధ్వర్యంలో స్థానిక లాయర్‌పేట సాయిబాబా మందిరంలో సీతారాముల కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. బ్రాహ్మణ సేవాసమితి ఆధ్వర్యంలో స్థానిక గడియారం వారి వీధి శ్రీ అనంతకోదండరామ స్వామి దేవస్థానం వద్ద సీతారామ కల్యాణం ఘనంగా జరిగింది. ధర్మకర్త గడియారం సుబ్బయ్యశర్మ స్వామివార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. ఇక స్థానిక జడ్పీకాలనీలో ప్రముఖ జ్యోతిష్య వాస్తు పండితులు అగస్త్యరాజు శివసుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో కల్యాణోత్సవం జరిగింది. స్థానిక మంగమూరు రోడ్డు జడ్పీకాలనీలో భగవాన్ శ్రీసత్యసాయిబాబా మందిరంలో శ్రీరామనవమి సందర్భంగా శ్రీసీతారాముల కల్యాణం కన్నులపండువగా జరిగింది. సేవాసమితి కన్వీనర్ కోడెల శ్రీనివాసరావు, భక్తులు పాల్గొన్నారు. స్థానిక సీతారాంపురం శ్రీసీతారామస్వామి దేవస్థానంలో ఆదివారం రాత్రి జరిగిన కళ్యాణోత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఇక స్థానిక సంతపేట, బండ్లమిట్ట, మంగమూరు రోడ్డు అచలానంద ఆశ్రమం, పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానం, గద్దలగుంట నెహ్రూ బొమ్మ మొదలైన పలుచోట్ల ఏర్పాటుచేసిన పందిళ్లలో సైతం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి.

### టీడీపీ కార్యాలయంలో...

ఒంగోలు కార్పొరేషన్: ఒంగోలులోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శ్రీరామనవమి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాముల కళ్యాణం జరిపించారు. మేయర్ గంగాడ సుజాత, నగర అధ్యక్షులు కొఠారి నాగేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి బండారు మదన్, నాయుకులు నిడమనూరి పావని, కామరాజుగడ్డ కుసుమకుమారి, హాజీ మున్నీసా, మురళీ తదితరులు పాల్గొన్నారు.

### రంగారాయుడు చెరువు కట్టపై..

ఒంగోలు కలెక్టరేట్: స్థానిక రంగారాయుడు చెరువుకట్టపై ఉన్న వాకర్స్ జిమ్‌లో ఆదివారం శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వాకర్స్ నిర్వహకుడు సైనం మల్లికార్జునరావు ఆధ్వర్యంలో వాకర్స్‌కు వడపప్పు, పానకం పంపిణీ చేశారు. కార్యక్రమంలో లాయర్ రంగారావు, శ్రీనివాస్ నాయుడు, సామా సుబ్బారావు, చలపతి, శరత్‌బాబు, శ్రీదేవి, భారతి, షాలినిహుస్సేన్, వెంకటేశ్వర్లు, ఆచారి, గోపాల్‌రెడ్డి, రమాప్రసాద్, ఝాన్సీ ఇందిర, ఉమామహేశ్వరి, కె.గాయత్రి, చిరంజీవి, మస్తాన్‌రావు పాల్గొన్నారు.

### మూల్యాంకనం కేంద్రంలో..

ఒంగోలు విద్య: స్థానిక డీఆర్ఆర్ఎం మునిసిపల్ హైస్కూలులో జరుగుతున్న పదో తరగతి పరీక్షల జవాబుపత్రాల మూల్యాకనం కేంద్రంలో ఆదివారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాముడు చిత్రపటానికి డీఈవో ఎ.కిరణ్‌కుమార్ పూలమాల వేసి నమస్కరించారు. మూల్యంకనంలోని ఏసీవోలు, సీఈలు, ఏఈలు తీర్థప్రసాదాలు స్వీకరించారు. 1200 మందికి వడపప్పు పానకం ఏర్పాటు చేశారు. పండుగ సందర్భంగా పలువురు సంప్రదాయ వస్త్రధారణలో మూల్యాంకన విధులకు హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సుల జవాబుపత్రాల మూల్యాంకనం, సంస్కృత మూల్యాంకనం కూడా ప్రారంభమైంది.

### ఒంగోలు మండలంలో..

ఒంగోలు(రూరల్): ఒంగోలు మండలంలో గ్రామగ్రామాన ఆదివారం శ్రీరామనవమి కల్యాణ మహోత్సవాలు ప్రజలు వైభవంగా నిర్వహించారు. కరవదిలో శ్రీవేణుగోపాలస్వామి దేవాలయం, దేవరంపాడులోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయం, యరజర్ల, వలేటివారిపాలెంలోని శ్రీకోదండరామస్వామి వారి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులకు వడపప్పు, పానకాలు పంపిణీ చేశారు. ఒంగోలు నగరంలో విలీన గ్రామాల్లోను శ్రీరామనవమి వేడుకలు వైభవంగా నిర్వహించారు.

### నాగులుప్పలపాడు మండలంలో..

నాగులుప్పలపాడు: మండలంలో శ్రీరామనవమి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. ఓబన్నపాలెం కోదండరామాలయంలో మాజీ సర్పంచ్ వక్కంటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన నవమి వేడుకల్లో ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండవ ప్రసాద్, పోలినేని సింగారావు తదితరులు పాల్గొన్నారు. ప్రసిద్ధిగాంచిన చదలవాడ శ్రీరఘునాయకస్వామి దేవాలయంలో ఈవో దొంతా అనిల్, ఉప్పుగుండూరు గ్రామంలోని కమ్మవారి రామ మందిరంలో కమిటీ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఉప్పుగుండూరులో మన్నె అజయ్ అన్నదానం చేశారు. అనంతరం రాత్రి గ్రామంలో విద్యుత్ కాంతులతో అలంకరించిన ఎద్దుల బండిపై స్వామి వార్ల గ్రామోత్సవం నిర్వహించారు. దిన్నె మీద దుర్గాదేవి కోలాట బృందంచే కోలాట ప్రదర్శన చేశారు.

### సంతనూతలపాడులో..

సంతనూతలపాడు: మండలంలో పలుగ్రామాల్లో ఆదివారం శ్రీరామనవమి పండుగను ఘనంగా నిర్వహించారు. సంతనూతలపాడులోని కోదండరామస్వామి ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు వడపప్పు, పానకం అందించారు.

### చీమకుర్తిలో..

చీమకుర్తి: శ్రీరామనవమి పర్వదిన వేడుకలు ఆదివారం చీమకుర్తిలో ఘనంగా జరిగాయి, పలుచోట్ల సీతారాముల కల్యాణ మహోత్సవం కమనీయంగా నిర్వహించారు. పట్టణంలోని పల్లపోతువారి వీధి, గాంధీనగర్, గరికమిట్ట, తూర్పుబజార్‌లో ఉన్న రామాలయాల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొని పూజలు చేశారు. పులికొండ గ్రామంలోని దేవాలయంలో ఎమ్మెల్యే బీఎస్.విజయ్ కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. ముదివర్తి రాధాకృష్ణమూర్తి పంతులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

### కొండపి మండలంలో..

కొండపి: శ్రీరామనవమి వేడుకలు ఆదివారం మండలంలోని గ్రామగ్రామాన కన్నులపండువగా జరిగాయి. కొండపిలోని కోదండరామస్వామి ఆలయ ఆవరణలో అర్చకులు పరాంకుశం శ్రీనివాసాచార్యులు సీతారామ కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పలువురు దంపతులు పూజల్లో పాల్గొన్నారు. అదేవిధంగా కట్టావారిపాలెం, కె.ఉప్పలపాడు, ముప్పవరం, పెరిదేపి, పెదకండ్లగుంట తదితర గ్రామాల్లోని రామాలయాల వద్ద కల్యాణ కార్యక్రమం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని ముప్పరాజువారిపాలెంలో ఆనవాయితీగా శ్రీరామ నవమి వేడులకు గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో వడపప్పు, పానకంతోపాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

### సింగరాయకొండలో..



శ్రీరామ్‌నగర్ రామాలయంలో..

సింగరాయకొండ: మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు కమనీయంగా నిర్వహించారు. సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని రైల్వేస్టేషన్ రోడ్డు, శ్రీరామ్‌నగర్, పాత సింగరాయకొండ, పాలక, బింగినపల్లి పలు గ్రామాల్లోని రామాలయాల్లో సీతారాముల కల్యాణమహోత్సవం వైభవంగా జరిగింది. భక్తులకు తీర్థప్రసాదాలు, స్వామి ఆశీస్సులు అందజేశారు.

### మద్దిపాడు మండలంలో..

మద్దిపాడు: మండలంలో శ్రీరామనవమి వేడుకలను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మద్దిపాడు, సీతారాంపురం, బసవన్నపాలెం, కోవివారిపాలెం గ్రామాల్లో దేవాలయాల్లో వేదపండితులు శాస్త్రోక్తంగా సీతారాముల కల్యాణోత్సవాలు నిర్వహించి ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. మద్దిపాడులో వేదపండితులు రమేష్ ఆధ్వర్యంలో కల్యాణం కళ్యాణం నిర్వహించగా, సీతారాంపురంలో మారెళ్ల మారుతీరావు నేతృత్వంలో కార్యక్రమం జరిగింది. సర్పంచ్ మండవ శివానందరావు, మారెళ్ల హరికుమార్, ఎం.రమేష్‌బాబు, బసవన్నపాలెంలో టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు దంపతులు కల్యాణంలో పాల్గొన్నారు. కోవివారిపాలెంలో పురాతన దేవాలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. ఆయా దేవాలయాల్లో అన్నసంతర్పణ జరిగింది.

## బౌద్ధ స్థూపాలకు పూర్వ వైభవం తీసుకురావాలి



మాట్లాడుతున్న భిక్షువులు

చీమకుర్తి, ఏప్రిల్6(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని 40 ప్రముఖ బౌద్ధ స్థూపాలకు పూర్వవైభవం తీసుకురావటానికి కూటమి ప్రభుత్వం చేయుత అందించాలని జపాన్, శ్రీలంక దేశాలకు చెందిన బౌద్ధభిక్షువులు యూపి, బోధిహన్‌లు కోరారు. జిల్లాలోని చందవరం స్థూపాన్ని సందర్శించిన తదుపరి ఆదివారం చీమకుర్తికి విచ్చేచిన వీరు పట్టణంలోని కౌన్సిలర్ ఆముదాలపల్లి ప్రమీల గృహంలో జరిగిన ప్రెస్‌మీట్‌లో పలు విషయాలను తెలిపారు. రాష్ట్రంలోని ఉన్న ప్రతీ స్థూపం వద్ద దీపోత్సవాన్ని చేపడుతున్నామని చెప్పారు. నిజమైన సనాతన ధర్మం బౌద్ధం నుంచే ప్రజలకు లభిస్తుందన్నారు. అమరావతిలో మూడెకరాల భూమిని కేటాయిస్తే బౌద్ధ ధర్మాన్ని కాపాడటానికి చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు.

## సామాజిక విలువలు నేర్పించాలి

ఒంగోలు(రూరల్), ఏప్రిల్6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సామాజిక విలువలతో కూడిన విద్యను బోధించాలని ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్ కోరారు. ఆదివారం ఒంగోలులోని జూబ్లియంట్ పాఠశాల వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే బీఎన్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు వ్యక్తిగత శ్రద్ధ చూపించాలని, అపుడే వారిలోని సృజనాత్మకత బయటకు వస్తుందన్నారు. కమర్షియల్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ ఆర్.వేణుగోపాల్, డాక్టర్ కొర్రపాటి సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులు మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచాలన్నారు. అనంతరం పలు పోటీల విజేతలకు ఎమ్మెల్యే బీఎన్ బహుమతులను అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ దిలీప్‌కుమార్, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

## రాజ్యాధికారం కోసం ఐక్యంగా పోరాడాలి

- లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు విజయ్‌కుమార్

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీ, అణగారిన వర్గాలకు న్యాయం జరగాలంటే రాజ్యాధికారం కావాలని, అందుకోసం ఐక్యంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, రిటైర్డ్ ఐఎస్ అధికారి జీఎస్ఆర్‌కే.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలులోని అంబేడ్కర్ భవన్‌లో జరిగిన ఓ సదస్సులో ఆయన మాట్లాడుతూ 400 ఎంపీ సీట్లు వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేస్తామని ఆర్ఎస్ఎస్ బహిరంగ ప్రకటన చేయడం దుర్మార్గమైన ఆలోచన అన్నారు. రాజ్యాంగం సవరణ, రద్దు చేయాలనే చూస్తే మరో స్వాంత్ర్య ఉద్యమం తప్పదని హెచ్చరించారు. లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు దమ్ము కేశవ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు దాసరి చెన్నకేశవులు, వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌జే.విద్యా సాగర్, అంబేద్కర్ ఇండియా మిషన్ ఉపాధ్యక్షులు తేక్వాండో శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు లాంఛనాలతో ఏఎస్ఐ అంత్యక్రియలు



ఏఎస్ఐ వేణుగోపాలరావు అంత్యక్రియల్లో గాలిలోకి కాల్పులు జరుపుతున్న పోలీసులు

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఎస్పీ కార్యాలయంలోని ఐటీ కోర్ విభాగంలో ఏఎస్ఐగా పనిచేస్తూ మృతి చెందిన కె.వేణుగోపాలరావు అంత్యక్రియలు ఆదివారం స్వగ్రామం నాగులుప్పలపాడు గ్రామంలో పోలీసు లాంచనాలతో జరిగాయి. ఏఎస్ఐ వేణుగోపాలరావు అంతిమయాత్ర కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు, పోలీసు అధికారుల అశ్రునయనాలతో సాగింది. ఈ సందర్భంగా ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు మూడుసార్లు గాలిలోకి కాల్పులు జరిపి ఏఎస్ఐ వేణుగోపాలరావు మృతదేహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐ శ్రీకాంత్‌బాబు, ఐటీకోర్ సీఐ సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణను ఉపసంహరించుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బొల్లా వసంతరావు ఆదివారం వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. స్థానిక కలెక్టరేట్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద కూలి పనులు చేసుకునే వేషాధారణతో నిరసన చేపట్టారు. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ వ్యతిరేకమన్నారు. అందువల్ల ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకొని మాలలకు అండగా నిలువాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## వక్ఫ్ బిల్లు సవరణపై నిరసన

సంతనూతలపాడు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): పేర్నమిట్ట సమీపంలోని పీర్లమాన్యంలో ఆవాజ్‌కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం వక్ఫ్ బిల్లు సవరణపై నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు, బంకా సుబ్బారావు, కమిటీ జిల్లా అధ్యక్షులు షేక్ యాసిన్, హుస్సేన్, కాలేషా, నూర్‌మహమ్మద్, చోటు, సయ్యద్‌మౌలాలీ, ఖాదర్ పాల్గొన్నారు.

## 'ఆదిమూలపు'పై మండిపడిన టీడీపీ నేతలు



వైసీపీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న టీడీపీ మాదిగ నేతలు

సింగరాయకొండ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వాన్ని దోషిగా చూపుతూ ఎస్సీ వర్గీకరణపై వైసీపీ నేత మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ చేసిన వ్యాఖ్యలపై టీడీపీ మాదిగ నేతలు మండిపడ్డారు. టీడీపీ స్థానిక కార్యాలయంలో ఆ పార్టీ మాదిగ నేతలు ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణపై వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఏనాడు ఎమ్మార్పీఎస్‌కు మద్దతు ప్రకటించలేదన్నారు. వర్గీకరణపై శాసనసభలో చర్చ జరగుతుంటే తన 11 మంది ఎమ్మెల్యేలను శాసనసభలోకి రానీయలేదని, శాసనమండలిలో మెజార్టీ ఉందని కూటమి ప్రభుత్వం బిల్లుపెడితే అడ్డుకోవాలనే ప్రయత్నంతో రెండు నాలుకల ధోరణి ప్రదర్శించిన విషయం నిజం కాదా అని ప్రశ్నించారు. వర్గీకరణ చేస్తానని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టి వర్గీకరణ చేసి చూపిన సీఎం చంద్రబాబు, మంత్రి శ్రీడోలా బాలవీరాంజనేయస్వామికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్సీ సెల్ నాయకులు పొనుగోటి కొండయ్య, రేణుమాల పోతురాజు, గర్నెపూడి సుబ్రహ్మణ్యం, రావినూతల జయకుమార్, డొక్కా కిషోర్, గౌడుపేరు కిషోర్‌బాబు, రావినూతల ఏడుకొండలు పాల్గొన్నారు.

## హోరాహోరీగా క్రికెట్ పోటీలు



గోపికి మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌ను అందజేస్తున్న శ్రీనివాసరావు

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని బీమ్ సేవా సమితి, బీమ్ ప్రగతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు ఆదివారం హోరాహోరీగా సాగాయి. స్థానిక మంగమూరు రోడ్‌లోని మర్రిచెట్టు సమీపంలోని జరిగిన మ్యాచ్‌లో వెంగముక్కల లగాన్ టీమ్, ఆర్‌సీబీ జట్లు పోటీ పడ్డాయి. ఈ పోటీలో ఆర్‌సీబీ జట్టు విజయం సాధించగా, జట్టు లోని గోపి 84 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌ను కైవసం చేసుకున్నారు. న్యాయవాది కరేటి శ్రీనివాసరావు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఎం.ఆదినారయణ, ఆర్.వల్లూరయ్య, పిల్లి శ్రీరాములు, అంగలకుర్తి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మలను సత్కరిస్తున్న మన్నం శ్రీధర్, నాయకులు

## ఘనంగా బూచేపల్లి పుట్టినరోజు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఒంగోలులోని వైసీపీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన కేక్‌ను శివప్రసాద్‌రెడ్డి కట్ చేశారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ కేక్‌ను ఆమె కుమారుడైన శివప్రసాద్‌రెడ్డికి తినిపించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులు శివప్రసాద్‌రెడ్డిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, నాయకులు మన్నం శ్రీధర్, వేమా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## కరవదిలో అన్నదానం



అన్నదానం చేస్తున్న మురళీకృష్ణ

ఒంగోలు(రూరల్), ఏప్రిల్6 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం కరవది గ్రామంలో ఆదివారం సూర్యశ్రీ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు ముండవ మురళీకృష్ణ చలివేంద్రాన్ని ప్రారంభించారు. అలాగే శ్రీరామనవమి సందర్భంగా అక్కడే అన్నదానం చేశారు. కార్యక్రమంలో మండవ సుబ్బారావు, షేక్ సర్దార్‌బాషా, అలా హనుమంతరావు, పాటిబండ్ల వెంకటేశ్వర్లు, మండవసాయిసుందర్, బొడ్డపాటి వెంకట్, వెంకటేశ్వర్లు, జాలయ్య పాల్గొన్నారు

## చలివేంద్రాలు ప్రారంభం

సంతనూతలపాడు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులోని ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద శిఘాకొల్లి సత్యనారాయణ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం ఎస్ఐ వి.అజయ్‌బాబు ప్రారంభించారు. కార్యక్రమంలో వేమా మల్లేశ్వరరావు, ఎస్.సత్యనారాయణ, ఆంజనేయులు, సీహెచ్‌వీ.క్రిష్టారావు పాల్గొన్నారు. స్థానిక బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జోన్ చైర్మన్ గోవర్ధన్ ప్రారంభించారు.

### అద్దంకిబస్టాండులో..

ఒంగోలు కలెక్టరేట్: శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం స్థానిక అద్దంకిబస్టాండులో కోటీస్ షాపింగ్‌మాల్ అధినేత కోటి సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేందాన్ని రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సాంబశివరావు ప్రారంభించారు. త్వైకాండో పోటీ వితజేలకు మెడల్స్, ప్రతిభ సర్టిఫికెట్లతో అభినందించారు.

# కారుమంచి కెనాల్ పునరుద్ధరణకు చర్యలు

- రూ.2.65కోట్ల డీఎంఫ్ నిధులతో శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు
- ఎన్ఆర్ఐల సహకారం ఆదర్శనీయం
- ఎమ్మెల్యే విజయ్‌కుమార్



కేవీపాలెంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

చీమకుర్తి, ఏప్రిల్6(ఆంధ్రజ్యోతి): కారుమంచి కెనాల్ శాశ్వత ప్రాతిపదికన పునరుద్ధరించటానికి చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం కారుమంచి కెనాల్‌ను ఎన్ఆర్ఐలు నల్లూరి వెంకటశేషయ్య, తక్కెళ్లపాటి రమేష్‌లతో కలిసి పరిశీలించారు. చీమకుర్తి శివారున మదుకాన్ గ్రానైట్ క్వారీలో మూడేళ్ల క్రితం కారుమంచి మేజర్ కాలువలో కొంతభాగం కుప్పకూలిపోయింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ సంఘటన జరిగినా దాని పునరుద్ధరణకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. కాలువను తాత్కాలిక ప్రాతిపదికన బైపాస్ చేసి కొంతమేర సాగు, తాగునీటిని మేజర్ ద్వారా సరఫరా చేస్తూ వస్తున్నారు. కానీ దీనివల్ల అవసరాలు అరకొరగా తీరుతున్నాయి. దీంతో మేజర్ పరిధిలోని దాదాపు 20గ్రామాల్లో 15వేల ఎకరాలకు పంటలకు సాగునీరు అందడం లేదు. 5నోటిఫైడ్ చెరువులను నింపలేకపోతుండటంతో ప్రజలకు తాగునీటి కష్టాలు ఏర్పడ్డాయి. దీంతో మేజర్ పరిధిలో కూనంనేనివారిపాలెంకు చెందిన ఎన్ఆర్ఐ, నల్‌సాఫ్ట్ సంస్థ అధినేత నల్లూరి వెంకటశేషయ్య దృష్టికి ప్రజలు తాము పడుతున్న ఇక్కట్లు గురించి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన శేషయ్య కారుమంచి మేజర్ ఆసాంతం దాదాపు రూ.10లక్షలకు పైగా సొంత నిధులతో జంగిల్‌క్లియరెన్స్ పనులు చేపట్టటంతో పాటు శిథిలమైన హెడ్ స్థానంలో కొత్తదానిని ఏర్పాటు చేసి రబీ సీజన్‌కు సాగునీటి ఇబ్బందులు కలుగకుండా చేశారు. అయితే పూర్తిస్థాయిలో దెబ్బతిన్న కాలువను పునరుద్ధరణ కోసం రైతులు ఎన్ఆర్ఐలు నల్లూరి వెంకటశేషయ్య, తక్కెళ్లపాటి రమేష్‌లకు సమస్యను వివరించారు. దీంతో వీరిద్దరూ ఎమ్మెల్యే విజయ్‌కుమార్ దృష్టికి కాలువ విషయాన్ని తీసుకెళ్లారు. వెంటనే స్పందిచిన ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ఆదివారం ఎన్ఆర్ఐలతో కలిసి కారుమంచి మేజర్‌ను పరిశీలించారు. అనంతరం కేవీపాలెంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను ఎన్నికల ప్రచారం ఇచ్చిన హామీని గుర్తుచేస్తూ రెండువారాల్లో పునరుద్ధరణకు అవసరమైన నిధులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. దీనికోసం రూ.2.65కోట్లు అవసరమని ఇరిగేషన్ అధికారులు తెలుపగా డీఎంఎఫ్ నిధులను ఉపయోగించి శాశ్వతప్రాతిపదికన మేజర్‌కు మరమ్మతులు చేసేలా ఉన్నతాధికారులతో మాట్లాడి మంజూరు చేయిస్తానని రైతులకు హామీ ఇచ్చారు. ఈ విషయంలో ఎన్ఆర్ఐలు వెంకటశేషయ్య, రమేష్‌ల కృషి ఆదర్శనీయం అన్నారు. త్వరలోనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. సమావేశంలో డీసీ అధ్యక్షుడు పాలడుగు వెంకటనారాయణ, మన్నం ప్రసాద్, గొట్టిపాటి రాఘవరావు, కొత్రగడ్డ రమణయ్య, రావిపాటి రాంబాబు, యడ్లపల్లి రామబ్రహ్మం, ఎని కపాటి లక్ష్మీనరసయ్య, సాగునీటి సంఘ బాధ్యులు పాలడుగు వెంకట నారాయణ, గోగినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

- ఉత్సాహంగా పాల్గొన్న శ్రేణులు



ఒంగోలులో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆవిర్భావ వేడుకలు జిల్లావ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ఒంగోలులో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ నిడమానూరి సూర్యకల్యాణ్‌చక్రవర్తి ఆధ్వర్యంలో స్థానిక చెన్నకేశవ నగర్ వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. మోటార్ సైకిల్ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసులు, కన్వీనర్ వైసీ.యోగయ్యయాదవ్ పీవీ.శివారెడ్డి, ఇన్‌చార్జి రవిశంకర్, డాక్టర్ నరసింహారావు, బొద్దులూరి ఆంజనేయులు, శివాజీయాదవ్, రాయపాటి అజయ్‌కుమార్, దండు శ్రీనివాసరావు, కాటా రాధాకృష్ణమూర్తి, కావూరి వాసు, కటారి సుధాకర్, ఆనంద్, పువ్వాడ దామోదర్, తీగల సత్యవతి, గుర్రం రంగనాథ్, గుర్రం సత్యనారాయణ, పి.తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

**నాగులుప్పలపాడు:** బీజేపీ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం నాగులుప్పలపాడులో ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షురాలు పొద అపర్ణ ఆధ్వర్యంలో జెండాను రాష్ట్ర నాయకులు దారా సాంబయ్య ఆవిష్కరించారు. స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తాళ్లూరి రమేష్‌బాబు, జాగర్లమూడి వీరాంజనేయులు, పెంట్యాల సుబ్బారావు, లచ్చంశెట్టి టేగ్రా, పెరికల రాజు, పొద వరప్రసాదరావు, కందిమళ్ల రమణ తదితరులు పాల్గొన్నారు.

**సంతనూతలపాడు:** సంతనూతలపాడు బస్టాండ్ వద్ద బీజేపీ ఆవిర్భావ వేడుకలను మండల అధ్యక్షుడు బి.కళ్యాణరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో దండి శ్రీనివాసరావు, పి.లక్ష్మణ్, బత్తుల ఆనంద్‌కుమార్, తెల్లమేకల శ్రీను, పి.సుబ్బారావు చెంచురెడ్డి, ఎం.సుబ్బారావు, శిరీష, అంజనీదేవి, శివపార్వతి తదితరులు పాల్గొన్నారు.

**కొండపి:** బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం కొండపి, ముప్పవరం, చోడవరం గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పొగాకు బోర్డు వైస్ చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య కొండపిలోని పార్టీ కార్యాలయంలో జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో పార్టీ మాజీ అధ్యక్షుడు బొడ్డపాటి వెంకటరావు, ప్రధాన కార్యదర్శి దొరడ్ల సుబ్బారావు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### జరుగుమల్లిలో..

జరుగుమల్లి బస్టాండ్ సెంటర్‌లో బీజేపీ జెండాను నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి మిడసల బాలకోటయ్య ఎగురవేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చాగంటి కోమటిరావు పాల్గొన్నారు.


తలంబ్రాల వేడుక

# కల్యాణం.. కమనీయం..

## భద్రాద్రిలో వైభవంగా సీతారాముల పరిణయం

దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచలంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఈ వేడుకకు సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించగా పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

భక్తి పారవశ్యంలో సినీ నటి కొణిదెల నిహారిక


ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న దేవదాయశాఖ మంత్రి కొండా సురేఖ

కల్యాణ వేడుకలో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, డిప్యూటీ సీఎం భట్టి దంపతులు

టీటీడీ తరపున పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చైర్మన్ బీఆర్ నాయుడు


కల్యాణం అనంతరం తిరువీధి సేవకు బయలుదేరిన సీతారాములు


రామాలయంలో అర్చక బృందంతో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు

# మిర్చి రైతుకు నష్టాల ఘాటు

మిర్చి ధరలు దారుణంగా పడిపోయాయి. వేలాది ఎకరాల్లో లక్షలాది రూపాయల పెట్టుబడులు పెట్టి సాగుచేసిన రైతులు తీవ్ర నష్టాల పాలయ్యారు. మొక్క దశలోనే తోటలకు నల్లి ఆశించి పంటపై తీవ్ర ప్రభావం చూపింది. అనంతరం ఏర్పడిన వర్షాభావంతో బోరుబావులు ఒట్టిపోయాయి. పంట దిగుబడి తగ్గిపోయింది. చివరకు కాసిన కొద్దిపాటి కాయలను కోసేందుకూ అధిక కూలీ ఇవ్వాల్సిన దుస్థితి ఏర్పడింది. వచ్చిన అరకొర దిగుబడిని అమ్ముకునే సమయంలో ధరలు పడిపోవడంతో రైతులు దిగాలు పడ్డారు. అప్పులు ఎలాతీర్చాలో పాలుపోక అయోమయంలో ఉన్నారు.


కల్లాల్లో ఆరబోసిన మిర్చిపై పట్టలు తొలగిస్తున్న రైతులు

**పెరిగిన పెట్టుబడి తగ్గిన దిగుబడి**

**దిగజారిన ధరలు**

**అక్కరకు రాని ప్రభుత్వ మద్దతు ధర**

**అప్పులపాలయ్యామని అన్నదాతల ఆవేదన**

పెద్ద దోర్నాల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రెండేళ్లుగా మిర్చి ధరలు అశాజనకంగా ఉండటంతో పెద్దదోర్నాల మండలంలో ఈ ఏడాది సుమారు 3,650 ఎకరాల విస్తీర్ణంలో పంట సాగుచేశారు. మొక్క నాటేదగ్గర నుంచి కాయలు కోసేవరకూ ఎకరాకు ఒక్కోరైతు రూ.1.25 లక్షలు ఖర్చు చేశారు. తెగుళ్ల, వర్షాభావం వంటి ప్రతికూల పరిస్థితులతో దిగుబడి సగానికి సగం తగ్గింది. క్వింటా కాయలు కోయడానికే 15 మంది కూలీలు అవసరమయ్యారంటే రైతు పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. కూలీలకు ఒక్కొక్కరికి రూ.600లు చొప్పున చెల్లించాల్సి వచ్చింది. వారిని తరలించే ఖర్చు, మేస్త్రీ మామూలు కలిసి రూ.650లు పడుతోంది. ఈ ప్రకారం క్వింటా కాయలు కోయాలంటే రైతుకు రూ.9,750 లు అవుతోంది. క్వింటా కాయలకు ప్రస్తుతం మార్కెట్‌లో ధర రూ. 9,000 పలుకుతోంది. ఈ లెక్కన వచ్చిన దిగుబడి కోత కూలీకే సరిపోవడం లేదు. ఈ తరుణంలో పురుగు మందుల దుకాణాల్లో ఏమి ఇవ్వాలి, తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలి, ఇంటిల్లిపాది చేసిన చాకిరీని తలచుకొని కర్షకులు కుమిలిపోతున్నారు. తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కాక కంటికి కునుకు రావడం లేదని రైతులు వాపోతున్నారు. వచ్చిన అరకొర దిగుబడులను శీతల గిడ్డంగుల్లో నిల్వ చేద్దామంటే రెండేళ్ల క్రితం పెట్టిన కాయలు ఇంకా అలానే ఉన్నాయి. కాయలు కోసేందుకు వచ్చిన కూలీలకు తక్షణమే నగదు చెల్లించాల్సి రావడంతో ధర తక్కువైనా అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని అంటున్నారు. ప్రభుత్వం స్పందించి మిర్చికి గిట్టుబాటు ధరను కల్పించి ఆదుకోవాలని కోరుతున్నారు.

**ప్రస్తుతం మిర్చిలో వివిధ రకాలకు ధరలు ఇలా ఉన్నాయి. బ్యాడిగ రకం క్వింటా ధర రూ. 7,000లు, తేజ రకం రూ.8,500ల నుంచి రూ.12,000లు, 341 రకం రూ.9,000ల నుంచి రూ.11,500ల వరకు కొనుగోలు చేస్తున్నారు.**

### కనీస ధర కోసం నిరీక్షణ

ఇటీవల ప్రభుత్వం మిర్చికి కనీస మద్దతు ధర రూ.11,750లను ప్రకటించింది. కానీ, ఇంత వరకు అమలు లోకి రాలేదు.ధర బాగా పడిపోవడంతో స్థానిక వ్యాపారులు కూడా మిరప కాయలను అడగడం లేదు. దీంతో పంటను ఇళ్లలోనే ఉంచలేక గుంటూరు మార్కెట్‌కు తరలించి నాణ్యతను బట్టి రూ.6,000ల నుండి రూ.10,000ల వరకు అమ్మకం చేస్తున్నారు. రూ.6వేలకు అమ్మిన వారికి ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం మిగతా రూ.5,750లు అందించాల్సి ఉంది. ఆమేరకు కూటమి ప్రభుత్వం అదుకోవాలని రైతులు కోరుతున్నారు.


గుంటూరు మిర్చి యార్డులో అమ్మకం కోసం పెట్టిన మిర్చి

### ప్రభుత్వం ఆదుకోవాలి



ఐదు ఎకరాల్లో మిరప సాగు చేశాను. 6లక్షలు ఖర్చయింది. ధరలు దిగజారాయి. ఈ సమయంలో ప్రభుత్వం మద్దతు ధర ఇచ్చి ఆదుకోవాలి. ఇక కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎక్స్‌పోర్ట్ ఆర్డర్లు వచ్చేలా కృషి చేయాలి. తద్వారా సరుకు బయటకు పోతే రేటు వచ్చే అవకాశం ఉంటుంది.

- సూర్యనారాయణ, రైతు దోర్నాల

### గిట్టుబాటు ధర కల్పించాలి



ఆరు ఎకరాల్లో మిరప సాగు చేశాను. పెట్టుబడులు రూ.7 లక్షల వరకు ఖర్చు వచ్చింది. అయితే ఈ ఏడాది పంట దిగుబడులు తగ్గాయి. కనీసం గిట్టుబాటు ధరలు ఉండాలి. క్వింటాలు ధర రూ. 18,000లు ఉంటేనే గిట్టుబాటవుతుంది. కనీసం ఆ ధర కూడా లేకపోవడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోతోంది.

- పత్తి వెంకటేశ్వర్లు, రైతు తిమ్మాపురం


బొడిచెర్లలో ఉత్సాహంగా బండ లాగుతున్న ఎడ్లజత

# ఉత్సాహంగా ఎడ్ల బలప్రదర్శన పోటీలు

మార్కాపురం రూరల్, ఏప్రిల్6 (ఆంధ్రజ్యోతి). మండలంలోని బొడిచెర్ల గ్రామంలో శ్రీరామ నవమి సందర్భంగా ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీలను గ్రామస్థులతో పాటు పరిసర ప్రాంతాల రైతులు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించారు. ఈ పోటీలలో ఎర్రగొండపాలెం మండలం వీరాయపాలెం గ్రామానికి చెందిన దూదేకుల పెద్ద చాంద్ ఎడ్లజత 2047.5 అడుగుల దూరం లాగి మొదటి బహుమతిని, మార్కాపురం మండలం బొడిచెర్ల గ్రామానికి చెందిన నక్షత్రారెడ్డి, సాయిరామ్‌రెడ్డిల ఎడ్లజత రెండవ బహుమతి, వేముల మండలం పెసరవాయి గ్రామానికి చెందిన సయ్యద్ కాలాబాషా ఎడ్లజత మూడవ బహుమతిని గెలుచుకున్నాయి.

రాచర్ల మండలం సత్యేలు గ్రామానికి చెందిన బత్తుల బాలరాజు ఎడ్లజత నాలుగవ బహుమతి, నంద్యాల జిల్లా సిరివెల్ల మండలం ఇసుకాపల్లి గ్రామానికి చెందిన దూదేకుల సిద్ధయ్య ఎడ్లజత ఐదవ బహుమతిని గెలుచుకున్నాయి. మొదటి బహుమతిగా రూ.45వేలు, రెండవ బహుమతి రూ.35 వేలు, మూడవ బహుమతిగా రూ.20,116 నాలుగవ బహుమతిగా రూ.10వేలు, ఐదవ బహుమతి రూ.5వేలు దాతల సహకారంతో అందజేశారు.

# ఆలివ్ రెడ్లీ తాబేళ్లను సంరక్షించాలి

**ఐటీసీ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సూరజ్ ప్రధాన్**

చినగంజాం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : ఆలివ్ రెడ్లీ తాబేళ్లను సంరక్షించుకోవలసిన బాధ్యత మత్స్యకారులపై ఉందని ఐటీసీ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సూరజ్ ప్రధాన్ అన్నారు. మండలంలోని కుంకుడుచెట్లపాలెం గ్రామ సమీపంలోని సముద్ర తీరంలో రాష్ట్ర అటవీశాఖ, ట్రీ ఫౌండేషన్ ఐటీసీ బంగారు భవిష్యత్ వారు ఏర్పాటు చేసిన సముద్ర తాబేళ్ల సంరక్షణ కేంద్ర నుంచి 231 తాబేళ్ల పిల్లలను ఆదివారం సముద్రంలోనికి వదిలారు. ట్రీ ఫౌండేషన్ జిల్లా సమన్వయకర్త శవనం చంద్రారెడ్డి మాట్లాడుతూ ఈ సంవత్సరం సముద్ర తాబేళ్ల రక్షణ దళ సభ్యులు 16 తల్లి తాబేళ్ల నుంచి 1,686 గుడ్లను సేకరించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 1,250 పిల్లలను సురక్షితంగా సముద్రంలోకి వదలినట్లు తెలిపారు. మత్స్యకారులకు, పర్యావరణ మనుగడకు తాబేళ్లు సహాయకారిగా ఉంటాయని తెలిపారు. సముద్ర తాబేళ్ల సమాచారాన్ని రక్షణ దళ సభ్యులకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో సముద్ర తాబేళ్ల రక్షణ దళ సభ్యులు కారాణి శ్రీను, వాటుపల్లి సుబ్బారావు, కారాణి భావ నారాయణలు పాల్గొన్నారు.


సముద్రంలోకి తాబేళ్ల పిల్లలను వదులుతున్న ట్రీ ఫౌండేషన్ సభ్యులు

**11కి మారిన ఆరోగ్యశాఖ మంత్రి ఒంగోలు పర్యటన**

ఒంగోలు, కార్పొరేషన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఒంగోలు పర్యటన ఈనెల 11కు మారింది. వాస్తవానికి ఈనెల 10న ఒంగోలు విచ్చేసి, జీజీహెచ్‌లోని గుండె సంబంధిత వార్డులో క్యాథ్‌లాబ్ ప్రారంభించి, వైద్యాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నట్లు జీజీహెచ్ అధికారులకు సమాచారం ఉంది.దీంతో వైద్యాధికారులు అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేశారు. అయితే పలు కారణాల చేత మంత్రి సత్యకుమార్ 11న విచ్చేయనున్నట్లు మంత్రి కార్యాలయం నుంచి జీజీహెచ్ అధికారులకు సమాచారం అందింది.

# సీబీజీ ప్లాంట్‌కు కేటాయించింది ప్రభుత్వ భూమే!

**'ఆంధ్రజ్యోతి'కి స్పందన**

**కలెక్టర్‌కు తహసీల్దార్ రజనీకుమారి నివేదిక**

**ఆధారాలతో అందజేత**

కురిచేడు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): కురిచేడు మండలంలో సీబీజీ ప్లాంట్‌కు కేటాయించిన భూమి ప్రభుత్వానిదేనని తహసీల్దార్ రజనీకుమారి జిల్లా కలెక్టర్‌కు నివేదిక ఇచ్చారు. 'రెవెన్యూ వర్సెస్ ఫారెస్ట్' శీర్షికన ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాలతో తహసీల్దార్ పూర్తిస్థాయిలో విచారించి నివేదిక సమర్పించారు. కురిచేడు మండలం గంగదొనకొండ గ్రామంలో సర్వే నంబర్లు 88, 90లలో 799.40 ఎకరాలు రిలయన్స్ ప్లాంట్‌కు కేటాయించి రెవన్యూ వరాలు అప్రూవల్ ఇచ్చారు. దీంతో రిలయన్స్ సంస్థ అక్కడ చిల్ల చెట్లు తొలగించే పనులు చేపట్టింది. ఈక్రమంలో శనివారం సాయంత్రం అటవీ శాఖాధికారులు వెళ్లి ఆ భూమి తమదంటూ పనులు నిలిపివేయించారు. దీనిపై తహసీల్దార్ రజనీకుమారి ఆ భూమి ఎఫ్ఎల్ఆర్ దాఖలా గయాలు అని ఉన్నదని, రెవెన్యూదేనని జిల్లా కలెక్టరుకు ఆదివారం పూర్తిస్థాయి విచారణ నివేదికను ఆధారాలతో సహా సమర్పించారు.



# సీఎం స్ఫూర్తితో జన్మభూమి రుణం తీర్చుకోవాలి

● ఎమ్మెల్యేలు కందుల, కూన

మార్కాపురం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్ఫూర్తితో విదేశాల్లో ఉన్న ఆంధ్రులు జన్మభూమి రుణం తీర్చుకునేందుకు నడుం బిగించాలని మార్కాపురం, ఆముదాలవలస ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి, కూన రవికుమార్‌లు పిలుపునిచ్చారు. అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రం డల్లాస్ నగరంలో శనివారం ఎన్ఆర్ఐ టీడీపీ ఫోరం ఆధ్వర్యంలో జరిగిన 'మీట్ అండ్ గ్రీట్ అవర్ ఎన్టీమ్డ్ ఎమ్మెల్యేస్' కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ఇప్పటికే ఎన్ఆర్ఐ టీడీపీ ఫోరం ఆధ్వర్యంలో రాష్ట్రంలోని పలు పట్టణాలు, గ్రామాలను దత్తత తీసుకుని అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. తెలుగువారు ఎక్కడున్నా అమెరికా, ఆంధ్రాకు అనుసంధాన కర్తలుగా వ్యవహరించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు కందుల, కూనలను ఎన్ఆర్ఐ టీడీపీ ఫోరం సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐలు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి, కూన రవికుమార్‌లను సన్మానిస్తున్న డల్లాస్‌లోని టీడీపీ ఎన్ఆర్ఐ ఫోరం సభ్యులు

# ఉత్సాహంగా క్రీడా పోటీలు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : ఆల్ ఇండియా బ్యాంకు ఎంప్లాయీస్ అసోసియేషన్ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని బ్యాంకు ఉద్యోగులకు పలు రకాల క్రీడా పోటీలను నిర్వహించారు. స్థానిక హైదరీక్లబ్‌లో ఆదివారం ఉద్యోగులకు క్యారమ్స్, షటిల్ పోటీలు నిర్వహించారు. బ్యాంకుల్లో పనిచేసే ఉద్యోగుల్లో ఐక్యత కోసం ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈనెల 12నుంచి మూడు రోజుల పాటు విజయవాడలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో విజేతలకు అసోసియేషన్ వ్యవస్థాపక దినోత్సవమైన 20వతేదీన బహుమతులు ప్రదానం చేస్తామని పీడీబీఈసీసీ సెక్రటరి రాజీవ్ రతన్‌దేవ్ తెలిపారు. ఈ క్రీడాపోటీల్లో బ్యాంకు ఉద్యోగులందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు సుబ్బారావు, రామయ్య ఉమాశంకర్, బ్రహ్మయ్య, బ్రహ్మానాయుడు, షేక్‌హసన్, ఏడుకొండలు, ఇతర కార్యవర్గ సభ్యులు ఉన్నారు.


క్యారమ్స్ ఆడుతున్న బ్యాంకు మహిళా ఉద్యోగులు

## అవీ..ఇవీ

### తాగునీటి సమస్యకు పరిష్కారం



తుమ్మలచెరువులో బోరు వేయిస్తున్న అధికారులు

తర్లుపాడు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మలచెరువులో రెండు నెలల నుంచి తీవ్ర మంచినీటి సమస్య నెలకొంది. ఈ విషయాన్ని గ్రామస్థులు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే తుమ్మలచెరువు గ్రామంలో బోరు వేయించి మంచినీటి సమస్య పరిష్కరించాలని ఆదేశించడంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తుమ్మలచెరువు గ్రామంలో డీప్‌బోరు వేయించారు. దీంతో గ్రామంలో కొంతమేర మంచినీటి సమస్య పరిష్కారం అవుతుందని ఏఈ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రావిబాసపతిరెడ్డి, పంచాయతీ సెక్రటరీ పద్మ, గ్రామ టీడీపీ అధ్యక్షులు సయ్యద్ మాబు వలి, షేక్ బొంబాయి వలి, షేక్ కాశీం వలి, సయ్యద్ మదర్సావలి, బద్రీ సయ్యద్ కుమార్, సయ్యద్ మోహిద్దీన్, రఫీ, కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

### దాహార్తి తీర్చేందుకే చలివేంద్రాలు




చలివేంద్రం ప్రారంభిస్తున్న నారాయణరెడ్డి

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయం అని మాజీ కౌన్సిలర్ కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక పాత బస్టాండ్‌లో రెడ్డిసంక్షేమ సేవాసంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత చలివేంద్రాన్ని నారాయణరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు గుంటక సుబ్బారెడ్డి, ఎం.వెంకటరెడ్డి, కె.రమణారెడ్డి, కె.రామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, గోరంట్ల చినవెంకటరెడ్డి, బలరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నాగేశ్వరరావుకు ఎన్టీఆర్ జాతీయరత్న అవార్డు



నాగేశ్వరరావుకు అవార్డు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

ఎర్రగొండపాలెంరూరల్ ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఉగాది పురస్కారాలలో భాగంగా ఎన్టీఆర్ జాతీయరత్న అవార్డుకు ఎర్రగొండపాలేనికి చెందిన పారిశ్రామికవేత్త, వైశ్యరత్న, కళా విభూషణ్ డాక్టర్ చీదెళ్ల నాగేశ్వరరావు ఎంపిక అయ్యారు. విశాఖపట్టణంలోని జిల్లా పౌరగ్రంథాలయంలో ఆదివారం అందుకు సంబంధించిన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్న దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ వ్యవస్థాపకులు పీఏ భాస్కరరావు, రైట్స్ ప్రొటక్షన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం.వరప్రసాద్, రాష్ట్ర కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బొమ్మిడి సత్యనారాయణ, ఉపకార చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కంచర్ల అచ్యుతరావు సినీనటి సీతల చేతులు మీదుగా ఈ అవార్డు అందుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ నాయకులు, పలు సంఘాల నాయకులు ఆయనను అభినందించారు.

### చెరువులకు మరమ్మతులు చేయరా.?



గండిపడిన పూసలపాడు చెరువు(ఫైల్)

బేస్తవారపేట, ఏప్రిల్6 (ఆంధ్రజ్యోతి): రెండు దశాబ్దాలకాలం నుంచి చెరువులకు గండి పడి వర్షపునీరు నీరు వృథాగా పోతున్నా, అధికారుల్లో చలనం కనిపించడంలేదు. సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరుతున్నప్పటికీ స్పందన లేకుండా ఉంది. బేస్తవారపేట మండలంలోని పూసలపాడు, కోనపల్లె, చెరువులకు మరమ్మతులు చేయకుండా వదిలేశారు. పూసలపాడు చెరువును 1975లో నిర్మించారు. నాటి నుంచి నేటికి నీటి నిల్వ కలగానే మిగిలింది. ఏటా మరమమ్మతులు చేయడం. మళ్లీ గండి పడడం పరిపాటి అయింది. చెరువు పరిధిలో 700 ఎకరాలు ఆయకట్టు నిరుపయోగంగా మారింది. అప్పటి నుంచి చెరువుకు గండి పడడం తూతూమంత్రంగా మరమ్మతులు చేయడం కాంట్రాక్టర్లకు జేబులు నింపుకోవడం కోసమే పనులు చేస్తున్నారని రైతులు విమర్శిస్తున్నారు. గత నాలుగేళ్ల క్రితం రూ.1.50 కోట్లతో పనులు చేస్తుండగా చిన్నపాటి వర్షానికి గండ్లు పడ్డాయి. దీంతో అప్పటికే రూ.60లక్షలు ఖర్చు చేశారు. నీరు వాగు పాలైంది. ఈ చెరువు కట్ట పూర్తిభాగాన్ని కాంక్రీంట్‌తో రివిట్‌మెట్ చేస్తే మినహా చెరువులో నీరు నిల్వ ఉండదని గ్రామస్థుల అభిప్రాయపడుతున్నారు. అయితే అధికారులు మరమ్మతుల కోసం మరోసారి రూ.15 కోట్లకు ప్రతిపాదనలు పంపారు. ఇక కోనపల్లె చెరువుకు కోట్ల రూపాయలు ఖర్చు చేసినా, చుక్కనీరు నిల్వ ఉండడంలేదు. కొండల్లో కురిసిన నీరంతా, గంటల వ్యవధిలోనే చెరువు సొరంగాల ద్వారా బయటకు వెళతోంది. దీంతో పలువురు నిపుణులు అనేక డిజైన్ రూపంలో మరమ్మతుల కోసం కోట్ల రూపాయాలు ఖర్చు చేశారు. అయినప్పటికీ, ఫలితం లేకపోయింది. ఈచెరువులకు మరమ్మతులు చేసి నీరు నిల్వ ఉండేలా పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

### బౌద్ధ స్థూపాలకు పూర్వ వైభవం తీసుకురావాలి



మాట్లాడుతున్న భిక్షువులు

చీమకుర్తి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని 40 ప్రముఖ బౌద్ధ స్థూపాలకు పూర్వవైభవం తీసుకురావడానికి కూటమి ప్రభుత్వం చేయూత అందించాలని జపాన్, శ్రీలంక దేశాలకు చెందిన బౌద్ధభిక్షువులు యూపి, బోధిహన్‌లు కోరారు. జిల్లాలోని చందవరం స్థూపాన్ని సందర్శించిన తదుపరి ఆదివారం చీమకుర్తికి విచ్చేసిన వీరు పట్టణంలోని కౌన్సిలర్ ఆముదాలపల్లి ప్రమీల గృహంలో జరిగిన ప్రెస్‌మీట్‌లో పలు విషయాలను తెలిపారు. రాష్ట్రంలోని ఉన్న ప్రతీ స్థూపం వద్ద దీపోత్సవాన్ని చేపడుతున్నామని చెప్పారు. నిజమైన సనాతన ధర్మం బౌద్ధం నుంచే ప్రజలకు లభిస్తుందన్నారు. అమరావతిలో మూడెకరాల భూమిని కేటాయిస్తే బౌద్ధ ధర్మాన్ని కాపాడటానికి చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు.









మార్కాపురంలో కల్యాణమూర్తులుగా సీతారాములు, హజరైన భక్తులు, బేస్తవారపేటలో సీతారాముల కల్యాణం, కంభంలో పూజల్లో పాల్గొన్న అశోక్‌రెడ్డి

# వైభవంగా శ్రీరామనవమి

- వాడవాడలా సీతారాముల కల్యాణం
- అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు
- పలుచోట్ల అన్నదానం

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి వేడుకలు మార్కాపురం పట్టణంలో వైభవంగా సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పట్టణంలోని వాడవాడలా వీధులలో రామాలయాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ప్రసన్న రామస్వామి ఆలయంలో శ్రీపతి అప్పనాచార్యుల ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణం నిర్వహించారు. మాంగళ్యధారణ, తలంబ్రాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు సీతారాముల కళ్యాణం తిలకించి పులకరించిపోయారు. పట్టాభిరామాలయం, అయోధ్య రామాలయం, తూర్పు వీధి రామాలయంలతో పాటు అన్ని రామాలయాల వద్ద పానకం, వడపప్పు పంచారు. రామనామజపంతో వీధులన్ని ఆధ్యాత్మిక పారవశ్యంలో మునిగిపోయాయి.

బేస్తవారపేట : బేస్తవారపేటలోని బజార్‌లోని రామాలయంలో, రాణిపేట రామాలయంలో శ్రీసీతా రామ కళ్యాణం నిర్వహించారు. సాయంత్రం మెయిన్ రోడ్డులో గ్రామోత్సవం నిర్వహించారు. వేదపండితుల వేదమంత్రలతో శ్రీసీతారామ కళ్యాణం నిర్వహిచారు.

కంభం : శ్రీరామనవమి సందర్భంగా గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మండలంలోని పెద్దనల్లకాల్వ, చిన్నకంభం గ్రామాల్లోని సీతారాముల వారిని దర్శించుకున్నారు. పెద్దనల్లకాల్వలోని రామాలయంలో నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చిన్నకంభంలో నిర్వహించిన నవమి వేడుకల్లో భాగంగా స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరామనవమి అందరి జీవితాల్లో సుఖ సంతోషాలు నింపాలని, రైతాంగం సుభిక్షంగా ఉండాలని, అన్నిరంగాలలో రాణించాలని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి స్వామి వారిని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. కంభం, అర్ధవీడు మండలాల్లో సీతారాముల వారి దేవాలయాల్లో సీతారాముల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. మండలంలోని లింగోజీపల్లి, అర్ధవీడు మండలంలోని నాగులవరం, జంగంగుంట్ల, కంభం నెహ్రూనగర్‌లో రాముల వారి దేవాలయాల్లో కళ్యాణం వైభవంగా నిర్వహించారు. ఆయా దేవాలయాల్లో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

గిద్దలూరు : గిద్దలూరు, రాచర్ల మండలాల్లో శ్రీరామనవమి పర్వదినాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలు దేవాలయాలలో సీతారాముల కళ్యాణ మహోత్సవాలు కన్నుల పండువగా నిర్వహించారు. పట్టణంలోని పాతబద్వేల్ రోడ్డులోని సీతారాముల దేవాలయంలో స్వామి వారి కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. వందలాది మంది భక్తులు కళ్యాణ మహోత్సవంలో పాల్గొని స్వామి వారికి పూజలు నిర్వహించారు. దేవస్థాన కమిటీ అధ్యక్షులు నాగార్జునరావు, కార్యనిర్వాహక అధ్యక్షులు నరసింహారావు, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో సీతారాముల పట్టాభిషేకం వైభవంగా జరిగింది. దేవస్థాన కమిటీ అధ్యక్షులు వాడకట్టు రంగసత్యనారాయణ, కార్యదర్శి తుమ్మలపెంట సత్యనారాయణ, కమిటీ ప్రతినిధులు ఆయా పూజా కార్యక్రమాలలో పాల్గొనగా భక్తులకు వడపప్పు, పానకాన్ని పంచిపెట్టారు. పట్టాభిరామ స్వామి దేవాలయంలో సైతం కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. కొండపేట ఆంజనేయ స్వామి దేవాలయంలో శ్రీరామనవమి వేడుకలు వైభవంగా జరగ్గా, మహిళల కోలాట ప్రదర్శన అలరించింది. పొదలకొండపల్లి, ముండ్లపాడు, ఉయ్యాలవాడ, పలు గ్రామాలలో శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా కల్యాణం వైభవంగా నిర్వహించారు. రాచర్ల మండలం అనుమలవీడులోని రామాలయంలో ఆలయ ధర్మకర్త పిడతల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణం వైభవంగా జరగ్గా భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

**శోభాయాత్ర**

శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా విశ్వహిందూ పరిషత్, సమరసత సేవా ఫౌండేషన్, హిందూ దేవాలయాల కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. పాతబద్వేల్ రోడ్డులోని సీతారామ స్వామి దేవస్థానం నుండి ఆయా కమిటీల ఆధ్వర్యంలో భక్తులు మోటార్ సైకిళ్లపై పట్టణంలో ర్యాలీ నిర్వహించి శోభాయాత్రలో పాల్గొన్నారు.

త్రిపురాంతకం : శ్రీరామనవమి వేడుకలను భక్తులు మండలంలోని అన్ని గ్రామాలలో ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని పాతరామాలయం, కోదండరామాలయం, టి.చెర్లోపల్లిలోని వేంకటేశ్వరాలయాలతోపాటు అన్ని గ్రామాలలో చలువ పందిళ్లు ఏర్పాటు చేసి మంత్రోచ్చరణల నడుమ సీతారాముల కల్యాణం నిర్వహించారు. కల్యాణ క్రతువును తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. అనంతరం పానకం, వడపప్పు పంపిణీ చేశారు. అన్నసముద్రం మెట్ట ఆంజనేయ స్వామి ఆలయం, త్రిపురాంతకంలోని వై.పాలెం కూడలి వద్ద ఉన్న అభయాంజనేయస్వామి ఆలయం, వెల్లంపల్లిలో వీరాంజనేయ స్వామి ఆలయాల్లో శ్రీరామ నవమి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేసి పొంగళ్లు వండి స్వామివారికి నైవేద్యం సమర్పించారు.

ఎర్రగొండపాలెం రూరల్ : శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని వెంకటాద్రిపాలెం, బోయలపల్లి, కొత్తపల్లి, ఆయ్యంబొట్లపల్లి, తిరుమలగిరి కాలనీతో పాటు పలు గ్రామాలలో దేవాలయాల్లో ఆదివారం నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొత్తపల్లి గ్రామంలోని దేవాలయంలో స్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. గురిజేపల్లిలో నూతన ఆలయంలో సీతారాముల నూతన విగ్రహాలను ఏర్పాటు చేసి హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే స్థానిక పట్టాభిరామస్వామి దేవాలయంలో నిర్వహించిన కల్యాణ మహోత్సవంలో ఆలయ ఉభయ దాతలు, కమిటీ సభ్యులు చక్కిలం నాగరాజు, సూరే రమేష్ దంపతులు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు బొడ్డుపల్లి పవన్‌కుమార్ కల్యాణం ఘనంగా నిర్వహించారు. భక్తులకు పానకం, వడపప్పుతో పాటు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఎర్రగొండపాలెం : శ్రీరామనవమి సందర్భంగా ఎర్రగొండపాలెం, బోయలపల్లి, అమానిగుడిపాడులో పట్టాభిరామస్వామి, సీతాదేవిలకు అర్చకులు కల్యాణం వైభవంగా నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని రామాలయాల్లో శ్రీరామనవమి సందర్భంగా కల్యాణం నిర్వహించారు. ఆలయాల్లో భక్తి కమిటి ఆధ్వర్యంలో భక్తులకు పానకం, వడపప్పు, తీర్థప్రసాదములు పంపిణీ చేశారు.

పెద్దారవీడు : శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా సీతారాముల వారి కళ్యాణం మండలంలోని పలు గ్రామాలలోని రామాలయాలలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. పెద్దారవీడు పంచాయతీలోని పడమటిపల్లి, తూర్పుపల్లి, సిద్దినాయునిపల్లిలోని మూడు రామాలయాల వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికలపై వేదపండితులు మేడవరపు రాఘవశర్మ కల్యాణ ఘట్టాలను వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి గ్రామోత్సవాలు నిర్వహించారు.

మార్కాపురం రూరల్ : మండలంలోని గ్రామాలలో రామాలయాలలో శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కళ్యాణం వైభవంగా నిర్వహించారు. మండలంలోని బోడపాడు గ్రామంలో వెలసిన పట్టాభిరామాలయంలో శ్రీరామనవ మి వేడుకలు ఆదివారం ప్రారంభమయ్యాయి. గ్రామంలో మూడురోజులపాటు ఏటా నిర్వహిస్తారు. మొదటి రోజు సీతారాముల కళ్యాణంతో ప్రారంభమైంది. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ పండుగకు గ్రామంలో అందరూ పాల్గొనడమే కాకుండా వివిధ రకాల ఉద్యోగాలలో స్థిర పడ్డవారు కూడా భక్తితో గ్రామానికి వచ్చి స్వామి సేవలో పాల్గొంటారు. మూడవ రోజు అంగరంగ వైభవంగా రథమహోత్సవ కార్యక్రమం గ్రామస్థులతో వారి బంధువులు కూడా అధిక సంఖ్యలో పాల్గొంటారు.

మండలంలోని దరిమడుగు, బొడిచెర్ల, గజ్జలకొండ, రాజుపాలెం, రాయవరం, నాయుడుపల్లి, పెద్ద యాచవరం గ్రామాలతో పాటు అన్ని గ్రామాలలో శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటి పెద్దలు, గ్రామస్థులు మహిళలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు.

తర్లుపాడు : మండలంలోని వాడవాడలా శ్రీరామ నవమి వేడుకలు భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామాలయాల వద్ద చలువ పందిళ్లు వేసి విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు ఓరుగంటి పవన్‌కుమార్, ప్రసాద్‌శర్మ, రమణాచార్యుల ఆధ్వర్యంలో సీతారామ కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవం తిలకించేందుకు అధికసంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. తర్లుపాడు, బొడిచర్లలో వీరాంజనేయస్వామికి భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ స్థాయిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

**ఘనంగా శ్రీరామనవమి వేడుకలు**

పుల్లలచెరువు : మండలంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం మండల కేంద్రమైన పుల్లలచెరువులోని రామాలయంలో గ్రామపెద్దలు ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు పానకం, వడపప్పు పంపిణీ చేశారు. మండలంలోని ఉమ్మడివరం, మల్లాపాలెం, కవలకుంట్ల, చెన్నంపల్లి, పిడికిటివారిపల్లి, మర్రివేములతోపాటు పలు గ్రామాలలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. మండలంలోని చాపలమడుగు, ఉమ్మడివరం, పుల్లలచెరువు ప్రసన్నాంజనేయ స్వామిలతోపాటు అన్ని గ్రామాలలోని ఆంజనేయస్వామి విగ్రహాల వద్ద భక్తులు తెల్లవారుజామున నుంచి పూజలు నిర్వహించారు. ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద భక్తులకు మంచినీరు, పానకం, వడపప్పు పంపిణీ చేశారు.









గిద్దలూరు, వై.పాలెంలో రాములవారి కల్యాణం, తర్లుపాడులో రాములవారి కల్యాణం నిర్వహిస్తున్న దంపతులు, పెద్దారవీడులో కల్యాణం తిలకిస్తున్న భక్తులు

# నష్టాల బాటలో పసుపు రైతు

- గత ఏడాదితో పోలిస్తే సగానికి తగ్గిన ధరలు
- పెరిగిన పెట్టుబడులు, తగ్గిన దిగుబడులు

కంభం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పసుపు సాగు చేసిన రైతులకు ఈ ఏడాది నష్టాల పాటు తప్పేలా లేదు. పసుపు ఆశించినమేర దిగుబడి లేకపోవడం, అదేసమయంలో మార్కెట్‌లో గిట్టుబాటు ధర కూడా దక్కడం లేదు. మార్కెట్‌లో పసుపు క్వింటా 7-8వేలు పలుకుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మార్కాపురం డివిజన్‌లో పత్తి, మిర్చి పంటలు వేసిన రైతులు నష్టాలబాట పట్టినట్లే పసుపు రైతుకు అదే పరిస్థితి ఏర్పడింది. ప్రకాశం జిల్లాలో పసుపు ఎక్కువగా పశ్చిమ ప్రాంతమైన గిద్దలూరు, యర్రగొండపాలెం, కనిగిరి, దర్శి నియోజకవర్గాల్లోని కంభం, గిద్ద లూరు, కొమరోలు, బేస్తవారపేట, అర్ధవీడు, రాచర్ల, సీఎస్‌పురం, దర్శి మండలాల్లో సుమారు 1500 ఎకరాలకు పైగా పసుపు సాగు చేశారు. అయితే అనుకున్న స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో ఈ ప్రాంత రైతులు బోర్లపైనే ఆధారపడాల్సి ఉంది. పంట బాగా పండితే అప్పులు తీరుతా యని ఎంతో ఆశలు పెట్టుకున్నారు. ప్రస్తుతం 20 రోజుల నుంచి పసుపుపై తవ్వకాలు ప్రారంభమయ్యాయి. అయితే దిగుబడి సగానికిపైగా తగ్గడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఎకరాకు 50-60 క్వింటాళ్ళ దిగుబడి రావలసి ఉండగా కనీసం 28 క్వింటాళ్లు కూడా రాకపోవడంతో పంటపై చేసిన అప్పులు ఎలా తీర్చాలని ఆందోళన చెందుతున్నారు.



పసుపుకొమ్ముల కుప్ప



పసుపుకొమ్ములను ఉడకబెడుతున్న కూలీలు

**ఎకరాకు రూ.1.50లక్షల పెట్టుబడి**

పసుపు పంటకు పెట్టుబడి అధికంగా ఉంటుంది. విత్తనం కొనుగోలు, రసాయనిక ఎరువులు, పురుగుల మందులు, కలుపు తీయడం, నీటి పారుదలకు 1 లక్ష, పసుపు పంట తవ్విన తరువాత నూర్పిడికి, పాలిసింగ్‌కు 25వేలు, ట్రాక్టర్‌తో దున్ని కూలీలతో గ్రేడింగ్ చేసేందు కు రూ.30వేలు పెట్టుబడి పెట్టాల్సి వస్తుంది.

**సగానికి పడిపోయిన ధరలు**

గత ఏడాది పసుపు క్వింటా రూ.13వేలు పలుకగా ప్రస్తుతం రూ.7-8వేల మధ్య పలుకుతోంది. ఇటు దిగుబడులు లేక, పంట ధరలు లేక తాము నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండిన పంటలు నిలువ ఉంచుకుని అప్పు పెంచుకోవడం ఇష్టం లేక వచ్చిన ధరలకే దళారులకు అమ్మాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.

### బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించాలి

- ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి
- పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరుటౌన్, ఏప్రిల్ 6 (ఆంధ్ర జ్యోతి): ప్రసిద్ధ నెమలిగుండ్ల రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించాలని, ఇందుకు అధికారులు కట్టుదిట్ట ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక టీడీపీ కార్యాలయంలో రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్, ఆహ్వాన పత్రికలను ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ రాచర్ల మండలంలోని అటవీ ప్రాంతంలో వెలసిన శ్రీనెమలిగుండ్ల రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 12 నుండ 15వ తేదీ వరకు జరగనున్నాయన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యా లు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు, పార్టీ శ్రేణులకు, జేపీ చెరువు గ్రామస్థులకు ఆయన సూచించారు. మూడు రోజులపాటు నియోజకవర్గంతోపాటు వివిధ జిల్లాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొననున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గాలయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు కటికె యోగానంద్, మాజీసర్పంచ్ దప్పిలి భాస్కర్‌రెడ్డి, బీజేపీ నాయకులు పిడతల రమేష్‌రెడ్డి, టీడీపీ నాయకులు దుత్తా బాలీశ్వరయ్య, ఎండోమెంట్ అధికారులు పాల్గొన్నారు.

**రామాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు**

పట్టణంలోని పాత బద్వేల్ రోడ్డులో గల శ్రీసీతారాముల వారి దేవస్థానం నందు ఆదివారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి ఆయన నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు షానేషావలి, టీడీపీ నాయకులు దుత్తా బాలీశ్వరయ్య ఉన్నారు.

# కార్యకర్తలే బీజేపీకి వెన్నెముక

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీకి కార్యకర్తలే వెన్నెముకని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిరసనగండ్ల శ్రీనివాస్ అన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ పార్టీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పీవీ.కృష్ణారావు, చంద్రశేఖర్, పాదర్తి ఆంజనేయులు, ప్రవీణ్, శ్రీకాంత్, కరీమ్, డాక్టర్ కిరణ్, వెంకటేశ్వరరెడ్డి, రామనాథ్ తదితరులు పాల్గొన్నారు.



కంభంలో జెండాను ఆవిష్కరిస్తున్న నేతలు

కంభం : దేశంలో అతి తక్కువ కాలంలో అత్యంత పెద్ద పార్టీగా ఆవిర్భవించిన పార్టీ భారతీయ జనతా పార్టీ అని బీజేపీ మండల అధ్యక్షుడు బాదం కిశోర్ తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు బాదం మనోహర్, కంభం మండల నాయకులు వేముల శ్రీనివాసులు, పల్లెం శ్రీనివాసులు, పులిపాటి మహేష్, సంజీవుల వెంకటేశ్వర్లు, చేపూరి శివ నాగేంద్ర, సాయి, ప్రవీణ్‌గుప్త పాల్గొన్నారు.



మార్కాపురంలో జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

గిద్దలూరుటౌన్ : భారతీయ జనతాపార్టీ 45వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం గిద్దలూరులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జె.వి.నారాయణ మాట్లాడుతూ రెండు ఎంపీ స్థానాలతో ప్రారంభించిన భారతీయ జనతాపార్టీ నేడు 303 స్థానాలతో దేశంలో అతిపెద్ద పార్టీగా ఎదిగిందన్నారు. కార్యకర్తలు, నాయకుల త్యాగాలు, శ్రమ ఫలితంగానే నేడు పార్టీ బలోపేతంగా ఉందన్నారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు ఎ.ఉదయ్‌శంకర్, ఒంగోలు పార్లమెంటు ఉపాధ్యక్షులు బి.వెంకటరామాంజనేయులు, కన్వీనర్ ఆర్.మల్లారెడ్డి, కోకన్వీనర్ ఆర్.కాసులు, కె.నాగేశ్వరరావు, ఎం.రామక్రిష్ణ, సంతోష్, జనార్థన్ పాల్గొన్నారు.

పెద్దారవీడు : భారతీయ జనాతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని గొబ్బూరులో పార్టీ మండలాధ్యక్షుడు బొచ్చు కోటిరెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బొచ్చు మల్లారెడ్డి, జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ కడియం రామయ్య, బీజేవైఎం సేట్ ఐటీ సెల్ కన్వీనర్ జీవీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కల్యాణం.. కమనీయం

- భక్తిశ్రద్ధలతో శ్రీరామ నవమి వేడుకలు
- ఆలయాల్లో మారుమోగిన రామనామస్మరణ
- పలుచోట్ల అన్నదానాలు
- ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం



కనిగిరి: స్వామివారి ఊరేగింపులో పల్లకి మోస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి వేడుకలను ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయాల్లో సీతారామ కల్యాణం వైభవంగా నిర్వహించారు. కనిగిరి పట్టణంలోని రామాలయం వీధిలోని దేవాలయంలో కొలువైన శ్రీసీతారాములకు ఘనంగా కల్యాణ వేడుకలు నిర్వహించారు. ప్రముఖులు, వ్యాపార వేత్తలు ఊరేగింపుతో, మేళతాళాల నడుమ సీతాసమేత స్వామి వారికి ముత్యాల తలంబ్రాలను అందజేసి పట్టు వస్త్రాలు సమర్పించారు. కొత్తపేట లోని కోదండరామస్వామి దేవాలయంలో పూజలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని హనుమాన్‌భజన సంఘం వద్ద, కేటీఆర్ స్కూల్‌లోని శ్రీలక్ష్మీనర సింహస్వామి ఆలయం, బాబా ఆలయం, చింతలపాలెం, కొత్తూరు, కూచిపూడిపల్లి, మాచవరం, చీర్లదిన్నె, లింగారెడ్డిపల్లి, ఏరువారిపల్లి, పునుగోడు, చల్లగిరగల, గానుగపెంట, నందనమారెళ్ల తదితర గ్రామాల్లో సీతారాముల కల్యాణాలను ఘనంగా నిర్వహించారు.



దర్శిలోని రామాలయంలో జరిగిన సీతారాముల కల్యాణంలో పాల్గొన్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్

**ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర**

ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి కనిగిరి పట్టణంలోని రామాలయాలను దర్శించి సీతారాములకు ప్రత్యేక పూజలు చేశారు. రామాలయం వీధిలోని రామాలయంలో స్వామివార్లను దర్శించుకుని అర్చనలు చేశారు. స్వామివారి ఉత్సవ ఊరేగింపులో పాల్గొని సీతారాముల పల్లకిని మోశారు. సీతారాములకు పట్టువస్త్రాలు సమర్పించారు. కల్యాణానికి ముత్యాల తలంబ్రాలను అందజేశారు. హనుమంతునిపాడు మండలంలోని ఎమ్మెల్యే స్వగ్రామం తిమ్మారెడ్డిపల్లి గ్రామంలోని రామాలయం, వెంగపల్లి గ్రామంలోని దేవాలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట టీడీపీ నాయకులు వీవీఆర్ మనోహరరావు (చిరంజీవి), సత్యాలు, కొలిపర్తి మారుతి, వెలుగూరి చంద్ర తదితరులు ఉన్నారు.

**దర్శిలో..** దర్శి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలో శ్రీరామనవమి వేడుకలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. గ్రామాల్లో సీతారాముల కళ్యాణం నిర్వహించటంతో పాటు అన్నదానాలు చేశారు. దర్శిలోని రామాలయంలో జరిగిన సీతారాముల కల్యాణంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు పాల్గొని పూజలు చేశారు. ఈసందర్భంగా వేద పండితులు కల్యాణ మహోత్సవాన్ని సంప్రదాయబద్ధంగా చేపట్టారు. భక్తులకు వడపప్పు, పానకం, తీర్థప్రసాదాలు అందజేశారు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

**పామూరులో..** పామూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): సీతారామ కల్యాణ వేడుకలను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పామూరు, సీఎస్పురం మండలాల్లోని రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కల్యాణ వేడుకలు నిర్వహించారు. పామూరు పట్టణంలోని ఆకుల వీధి, తూర్పువీధి, రాచూరివారివీధి, సీఎస్పురం రోడ్డు వీధి, ఎన్జీవో కాలనీ తదితర ప్రాంతాల్లో కల్యాణ వేడుకలు అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆకులవీధిలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ గద్దె ఏడుకొండలు, ఉప్పలపాటి హరిబాబు, కావిటి సుబ్బయ్య, గద్దె సుధాకరరావు, దేవస్థాన అధ్యక్షుడు కటకం శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. తూర్పువీధిలో జరిగిన కార్యక్రమంలో గుత్తిరాజ, వరికూటి చిరంజీవి, పి.రఘునాథరెడ్డి, టి.రవి, వై.రాఘవులు తదితరులు పాల్గొన్నారు. ఎన్జీవో కాలనీలో జరిగిన కార్యక్రమంలో చల్లగుండ్ల శ్రీనివాసులు దంపతులు, మహీధర్ దంపతులు, సూరపురాజు నాగరాజు దంపతులు కల్యాణంలో పాల్గొన్నారు. సాయంత్రం స్వామివార్లను గ్రామోత్సవం నిర్వహించారు.

అలాగే సీఎసపురం మండలం శీలంవారిపల్లి గ్రామంలో సీతారామ కల్యాణ వేడుకలను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో కనిగిరి, గన్నవరం మాజీ ఎమ్మెల్యేలు కదిరి బాబురావు, ముద్దరబోయిన వెంకటేశ్వరరావు దంపతులు, గ్రామస్థులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు.

**పీసీపల్లిలో..** పీసీపల్లి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమిని మండల ప్రజలు ఆదివారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. గ్రామాల్లోని చలువ పందిళ్లు వేసి సీతారాముల కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. ఈ సందర్భంగా భక్తులు రామదాసు కీర్తనలను పాడి ఆలయాల్లో భజనలు చేశారు. సీతారాములకు ప్రీతిపాత్రమైన వడపప్పు, పానకాలను భక్తులకు పంచిపెట్టారు. మధ్యాహ్నం ఆలయాల వద్ద ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రికి సీతారాముల విగ్రహాలను గ్రామోత్సవం నిర్వహించారు.

**దొనకొండలో..** దొనకొండ, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దొనకొండలోని అరబస్తాన్ వీధిలోని భక్తాంజనేయస్వామి దేవాలయంలో చైర్మన్ నరసింహారావు, గోనుగుంట్ల హరి, పావులూరి రాధాకృష్ణ, కధం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కల్యాణ వేడుకలను వైభవంగా నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఆనంద ఆశ్రమంలో ధర్మకర్త కాకర్ల భైరవానందస్వామి నేతృత్వంలో దేవతామూర్తులకు



కురిచేడులో జరిగిన సీతారాముల కల్యాణం

ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**ముండ్లమూరులో..** ముండ్లమూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి కల్యాణ వేడుకలు నిర్వహించారు. ముండ్లమూరులో చిన్నారులచే కోలాటం నిర్వహించారు. పసుపుగల్లులో టీడీపీ ఆధ్వర్యంలో చిన్నపాటి ప్రభను ఏర్పాటుచేసి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. భీమవరం, ఈదర, వేంపాడు, మారెళ్ళ, సింగనపాలెం, పసుపుగల్లు, రెడ్డినగర్‌లతో పాటు ఉమామహేశ్వర అగ్రహారం, పూరిమెట్ల, శంకరాపురం గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. సాయంత్రం ఉత్సవ విగ్రహాలకు ఊరేగింపు నిర్వహించారు.

**తాళ్లూరులో..** తాళ్లూరు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తూర్పుగంగవరం కోదండరామస్వామి దేవాలయం, తాళ్లూరులోని రామాలయం, కన్యకాపరమేశ్వరి, సుంకిరెడ్డిపాలెం, అంబేడ్కర్ నగర్, బొద్దికూరపాడు, విఠలాపురం, కొత్తపాలెం, నాగంబొట్లపాలెం, లక్కవరం, బొద్దికూరపాడు, దారంవారిపాలెం, తురకపాలెం, శివరాంపురం, కొర్రపాటివారిపాలెం, మల్కాపురం, రజానగరం, మన్నేపల్లి, దోసకాయలపాడు, వెలుగువారిపాలెం తదితర గ్రామాల్లో ఉభయదాతలు ప్రత్యేక పూజలు చేసి సీతారాముల కల్యాణం నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయాలు రామనామస్మరణతో మారుమోగాయి. తాళ్లూరులోని సుంకిరెడ్డిపాలెం రామాలయానికి ఇడమకంటి ఉపేంద్రరెడ్డి సీతారామలక్ష్మణుల ఉత్సవవిగ్రహాలను బహూకరించారు. ఆలయాల వద్ద భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. రాత్రి స్వాములను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు.

**కురిచేడులో..**

కురిచేడు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలో శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా ఆదివారం సీతారాముల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కురిచేడు ప్రధాన కూడలిలోని కోదండ రామాలయం వద్ద సీతారాముల కల్యాణం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు.

పాత పోలీస్ స్టేషన్ కూడలి, ఎస్సెస్సీ కాలనీ, కాటంవారిపల్లె గ్రామాలలో కల్యాణం జరిగింది. వాడవాడలా కల్యాణం అనంతరం భక్తులకు అన్న ప్రసాదం అందజేశారు.



పామూరు: సీతారామ కల్యాణంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు దంపతులు

## నిధుల దుర్వినియోగంపై విచారణ పూర్తయ్యేనా!

దొనకొండ, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): దొనకొండ గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై విచారణ ఎప్పటికీ పూర్తవుతుందోనని ప్రజలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీలో జరిగిన నిధుల స్వాహాపై పంచాయతీరాజ్ కమిషనర్, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులుచేశారు. వారి ఆదేశాల మేరకు ఇటీవల కనిగిరి డివిజన్ డీఎల్‌పీవో హనుమంతరావు, జిల్లా పంచాయతీ అధికారి గొట్టిపాటి వెంకటనాయుడు దొనకొండ పంచాయతీ కార్యాలయానికి వచ్చి విచారించారు.

గత ఏడాది మార్చి నుంచి అక్టోబరు వరకు అదనపు బాధ్యతలు చేపట్టిన పంచాయతీ కార్యదర్శి ఇంటి పన్నులకు సంబంధించిన దాదాపు రూ.8 లక్షల వివరాలు తెలపలేదు. అప్ప టి రికార్డులను ఐదు నెలల క్రితం గ్రామ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన కృష్ణమూర్తికి నేటికీ అప్పగించలేదు. దీంతో డీపీవో, డీఎల్‌పీవోలు సదరు కార్యదర్శిని ప్రశ్నించి అప్పటి రికార్డులు, ఇంటి పన్నుల నగదు లెక్కల వివ రాలను త్వరలో అప్పగించాలని ఆదేశించినట్లు సమాచారం. సంబంధిత అధికారులు దొనకొండ గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగం ఎంత జరిగిందో సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ విషయమై డీఎల్‌పీవో హనుమంతరావును వివరణ కోరగా దొనకొండ పం చాయతీలో నిధుల దుర్వినియోగంపై ఒక విడత వచ్చి పరిశీలించామన్నారు. ఇతర పనుల కారణంగా పూర్తిస్థాయిలో పరిశీలించలేదన్నారు. ఈనెల 10వ తేదీన దొనకొండలో ఉండి విచారణ చేపడతామని తెలిపారు.

## ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా



రుద్రసముద్రంలో ట్యాంకర్ వద్ద నీళ్లు పట్టుకుంటున్న గ్రామస్థులు

దొనకొండ, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రసముద్రం గ్రామంలో భూగర్భజలాలు అడుగంటడంతో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. సర్పంచ్ వేగినాటి వెంకటసుబ్బయ్య విజ్ఞప్తి మేరకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి చొరవతో సంబంధిత అధికారులు ఆదివారం ఆరు మంచినీటి ట్యాంకర్లు ఏర్పాటుచేశారు. ట్యాంకర్లతో గ్రామంలోని అన్నీ వీధుల్లో రోజుకు 21 ట్యాంకర్ల నీటి సరఫరా జరిగేలా చర్యలు చేపట్టారు. దీంతో తాగునీటి సమస్య తీరిందని గ్రామస్థులు పేర్కొన్నారు.

## నేడు పామూరుకు ఎమ్మెల్యే ఉగ్ర రాక

పామూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సాధికారిక సారథుల నియామకానికి సంబంధించి స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆపార్టీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు, పార్టీ గ్రామ అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీ ఇన్‌చార్జ్‌లు పాల్గొనాలని వెంకటేశ్వర్లు కోరారు.

## నేడు కళాశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన

వెలిగండ్ల, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): వెలిగండ్లలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి భూమి పూజ చేస్తారని టీడీపీ మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే చొరవతో ప్రభుత్వం కోటి 49 లక్షల రూపాయలు మంజూరు చేసిందని తెలిపారు.

## రేపు దొనకొండలో ప్రజాదర్బార్

దొనకొండ, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి నేతృత్వంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆపార్టీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు తెలిపారు.

మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని వారి సమస్య లను విన్నవించుకోవాలన్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం జరుగుతుందని తెలిపారు.

## నారాయణస్వామికి ప్రత్యేక పూజలు

సీఎస్‌పురం(పామూరు), ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణ స్వామి దేవస్థానంలో ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారికి కుంకుమార్చన పూజలు, విశేష పూజలు నిర్వహించి నూతన వస్త్రాలతో అలంకరించారు. మహానైవేద్యాన్ని మేళతాళాలతో ఆలయంచుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామివారికి సమర్పించారు. అనంతరం భక్తులకు పంపిణీ చేశారు.

గోశాలలోని గోవులకు పసుపు, కుంకుమలతో పూజలు నిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా టీడీపీ నాయకుడు యారవ శ్రీనివాసులు తన సతీమణి రమాదేవికి ఏఎంసీ చైర్‌పర్సన్ పదవి దక్కటంతో దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు కొమ్మినేని చిన్నఆదినారాయణ పూర్ణ కుంభంతో స్వాగతం పలికి స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు.

భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కుబడులు చెల్లించు కొన్నారు. కార్యక్రమంలో భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కందుల కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

సీఎస్‌పురం(పామూరు), ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం, పామూరు మండలాల్లో కందులు సాగుచేసిన రైతులు కొనుగోలు కేంద్రాల్లో పంటను అమ్ముకోవాలని ఏవోలు కె.రాధ, బి.సంపత్‌కుమార్ పేర్కొన్నారు. దళారుల మాటలు నమ్మి తక్కువ ధరకు అమ్ముకోవద్దని సూచించారు. సీఎస్‌పురం మండలంలో పెద్ద గోగులపల్లి, పామూరు మండలంలోని వగ్గంపల్లిలో కొనుగోలు కేంద్రాలను ప్రాంభించినట్లు తెలిపారు.

కందులు కింటాకు ప్రభు త్వం రూ.7550 మద్దతు ధర ప్రకటించిందని చెప్పారు. ఏపీ మార్క్‌ఫెడ్, పీఏపీఎస్ ఆధ్వర్యంలో కందులు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు.



తిరునాళ్లకు ముస్తాబవుతున్న ప్రసన్నాంజనేయస్వామి

## నేడు రాజంపల్లిలో ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల

దర్శి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజంపల్లి పంచాయతీలో ముసీనది తీరాన సోమవారం శ్రీప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల వైభవంగా జరగనుంది. గత 67 సంవత్సరాలుగా చైత్రశుద్ధ దశమిరోజు తిరునాళ్ల ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది తిరునాళ్లకు నాలుగు విద్యుత్ ప్రభలు ఏర్పాటుచేస్తున్నారు. వేద పండితులు సోమవారం ఉదయం నుంచి అభిషేకం, తదితర పూజలు నిర్వహిస్తారు. దర్శి, పొదిలి మండలాలలోని అనేక గ్రామాలకు చెందిన ప్రజలు ఈ ఉత్సవాల్లో పాల్గొంటారు. మహిళలు ముసీ నదిలో స్నాన మాచరించి పొంగళ్లు పొంగించి స్వామివారికి నైవేద్యంగా సమర్పిస్తారు. తిరునాళ్ల సందర్భంగా విద్యుత్ ప్రభలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు.

## నాల్గవ తరగతి ఉద్యోగుల కార్యవర్గం

దర్శి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ నాల్గవ తరగతి ఉద్యోగుల నియోజకవర్గ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా గిరిబాబు, అధ్యక్షుడిగా కె.కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా జి.భవాని, కార్యదర్శిగా పి.నాగమునీష్, కోశాధికారిగా ఏ.పుల్లమ్మ, కోప్షన్ సభ్యురాలిగా కె.ప్రభావతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## 'మేము సైతం' సొసైటీ సేవలు అభినందనీయం

వెలిగండ్ల, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగళ్ళూరు గ్రామంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఏఎస్‌ఐ జిలాని బాషా అన్నారు. రామచంద్రని శ్రీహరిరావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు రాజారాం సహకారంతో మేము సైతం సొసైటీ ఆధ్వర్యంలో బస్టాండ్ ఆవరణలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఆదివారం ఏఎస్‌ఐ ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు నరసింహారావు, రమణారెడ్డి, బాలకోటిరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, శేషగిరిరావు, తదితరులు పాల్గొన్నారు.

# నీటికుంటలో పడి విద్యార్థి మృతి



మృతిచెందిన తరుణ్

దొనకొండ, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పొలంలో ఏర్పాటుచేసిన నీటి కుంటలో జారి పడి పిక్కిలి తరుణ్(13) అనే విద్యార్థి మృతి చెందాడు. అందిన వివరాల మేరకు.. దొనకొండ పంచాయతీలోని గుట్టమీదపల్లి గ్రామానికి చెందిన పిక్కిలి వెంకటేశ్వర్లు, రమాదేవి దంపతులకు కుమారుడు తరుణ్, కుమార్తె చంద్రిక ఉన్నారు. తండ్రి వెంకటేశ్వర్లు గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం గొర్రెలను తోలుకొని పొలంవెళ్లిన తండ్రిని మధ్యాహ్నం భోజనానికి ఇంటికి పంపేందుకు తరుణ్ వెళ్లాడు. తండ్రి ఇంటికి వెళ్లగా గొర్రెలకు కాపలాగా ఉన్నాడు. ఆసమయంలో పొలంలో ఉన్న నీటికుంట వద్దకు వెళ్లిన తరుణ్ ప్రమాదవశాత్తు కాలుజారి నీటికుంటలో పడి మృతిచెందినట్లు సమాచారం. భోజనం చేసి తిరిగి గొర్రెల వద్దకు పొలం వెళ్లిన తండ్రి వెంకటేశ్వర్లుకు కుమారుడు కనిపించలేదు. ఆందోళనతో నీటికుంట వద్దకు వెళ్లిచూడగా తరుణ్ మృతిచెంది ఉన్నాడు. మృతిచెందిన తరుణ్ దొనకొండలోని విశ్వభారతి పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. సమాచారం అందుకున్న ఎస్సై త్యాగరాజు సిబ్బందితో వెళ్లి బాలుడి మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తరుణ్ మృతదేహాన్ని చూసి గ్రామస్థులు కన్నీటిపర్యంతమయ్యారు. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

# గంగమ్మకు ప్రత్యేక పూజలు



గంగమ్మతల్లికి పూజలుచేస్తున్న ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ తదితరులు

తాళ్లూరు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి తన పుట్టినరోజు సందర్భంగా ఆదివారం పవిత్ర పుణ్యక్షేత్రమైన గుంటిగంగ పరిధిలోని గంగమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయల పూజారులు గోత్రనామ పూజలు జరిపి ఆశీర్వచనం అందజేశారు. అనంతరం తేజా వృద్ధాశ్రమంలో వృద్ధులు, అభిమానుల సమక్షంలో కేక కట్ చేశారు. వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, టీవీ సుబ్బారెడ్డి, పోశం మధుసూదన్ రెడ్డి, గోళ్లపాటి మోషే, వై.ప్రభుదాసు, జయరామిరెడ్డి, నాగిరెడ్డి, యోగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దర్శి: ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం దర్శిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, నాయకులు, అభిమానుల సమక్ష్యంలో ఆయన పుట్టినరోజు కేకు కట్ చేశారు. అంతకుముందు దర్శి నగర పంచాయతీలోని కొత్తపాలెంలోని రామాలయంలో జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొని పూజలు చేశారు.

## ఘనంగా గంధ మహోత్సవం



గంధమహోత్సవం ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి పండుగ సందర్భంగా స్థానిక సాయిబాబా దేవస్థానంలో ఆదివారం బాబాకు నిర్వహించిన గంధ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా బాబా దేవస్థానం వద్ద సీతారాముల కల్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు. ఉత్సవంలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ షిరిడీ సాయిబాబా దేవస్థానం అభివృద్ధికి తనవంతు సహాయ, సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. దేవస్థానంలో ధ్యాన మందిరం ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానన్నారు. సీతారాముల కల్యాణాన్ని వేదపండితులు అనిల్‌శర్మ, మణికంఠ, నారాయణ, ప్రిన్స్‌లు వైభవంగా జరిపించారు. కళ్యాణాన్ని తిలకించేందుకు పట్టణంలోని పుర ప్రముఖులు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గంధమహోత్సవం ఊరేగింపులో దేవస్థాన గౌరవాధ్యక్షుడు బోయిళ్ళ తిరుపతిరెడ్డి, జాతీయ వాసవీ సత్రసముదాయాల చైర్మన్ దేవకి వెంకటేశ్వర్లు, అధ్యక్ష, కార్యదర్శులు, సత్యాలు, ధర్మారావు, దేవకి సుబ్రమణ్యం, చప్పరం వాసు, మారతి, వాగిచర్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## 64 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

తాళ్లూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుగంగవరం గ్రామంలో శనివారం రాత్రి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అక్రమంగా నిల్వఉంచిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. గ్రామంలోని గుజ్జుల వెంకట సుబ్బారెడ్డి అక్రమంగా రేషన్ బియ్యాన్ని నిల్వ ఉంచి రవాణా చేసేందుకు సిద్ధంగా ఉన్నాడన్న సమాచారం అందింది. దీంతో దర్శి ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌చార్జ్ డీటీ ఎస్.రాధాకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం రాత్రి 9 గంటల సమయంలో వెంకటసుబ్బారెడ్డి ఇంటిని తనిఖీ చేశారు. ఆ ఇంటిలో 64 ప్లాస్టిక్ బస్తాల రేషన్ బియ్యం ఉన్నట్టు గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై ఎస్.మల్లికార్జునరావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## మోదీ నాయకత్వంలో దేశాభివృద్ధి



పామూరులో బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న పార్టీ శ్రేణులు

పామూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య అన్నారు. ఆదివారం బీజేపీ 45వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పట్టణంలో పలు చోట్ల పార్టీ జెండాలను ఆవిష్కరించారు.

కార్యక్రమంలో బీజేపీ మండ ల అధ్యక్షుడు ఉమ్మడిశెట్టి శ్రీను, జె.చిన సుబ్బయ్య, కేవీ సుబ్బారావు, ఎస్. శివకృష్ణ, యు.మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

దర్శి: బీజేపీ 45వ ఆవిర్భావ దినోత్సవ వేడులకు ఆదివారం దర్శిలో ఘ నంగా నిర్వహించారు. ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాడపాకుల శ్రీని వాసులు జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు టి.నారాయ ణరెడ్డి, కె.నాగేశ్వరరావు, ఆంజనేయులు, అమర్, అనీల్, శివకోటాచారి, కాకర్ల నాగసాయి, తదితరులు పాల్గొన్నారు.

కురిచేడు: భారతీయ జనతాపార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆపార్టీ నా యకులు, కార్యకర్తలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కూకట్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశానికి నేడు భారతీయ జనతా పార్టీ అవసరం ఉందని అన్నారు ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వం కలిగిన పా ర్టీ బీజేపీ అని అన్నారు. అన్నివర్గాల్లో ఆదరణ కలిగి మూడు పర్యాయాలు అధికారం చేపట్టి దేశాభివృద్ధికి పాటుపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కురంగి నాగేశ్వరరావు, కమతం సుధాకర రెడ్డి, పిచ్చయ్య, దూలం వెంకటరెడ్డి, శివరామక్రిష్ణ రోసిరెడ్డి పాల్గొన్నారు.

## యారవ శ్రీనుకు పలువురు అభినందనలు

పామూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకుడు యారవ శ్రీనువాసులు సతీమణి రమాదేవి కనిగిరి ఏఎంసీ చైర్‌పర్సన్‌గా ఎంపికయ్యారు. ఈసందర్భంగా స్థానిక టీడీపీ కార్యాలయంలో యారవ శ్రీనివాసులును ఆపార్టీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, శ్రేణులు అభినందించారు.

కార్యక్రమంలో సయ్యద్ అమీర్ బాబు, షేక్ ఖాజారహంతుల్లా, పువ్వాడి వెంకటేశ్వర్లు, శ్రీరాం శ్రీనివాసులు, షేక్ గౌస్‌బాషా, ఇర్రి కోటిరెడ్డి, పువ్వాడి రామారావు, ఆర్‌ఆర్ రఫీ, తదితరులు పాల్గొన్నారు.



చినగంజాం మండల పరిధిలో ఆక్వా సాగు

# ఆక్వాకు.. అండ

- చెరువులకు రాయితీ విద్యుత్ ప్రకటన
- సాగును రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పిలుపు
- ఎగుమతుల విషయంలోనూ ప్రభుత్వం శ్రద్ధ
- పట్టాలెక్కనున్న ఆక్వా పార్కు నిర్మాణ పనులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

జిల్లాలో వ్యవసాయం తర్వాత కీలకమైనది ఆక్వా సాగు. అయితే వైసీపీ హయాంలో అన్ని రంగాల మాదిరే ఆక్వా కూడా సంక్షోభంలో కూరుకుపోయింది. విద్యుత్ రాయితీలు మొదలు దాణా ధరల నియం త్రణ వరకు ఇలా ఏ ఒక్క అంశంపై కూడా గత ప్రభుత్వం దృష్టి సా రించలేదు. పైగా ఆక్వా ఎగుమతుల విషయంలో బలవంతపు వసూ ళ్లతో సాగుదారులు బెంబేలెత్తిపోయారు. ఇక ఆక్వా పార్కు నిర్మాణం కేవలం శంకుస్థాపనలకే పరిమితం చేసింది. సరైన ధరలు లేక విద్యు త్ బిల్లులు తడిసి మోపెడు అవుతూ పూర్తిగా సాగు నుంచే బయట కు వెళ్లాలన్న ఆలోచనలో ఉన్న ఆక్వా రైతులకు ఊపిరి లూదేలా కూ టమి ప్రభుత్వం వరాలు కురిపించింది. ఇందులో భాగంగా రాయితీపై కరెంటు సరఫరా, ఎగుమతుల విషయంలో నిబంధనల సడలింపుతో పాటు ఆక్వాపార్కు నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసింది.

### జిల్లాలో 2,800 మందికి లబ్ధి


జిల్లాలో 2,800 మంది ఆక్వా రైతులు రాయితీ విద్యుత్ ఫలాలు అందుకోనున్నారు. జిల్లాలో 22,500 ఎకరాలు కాగా ఇందులో రిజిస్ట్రేషన్ చేయించుకున్నది 11,500 ఎకరాలు వరకు ఉంటాయి. పదివేల ఎకరాల వరకు అనధికారిక రొయ్యల సాగే. గత ప్రభుత్వంలో యూనిట్‌కు రూ.5 నుంచి రూ.7 వరకు బిల్లులు చెల్లించాల్సి వచ్చేది. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం తీసుకున్న యూనిట్ రూ.1.50కే నిర్ణయంతో కరెంటు బిల్లుల భారం తగ్గనుంది. అయితే ఇందుకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేసింది. విద్యుత్ రాయితీనే కాకుండా ఆక్వా సాగుకు సంబంధించి పథకాలు దరి చేరాలంటే నిబంధనల ప్రకారం రైతులు తమ చెరువులను రిజిస్ట్రేషన్ తప్పనిసరని ప్రభుత్వం ప్రకటించింది. దీనిలో భాగంగా ఆక్వారైతులందరూ తమ చెరువులను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రభుత్వం కోరుతోంది

### ఆక్వా పార్కుకు రూ.88 కోట్లు

నిజాంపట్నం మండలం దిండి తీర ప్రాంతంలో ఆక్వా పార్కు నిర్మాణం కోసం రూ.88 కోట్ల నిధుల విడుదలకు ప్రభుత్వం పాలనాపరమైన అనుమతులు ఇచ్చింది. 2023లో వైసీపీ ప్రభుత్వం శంకుస్థాపనతో సరిపెట్టగా దానిని ముందుకు తీసుకెళ్లే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంది. నిధుల మంజూరు కూడా జరగడంతో కాలపరిమితి పెట్టుకుని ఈ నిర్మాణం పూర్తి చేయడానికి ప్రభుత్వం అడుగులేస్తోంది.



విశేష అలంకారంలో సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ స్వామి



కొల్లూరు మండలం ఆవులవారిపాలెంలో సీతారామ కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

# జయజయరామ.. జగదభిరామ

- వాడవాడలా నవమి వేడుకలు
- నేత్ర పర్వంగా సీతారాముల కల్యాణోత్సవాలు
- భక్తులతో కిక్కిరిసిన రామ, ఆంజనేయుని ఆలయాలు

బాపట్ల, రేపల్లె, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): జై శ్రీరాం.. జయజయ రామ.. జగదభిరామ.. నామస్మరణలతో పల్లెలు, పట్టణాలు మారుమోగగా.. సీతారామ కల్యాణ వైభోగమే వైభోగం.. అంటూ సీతారామ కల్యాణోత్సవాలను తిలకించిన భక్తులు తరించిపోయారు. చూసిన కనులదే భాగ్యం అన్నట్లుగా రాములోరి కల్యాణోత్సవాలు నేత్రపర్వంగా జరిగాయి. శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం వాడవాడలా నవమి వేడుకలు అత్యంత వైభవోపేతంగా జరిగాయి. సీతారాముల కల్యాణోత్సవాలతో ఊరూవాడ ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. చిన్నాపెద్ద తారతమ్యం లేకుండా శ్రీరామ నామస్మరణలతో తరించారు. వాడవాడలా నవమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. రామాలయాలు, శ్రీఆంజనేయస్వామి ఆలయాలతో పాటు కూడళ్లలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో సీతారాముల కల్యాణోత్సవాలు నేత్రపర్వంగా జరిగాయి. ఆలయాల్లో వేకువజాము నుంచే స్వామి మూలవిరాట్‌కు అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా కొబ్బరి మట్టలు, అరటి బోదెలు, మామిడి తోరణాలు అలంకరించిన వేదికపై వేద పండితుల ఆధ్వర్యంలో దంపతులచే సీతారాముల కల్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై సీతారాముల కల్యాణాన్ని కనులారా తిలకించి పులకించిపోయారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు కల్యాణోత్సవాలకు హాజరై స్వామి ఆశీస్సులు పొందారు. పానకం, వడపప్పు ప్రసాదాలతో పాటు అన్న ప్రసాదాల వితరణలు పెద్దఎత్తున జరిగాయి. బాపట్ల పట్టణం, మండలంతోపాటు రేపల్లె, చీరాల, వేమూరు తదితర ప్రాంతాల్లో నవమి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీరామనవమి ఉత్సవసమితుల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల వద్ద, రామాలయాల వద్ద వేడుకలను పెద్దఎత్తున నిర్వహించారు. బాపట్లలోని బెస్తపాలెం శ్రీకోదండరామాలయం వద్ద నిర్వహించిన కల్యాణ మహోత్సవంలో రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ రమాశంకర్‌నాయక్, బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు దంపతులు కల్యాణం జరిపించారు. కోలాట ప్రదర్శనలు ఏర్పాటు చేయగా భక్తజనం విశేష సంఖ్యలో హాజరయ్యారు. రేపల్లెలోని పాత స్టేట్‌బ్యాంక్ వద్ద బాలభక్త బృందంచే 59వ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.



బాపట్ల : బెస్తపాలెం శ్రీకోదండరామాలయం సీతారాముల కల్యాణంలో మత్స్యశాఖ కమిషనర్ రమాశంకర్‌నాయక్ దంపతులు



పోటీలో తలపడుతున్న పొట్టేళ్లు

### మేదరమెట్ల పొట్టేళ్లకు ప్రథమ బహుమతి

నవమి సందర్భంగా బాపట్ల మండలం ముత్తాయపాలెంలో శ్రీకృష్ణ యాదవ్‌యూత్ ఆధ్వర్యంలో గొర్రెలకాపరులు రాష్ట్రస్థాయి పొట్టేళ్ల ప్రదర్శన ఏర్పాటు చేశారు. పోటీలను ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ప్రారంభించారు. ఏటా గ్రామంలో పొట్టేళ్ల పోటీలు నిర్వహించడం సంతోషదాయకమన్నారు. జిల్లాలోని వివిధప్రాంతాలు నుంచి పెద్దఎత్తున పొట్టేళ్లు వచ్చాయి.మొదటి స్థానం సాధించిన మేదరమెట్లకు చెందిన ఎం.రవి పొట్టేళ్లకు నర్రా బాలకృష్ణరాయుడు, లక్ష్మణుడు కలిసి రూ.25 వేల బహుమతిని అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన పొన్నపల్లికి చెందిన కుంచాల మేకల బాబు పొట్టేళ్లకు పడమర పిన్నిబోయన వారిపాలేనికి చెందిన పిన్నిబోయన కృష్ణమూర్తి రూ.15వేల బహుమతి అందజేశారు. తృతీయ స్థానంలో శివరాంపురానికి చెందిన గుమ్మడి అంకమ్మరావు పొట్టేళ్లు నిలవగా నక్కల నాగార్జున రూ.10 వేల బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు విచారపు మునీశ్వరరావు, పమిడిబోయన వెంకటేశ్వర్లు, వల్లు నాగరాజు, నాగేశ్వరరావు, గవిని నాగరాజు, ముత్తాయపాలెం గొర్రెలకాపరులు పాల్గొన్నారు.

# కొనుగోళ్ల.. ప్రహసనం

- మద్దతు ధర అందక రైతుల గగ్గోలు
- ఆలస్యంగా రంగంలోకి దిగిన మార్క్‌ఫెడ్
- దళారీలకు అమ్ముకుని నష్టపోతున్న అన్నదాతలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

దిగుబడులు ప్రారంభమయ్యే నెల రోజుల ముందు నుంచే మద్దతు ధరకు కొనుగోళ్లకు సిద్ధం గా ఉండాల్సిన మార్క్‌ఫెడ్ ఇందుకు భిన్నంగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. కంది, పెసర, మినుము, శనగ, జొన్న, మొక్కజొన్న దిగుబడులు ప్రారంభమై



పర్చూరు మండలం అడుసుమల్లిలో మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రం

ఇప్పటికే నెల రోజులు దాటింది. ఆలస్యంగా మేల్కొన్న మార్క్‌ఫెడ్ గడ చిన నెల 26 నుంచి జిల్లావ్యాప్తంగా 35 కొను గోలు కేంద్రాలు అందుబాటులోకి వచ్చినట్లు ప్రకటించింది. కానీ అప్పటికే దిగుబడుల్లో గణ నీయంగానే బహిరంగ మార్కెట్‌కు తరలిపో యాయి. ప్రస్తుతం మార్క్‌ఫెడ్ దగ్గర రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతుల సంఖ్య 800 ఉండగా, కేవలం 200 టన్నుల పెసలు మాత్రమే మద్దతు ధరకు కొనుగోలు చేసింది. మొక్కజొన్నను కొనే విషయంలో ఇంకా ప్రభుత్వం దోబుచులాట కొనసాగిస్తూనే ఉంది. మద్దతు ధర కన్నా కూడా బహిరంగ మార్కెట్‌లోనే ధరలు ఎక్కువగా ఉన్నాయని అందుకే కొనుగోలు కేంద్రాలు తెరవడానికి సమయం తీసుకున్నామని అధిక ారులు చెప్పడం బుకాయింపు ధోరణికి అద్దం పడుతోంది. బయటి మార్కెట్‌లో ధర స్థిరంగా ఉండి రైతులకు లబ్ధి చేకూరాలన్నా మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలు తప్పనిసరి. కానీ ఇవన్నీ విస్మరించి రేపుమాపు అంటూ కాలయాపన చేసి దిగుబడులు ప్రారంభమైన నాలుగు వారాల తర్వాత కానీ కొనుగోలు కేంద్రాలు అందుబాటులోకి తేవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రైతులు దిగుబడులను దళారీలకు అయినకాడికి అమ్ముకుని నష్టపోతున్నారు. మద్దతు ధర దక్కాలంటే రైతు సేవా కేంద్రాల్లో పంట వివరాల నమోదును ప్రభుత్వం తప్పనిసరి చేసింది. పైగా ఈ-క్రాప్ నిబంధన కూడా మద్దతు ధర అందడంలో రైతులకు ప్రతిబంధకంగా మారనుంది

### 24,000 హెక్టార్లలో మొక్కజొన్న..

జిల్లాలో ఈ దఫా మొక్కజొన్న సాగుకు రైతులు ఎక్కువగా మొగ్గు చూపారు. దాదాపు 23,500 హెక్టార్లలో మొక్కజొన్న, జొన్న 7,000 హెక్టార్లలో సాగైంది. మొక్కజొన్న క్వింటాలుకు మద్దతుధర 2,225 ఉండగా పది రోజుల క్రితం వరకు దీనికి సమానంగానే బహిరంగ మార్కెట్‌లో ధర ఉంది. కానీ ప్రస్తుతం అది రూ.2,000కు పడిపోవడంతో రైతులు కొనుగోలు కేంద్రాల వైపు ఆశగా చూస్తున్నారు. ఓ దశలో మొక్కజొన్న మద్దతు ధరకన్నా కూడా బయటి మార్కెట్‌లో అధికంగా పలికింది. ఆ సమయంలోనే కొనుగోలు కేంద్రాలను మార్క్‌ఫెడ్ తెరిచి ఉంటే బయట మార్కెట్‌లో ధర నిలకడగా ఉండి రైతులకు లబ్ధి చేకూరేది. కానీ అలాంటి ప్రయత్నమేమి జరగకపోవడంతో రెంటికి చెడ్డ రేవడిలా మొక్కజొన్న రైతుల పరిస్థితి తయారైంది. మద్దతు ధరకు మొక్కజొన్న కొనుగోలు చేయాలనే అభ్యర్థనలను రైతులు మార్క్‌ఫెడ్‌కు అందిస్తున్నారు. ఇదే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, అనుమతులు రాగానే కొంటామని అధికారులు చెబుతున్నారు

### మద్దతు ధర ఇలా..

పెసరకు మద్దతు ధర క్వింటాలుకు 8,682 ఉండగా, బయటి మార్కెట్‌లో దక్కుతున్నది కేవలం 6,800 కావడమే గమనార్హం. మినుము మద్దతు ధర 7,400 ఉండగా, బయట ప్రస్తుతం రూ.6,700 పలుకుతోంది. శనగలకు మద్దతు ధర క్వింటాలుకు రూ5,650గా ప్రభుత్వం ప్రకటించింది. తమ దిగుబడులను రూ.5100కే బయటి మార్కెట్‌లో అమ్ముకోవాల్సిన పరిస్థితిని రైతులు ఎదుర్కొంటున్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా మద్దతు ధరకు పంటల కొనుగోలు అనేది ఉత్తమాటలుగానే మిగిలిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### అనుమతులు తీసికట్టుగానే...

జిల్లాలో పెసర దిగుబడి 8,000 టన్నుల వరకు ఉంటుందనే అంచనాలు ఉండగా 2,285 టన్నుల కొనుగోలుకే ప్రభుత్వం అనుమతులిచ్చింది. మినుము 35,000 టన్నుల వరకు దిగుబడి ఉంటుందనే అంచనాలు ఉండగా 7,215 టన్నులే మార్క్‌ఫెడ్ ద్వారా సేకరించనున్నారు. కంది 1,930 టన్నులు, శనగ 45,000 టన్నుల వరకు జిల్లా వ్యాప్తంగా దిగుమతులు ఉండనుండగా కంది 190 టన్నులు, శనగ 4,955 టన్నులను కొనుగోలు జరిపేలా ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఇప్పటికే దిగుబడుల్లో చాలా వరకు బహిరంగ మార్కెట్‌కు తరలిపోయాయని క్షేత్రస్థాయి పరిస్థితులు ధ్రువీకరిస్తున్నాయి. ఇవన్నీ ప్రాథమిక అంచనాలేనని అవసరాన్ని బట్టి ఈ పరిమాణం పెంచే అవకాశం ఉంటుందని మార్క్‌ఫెడ్ చెబుతోంది. కానీ తాజాగా ధాన్యం సేకరణ విషయంలో తలెత్తిన ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. తొలుత 50,000 టన్నులకే అనుమతి ఇచ్చిన ప్రభుత్వం తర్వాత దశల వారీగా అది 90,000 టన్నులకు తీసుకెళ్లే క్రమంలో మద్దతు ధర విషయంలో అన్నదాతలు నానా అగచాట్లు పడ్డారు. వాటి నుంచి కూడా పాఠాలు నేర్వని మార్క్‌ఫెడ్ ప్రతిపాదనల విషయంలోనూ తీసికట్టుగా వ్యవహరించడంతో పాటు కొనుగోలు కేంద్రాలు తెరవడంలోనూ అదే నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించింది

### సమన్వయం కరువు....

పంటల దిగుబడి అంచనాతో పాటు ఏ సమయంలో పూర్తి స్థాయిలో కోతకు వస్తాయి, ఎప్పుడు కొనుగోలు కేంద్రాలు తెరవాలి అనే అంశాలలో అటు వ్యవసాయశాఖ, ఇటు మార్క్‌ఫెడ్ సమన్వయంతో అడుగులు వేయాల్సి ఉంటుంది. కానీ ఆ సమన్వయం కూడా జిల్లాలో కనబడడం లేదు. కొనుగోలు కేంద్రాలు తెరిచే విషయంలో క్షేత్రస్థాయిలో పరిస్థితులను సరిగా అంచనా వేయడంలో అధికారుల వైఫల్యం రైతులకు శాపంగా మారింది.

### బయట ధర ఎక్కువగా ఉండడం వల్లే..

మొక్కజొన్న విషయంలో మద్దతు ధర కంటే కూడా బయటి మార్కెట్‌లో ధర వరకు ఎక్కువగా ఉందని మార్క్‌ఫెడ్ చెబుతోంది. కానీ దానిని స్థిరంగా ఉంచాలన్నా కొనుగోలు కేంద్రాలు తెరవాలి. కానీ ఈ విషయాన్ని మార్క్‌ఫెడ్ విస్మరించింది. మినుము, శనగల ధరలు కూడా మద్దతు ధరకు సమానంగా బయటి మార్కెట్‌లో ధరలు ఉన్నాయనేది మరో వాదన. నిజానికి కొనుగోలుకు ప్రత్యామ్నాయం లేనప్పుడు దళారీలు అంతా సిండికేట్‌గా మారి రైతుల ప్రయోజనాలకు గండి కొడతారు. ఆయా పంటల మద్దతుధర కొనుగోలు కేంద్రాలు తెరవడమే దీనికి విరుగు డుగా గతంలో పలుమార్లు నిరూపణ అయింది. అయినా పాఠాలు నేర్వని అధికారులు తమ నిర్ల క్ష్యాన్ని బయటి మార్కెట్‌లో ఉన్న ధరల మీదకు నెట్టేయడాన్ని రైతులు తప్పుబడుతున్నారు.

# శంకుస్థాపనకు సిద్ధమవుతున్న చంద్రబాబు నివాసం

మంగళగిరి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో సీఎం చంద్రబాబు సొంతిల్లు ఏర్పాటుచేసుకుంటున్నారు. దీనికి సంబంధించి వెలగపూడి పరిధిలో ఎన్-11, ఈ-6 రోడ్డు జంక్షన్‌లో ఐదెకరాల స్థలంలో ఈ నెల 9న ఇంటి నిర్మాణ పనులకు భూమిపూజ చేయనున్నారు. దీనికి సంబంధించి ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. వారం రోజులుగా సదరు స్థలంలో ఎక్స్‌కవేటర్ల సాయంతో జంగిల్ క్లియరెన్స్ పనులను చేపట్టి పూర్తిచేశారు. భూమి చదును పనులను కూడా జరిపించారు. ఆదివారం ఆ స్థలంలో బోరు వేయించే కార్యక్రమాన్ని ఆరంభించారు. మొత్తం 25 వేల చదరపు గజాల విస్తీర్ణం కలిగిన స్థలంలో నివాసం, క్యాంప్ కార్యాలయంతో పాటు వర్కర్స్ నివాసాలు, గార్డెన్ వంటి సౌకర్యాలను కల్పిస్తారని తెలిసింది. ఈ స్థలం మీదగా వెళ్తున్న హెచ్‌టీ లైన్లను మార్చే పనులను చేపట్టాల్సి ఉంది. భూమిపూజ కార్యక్రమం పూర్తయిన వెంటనే పనులను వేగంగా చేపట్టేందుకు అవసరమైన నిర్మాణ సామగ్రి, భారీయంత్రాలను సైతం ఇప్పటికే ఆ పరిసర ప్రాంతాలకు తరలించారు. వర్కర్లకు, ఇంజనీరింగ్ అధికారుల కోసం షెడ్లను సిద్ధం చేశా రు. నిర్మాణ పనుల కాంట్రాక్టును ఎస్ఎస్ఆర్ సంస్థకు అప్పగించినట్లు తెలిసింది.



చంద్రబాబు ఇంటి నిర్మాణంలో భాగంగా బోర్‌వెల్‌ను ఏర్పాటు చేస్తున్న దృశ్యం



చక్రాయపాలెం సమీపంలో భవనాసి చెరువు నుంచి మోటార్ ద్వారా చేపల చెరువు కు పంపింగ్ చేస్తున్న నీరు

- రెండు వందల ఎకరాలకుపైగా ఆక్రమణ
- ఇష్టం వచ్చినట్లుగా నీటి మళ్లింపు, విద్యుత్ చౌర్యం
- ఆక్రమణలు గుర్తింపు.. హద్దులు తేల్చాలని ఏఈ లేఖ

# చేపల చెరువులా.. భవనాసి

అద్దంకి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పెద్ద చెరువులలో ఒకటిగా ఉన్న భవనాసిలో అక్రమార్కులు పాగా వేస్తున్నారు. భవనాసి చెరువుకు రెండు వైపులా కొంత మేర రైతుల వద్ద భూమిని కొనుగోలు చేయడం పనిలో పనిగా చెరువులో కొంత భాగం ఆక్రమించి చేపల చెరువులుగా మారుస్తున్నారు. వెయ్యి ఎకరాలకు పైగానే ఉండాల్సిన చెరువు చాలావరకు ఆక్రమణలకు గురైంది. చక్రాయపాలెం, శింగరకొండపాలెం ప్రాంతాలలో సుమారు 200 ఎకరాలకు పైగా చేపల చెరువుల నిర్వాహకులు ఆక్రమించి ఉంటారని అంచనా. భవనాసి చెరువును రిజర్వాయర్‌గా మార్చే పనులు పూర్తి కాకపోవడంతో అక్రమార్కులకు మరింత కలిసి వచ్చింది. దశాబ్ద కాలంగా చేపల చెరువులు ఏర్పాటు జరుగుతున్నా గత వైసీపీ పాలనలో అక్రమార్కులు మరింత రెచ్చిపోయారు. చెరువు నీటిని చేపల గుంటలకు పంపింగ్ చేస్తున్నారు. చేపల చెరువుల నుంచి విడుదలయ్యే కలుషిత నీటిని భవనాసి చెరువులోకి వదులుతున్నారు. నీటి పంపింగ్‌కు విద్యుత్ చోరీకి కూడా పాల్పడుతున్నారు. ఇటీవల రెండు సార్లు విద్యుత్ శాఖ అధికారులు దాడులు చేసి అపరాధ రుసుం విధించినా షరా మామూలుగానే విద్యుత్ చోరీకి పాల్పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా చేపల చెరువుల నిర్వహకులు యధేచ్ఛగా అటు నీటి చౌర్యం, ఇటు విద్యుత్ చౌర్యంకు పాల్పడుతునే ఉన్నారు. ఇంకొందరు చెరువు నీటిని పంపింగ్ చేసేందుకు సోలార్ ప్యానెల్స్ కూడా బిగించారు. ఇలా ఎవరి ఇష్టానుసారం వాళ్లు వ్యవహరిస్తున్నా ఆయా శాఖల అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఇటీవల చక్రాయపాలెం రెవెన్యూ పరిధిలో చేపల చెరువుల ఆక్రమణలపై గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ అధికారులు ప్రాథమికంగా సర్వే చేసి ఆక్రమణలను గుర్తించారు. ఈ నేపథ్యంలో రెండు రోజుల కిందట భవనాసి చెరువును పూర్తి స్థాయిలో సర్వే చేసి చెరువు హద్దులు తేల్చాలని ఇరిగేషనర్ ఏఈ నారాయణస్వామి తహసీల్దార్‌కు లెటర్ పంపారు. ఇప్పటికైనా అన్ని శాఖల అధికారులు స్పందించి ఏకకాలంలో చేపల చెరువుల నిర్వహకుల ఆగడాలకు చెక్ పెట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



భవనాసి చెరువును ఆక్రమించి నిర్మించిన చేపల చెరువు



భవనాసి చెరువు ఒడ్డున ఏర్పాటు చేసిన సోలార్ ప్యానెల్స్



శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్ద నిర్వహిస్తున్న సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న నెల్లూరు రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు దంపతులు, ఈవో తిమ్మానాయుడు, శ్రీరాముని విగ్రహాలను ఊరేగింపుగా తెస్తున్న ఈపూరుపాలెం ఎస్సై చంద్రశేఖర్ దంపతులు, ఉప్పుటూరులో ప్రత్యేక అలంకరణలో స్వామివార్లు, రాజుగారిపాలెంలో పూజల్లో పాల్గొన్న దంపతులు

# అంతా రామమయం

- భక్తిశ్రద్ధలతో శ్రీరామ నవమి పండుగ
- కనులపండువగా సీతారాముల కల్యాణం
- పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కొండయ్య దంపతులు
- పలుచోట్ల ఆకట్టుకున్న ప్రవచనాలు
- పెద్దఎత్తున అన్నదానాలు

చీరాల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామ నవమి పండుగను నియోజకవర్గ ప్రజలు ఆనందంగా.. భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అన్ని ఆలయాలు, వీధులు రామ నామంతో మార్మోగాయి. పెద్ద ఎత్తున పందిళ్లు ఏర్పాటు చేసి శ్రీసీతారాముల కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. ఉదయం నుంచే నగరోత్సవం ఆకట్టుకుంది. వివిధ భక్త సమాజం వారి కోలాటం, భరత నాట్యంతో ఉత్సాహంగా వేడుకలు సాగాయి. పలుచోట్ల ప్రవచనాలు ఆకట్టుకున్నాయి. కొత్తపేట వివేకానంద కాలనీలో తాజాగా ఏఎంసీ చైర్మన్‌గా ఎన్నికైన కౌతవరపు జనార్దన్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన రాములవారి కల్యాణ మహోత్సవానికి ఎమ్మెల్యే కొండయ్య, బాల కొండమ్మ దంపతులు హాజరయ్యారు. ఈక్రమంలో ప్రత్యేక పూజలు జరిపారు. బోయినవారిపాలెం, శ్రీనివాసపురంలో నిర్వహించిన కల్యాణ మహోత్సవం, పట్టాభిషేకం మహోత్సవాల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈపూరుపాలెం పద్మనాభునిపేటలో ఎస్సై చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. పట్టణంలో లయన్స్ క్లబ్ కార్యాలయంలో చీరాల ఆధ్యాత్మిక పీఠం వారి ఆధ్వర్యంలో బాల బతుకమ్మ అష్టలక్ష్మి సమాజంవారు సంకీర్తన ఆలపించారు. రామచంద్రుడు మూర్తీ భవించిన ధర్మ స్వరూపుడు అనే అంశంపై ప్రవచనం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమంలో విశేషంగా భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు.

బల్లికురవ : మండలంలోని అన్ని గ్రామాలలో ఆదివారం శ్రీరామ నవమి పండగ వైభవంగా జరిగింది. రామాలయాల్లో సీతారాముల కల్యాణాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో జరిపించారు.

### శింగరకొండ ఆలయంలో వేడుక

అద్దంకి : శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణోత్సవం ఆదివారం వాడవాడలా కనులపండువగా నిర్వహించారు. శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం ముందు నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు, రాధ దంపతుల ఆధ్వర్యంలో వరుసగా 14వ ఏట సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు కల్యాణాన్ని చూసి తరించారు. ఈవో తిమ్మానాయుడు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శింగరకొండలోని రామాలయం, లక్ష్మీనరశింహస్వామి దేవాలయం, శ్రీరామజీవన సంఘం అన్నదాన సత్రం, పట్టణంలోని రామాటాకీస్ బజారులో ఏర్పాటు చేసిన 3 చలువ పందిళ్లు, పాతగాంధీ బొమ్మ సెంటర్, అత్తులూరివారి వీధిలోని రామాలయం, కాకానిపాలెంలోని రామాలయం తదితర ప్రాంతాలలో సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాలలో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.

పంగులూరు : శ్రీరామనవమి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. రామాలయంలో జరిగిన స్వామివారి కల్యాణ మహోత్సవంలో రోటరీ ప్రతినిధి వీరరాఘవయ్య దంపతులు పాల్గొని కల్యాణం నిర్వహించారు. పంగులూరు పాత అంబేడ్కర్ కాలనీలోని రామాలయంలో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు పానకం, వడపప్పు అందచేశారు.

మేదరమెట్ల : రాములోరి కల్యాణాన్ని మేదరమెట్లలో తూర్పుపాలెం రామాలయంలో వైభవంగా నిర్వహించారు. 1939వ సంవత్సరం నుంచి ఇక్కడ వేడుకను నిర్వహిస్తున్నారు. గత 5 రోజులుగా సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. టీడీపీ నాయకుడు మన్నె రామారావు పార్టీ కార్యాలయం వద్ద శ్రీరామనవమి వేడుకను నిర్వహించారు.

పర్చూరు : సీతారాముల కల్యాణోత్సవాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నూతలపాడు గ్రామంలోని శ్రీ కోదండస్వామి వార్ల దేవాలయంలో నవమి పండుగను వైభవంగా నిర్వహించారు. సీతారాముల పట్టాభిషేక నాణాల ప్రదర్శన ఆకట్టుకుంది. ఉప్పుటూరు గ్రామంలోని కోనేరు వీరాంజనేయనేత స్వామి ఆలయంలో పురోహితుడు ఎచ్చయ్య శాస్త్రి నేతృత్వంలో, పర్చూరులోని 92 అడుగుల శ్రీఅభయాంజనేయస్వామివారి ఆలయం, బ్రిడ్జి సెంటర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో, రామాలయంతోపాటు మండలంలోని నాగులపాలెం, అడుసుమల్లి, అన్నంబొట్లవారిపాలెం, చెరుకూరు తదితర గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

మార్టూరు : అన్ని రామాలయాల్లో సీతారాముల కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పడమర బజారున, తూర్పుబజారున, నేతాజీ నగర్, రాజుగారిపాలెంలో సీతారాముల కల్యాణాన్ని భక్తులు చూసి తరించారు. 25 మంది దంపతులు పీటలపై కూర్చుని, పూజలు చేశారు. అనంతరం అన్నదానం జరిగింది.



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కొండయ్య, బాల కొండమ్మ దంపతులు. పీటలపై కౌతవరపు జనార్దన్ దంపతులు

యద్దనపూడి : మండలంలోని వివిధ గ్రామాలలో శ్రీరామనవమి పండుగను ఘనంగా జరుపుకున్నారు. యద్దనపూడి, వింజనంపాడు, తనుబొద్దివారిపాలెం, పూనూరులో వేడుకలు జరిగాయి. వింజనంపాడులో అద్దంకి కళాకారులతో కోలాటం ప్రదర్శించారు.

సంతమాగులూరు: శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అన్నదానాలు ఏర్పాటు చేశారు.

చినగంజాం : సీతారాముల కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో ఆదివారం వైభవంగా నిర్వహించారు. పలు గ్రామాల్లో తెల్లవారుజాము నుంచే రామ కీర్తనలు, భజనలు ప్రారంభమయ్యాయి. సీతారామాలయ, వాసవీకన్యకాపరమేశ్వరి, పెదగంజాం, రామచంద్రానగర్, రాజుబంగారుపాలెం, సంతరావూరు, మోటుపల్లి గ్రామ పంచాయతీ పరిధిల్లోని గ్రామాల్లో, మూలగానివారిపాలెం, గొనసపూడి, చింతగుంపల్లె, సోపిరాల, పల్లెపాలెం తదితర గ్రామాల్లో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.



పంగులూరులో కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు



కాలిపోయిన బీడు భూమి స్థలం

## 200 ఎకరాల బీడు భూమిలో మంటలు

- ఆకతాయి పెట్టిన నిప్పుతో రైతుల పరుగు
- పక్కనే పంటలు ఉండడంతో నీరు చల్లి అదుపులోకి

బల్లికురవ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామాంజనేయపురం గ్రామ సమీపంలో గుర్తు తెలియని ఆకతాయి ఖాళీగా ఉన్న బీడు భూమికి నిప్పు పెట్టడంతో రెండు వందల ఎకరాల నేల పూర్తిగా కాలి పోయింది. మంటలను చూసిన రైతులు పొలాలకు పరుగులు పెట్టారు. 150 ఎకరాల్లో మొక్కజొన్న, బొప్పాయి, మిరప ఉండడంతో రైతులు మంటలు తమ పంటలకు ఎక్కడ అంటుకుంటాయోనన్న ఆందోళనకు గురయ్యారు. అగ్నిమాపక యంత్రం కోసం ఎంత ప్రయత్నించిన రాక పోవడంతో రైతులే సమీపంలో ఉన్న మోటార్ల నుంచి నీరు, వేప మండలను తీసుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. మంటలు వ్యాపించి ఉంటే తమకు తీవ్ర నష్టం వచ్చేదని రైతులు అంటున్నారు. నిప్పు పెట్టిన వ్యక్తి ఎవరో తెలియలేదని రైతులు తెలిపారు.

## మేదరమెట్లలో శాంతి ర్యాలీ

వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై పారదర్శక విచారణ జరగాలని పలు క్రైస్తవ సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని దేశాయిపేట నుంచి రామన్నపేట మీదుగా గడియార స్తంభం కూడలి వరకు శాంతియుత క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మత బోధకులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

మేదరమెట్ల : క్రైస్తవ బోధకుడు ప్రవీణ్ పగడాల మృతిపై పాస్టర్‌లు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఆదివారం సెయింట్ ఆర్నాల్డ్స్ పాఠశాల నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్ఐ మహమ్మద్ రఫీకి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్‌లు ఆశీర్వాదం, దానియేలు, దాసుబాబు, జాన్ వెస్లీ, అబ్రహాం , పాల్, రమేష్, సత్యవర్ధన్‌తో పాటు భక్తులు పాల్గొన్నారు.

## సామాజిక సేవలో ముందడుగు



చలివేంద్రాన్ని ప్రారంభించిన టీడీపీ కూటమి నాయకులు

తోటవారిపాలెం (చీరాల), ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : పార్టీ నిర్దేశించిన కార్యక్రమాలే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందడుగు వేస్తున్నట్లు పలువురు టీడీపీ కూటమి నాయకులు పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని తోటవారిపాలెంలో వారి ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వేసవి ముగిసేంత వరకు చలివేంద్రం ప్రజలకు అందుబాటులో ఉంటుందని చెప్పారు. అనంతరం శ్రీరామ నవమి వేడుకను నిర్వహించారు. కార్యక్రమంలో బండారుపల్లి హేమంత్‌కుమార్, గూడూరు శివరామప్రసాద్, లీలావతి, నాగరాజు, కుమార్, చంద్ర, మార్కండేయులు పాల్గొన్నారు.

## కారును ఢీకొన్న ఆటో

**కూలీలకు గాయాలు**

సంతమాగులూరు (ఆంధ్రజ్యోతి): కారును ఆటో ఢీకొనడంతో నలుగురు కూలీలు గాయపడ్డారు. బల్లికురవ మండలం కూకట్లపల్లికి చెందిన మహిళా కూలీలు సంతమాగులూరు మండలం సజ్జాపురానికి పొలం పనులకు వెళ్లి ఆదివారం మధ్యాహ్నం తిరిగి వస్తుండగా కొమ్మాలపాడు సమీపంలో నామ్ రోడ్డులో ముందు వెళ్తున్న కారును వెనుక నుంచి ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుశీల, బుల్లెమ్మ, వరలక్ష్మి, సుబ్బాయమ్మకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో నర్సరావుపేటలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. వీరిలో ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు తెలుస్తుంది.

## వాగులో పడి వృద్ధుడి మృతి

- 4 రోజుల క్రితం జరిగినా గుర్తించక వెతికిన కుటుంబసభ్యులు

అద్దంకి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : కల్వర్టుపై నుంచి వాగులో పడి వృద్ధుడు మృతి చెందారు. స్థానికుల కథనం మేరకు.. అద్దంకి మండలంలోని జార్లపాలెం సమీపంలో నాలుగు రోజుల కిందట బొమ్మనబోయిన శింగయ్య (63) బస్‌షెల్టర్ నుంచి గ్రామంలోకి వెళ్లే రోడ్డులో ఉన్న కల్వర్ట్ గోడపై కూర్చొని ఉండగా గ్రామస్థులు గమనించారు. అయితే నాలుగు రోజుల నుంచి శింగయ్య ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుకుతున్నారు. ఆదివారం సాయంత్రం కల్వర్టు వద్ద దుర్వాసన వస్తుండడంతో పరిశీలించగా శింగయ్య మృతదేహం గుర్తించారు. కల్వర్టుపై నుంచి వాగులో పడి మృతి చెంది ఉంటారని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు భావిస్తున్నారు. శింగయ్యకు భార్య, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహం కావడంతో అంతా కలిసే ఉంటున్నారు.

## పేకాట స్థావరంపై దాడి

- రైతు, కూలీల వేషంలో వెళ్లిన పోలీసులు
- 19 మంది జూదరుల అరెస్టు
- రూ.1,80,000 నగదు, 10 బైక్‌లు, సెల్‌ఫోన్‌లు స్వాధీనం

కారంచేడు (పర్చూరు), ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు సర్కిల్ పరిధిలోని పోలీసులు కారంచేడు మండలంలో ఆదివారం పేకాట శిబిరాలపై దాడులు నిర్వహించారు. సినీ పక్కీలో రైతు, కూలీ వేషాల్లో ఇంకొల్లు సీఐ వైవీ రమణయ్య నేతృత్వంలో చినగంజాం, కారంచేడు, ఇంకొల్లు పోలీసులూ ఆకస్మికంగా దాడులు చేశారు. కారంచేడు మండలం కుంకలమర్రు శివారులోని పొలాల్లో పేక ఆడుతున్న 19 మంది జూదరులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.1,80,000 నగదుతోపాటు, 10 బైక్‌లు, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో ఎస్ఐ వెంకట్రావు, ఇంకొల్లు ఎస్ఐ సురేష్, చినగంజాం ఎస్ఐ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## మద్యం మత్తులో ప్రైవేటు బస్ డ్రైవర్ హల్‌చల్

చీరాల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో బాపట్లకు చెందిన ప్రైవేటు బస్సు డ్రైవర్ హల్‌చల్ చేసి సంఘటన ఆదివారం స్థానిక కొత్తపేటలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్లకు చెందిన ప్రైవేటు బస్సు డ్రైవర్ మద్యం మత్తులో హైర్ బస్‌లో బాపట్ల నుంచి చీరాలకు ఆదివారం వచ్చారు. అయితే మార్గం మధ్యలో అతను నిద్రపోవడంతో చీరాల నుంచి కూడా బస్సు తిరిగి బాపట్ల బయలు దేరింది. ఈక్రమంలో క్లాపేట సమీపానికి వచ్చేసరికి మెలుకువ వచ్చిన అతను నన్ను చీరాల్లో ఎందుకు లేపలేదని బస్సు డ్రైవర్, కండక్టర్‌తో గొడవకు దిగారు. ఈక్రమంలో కొంత వరకు ట్రాఫిక్ కూడా నిలిచిపోయింది. దీంతో అసహనం చెందిన హైర్ బస్ సిబ్బంది అతడిని ముందు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అయితే వారు అది మా లిమిట్స్ రాదనడంతో తిరిగి టూటౌన్‌కు చేర్చారు. అయితే అక్కడి పోలీసులు గట్టిగా మందలించి పంపారు.



చలివేంద్రాన్ని ప్రారంభించి మంచినీటిని అందిస్తున్న ఎస్ఐ వినోద్

## చలివేంద్రం ప్రారంభం

పంగులూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముప్పవరం ప్రధాన కూడలిలో ఉమేష్‌చంద్ర ఆటో యూనియన్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్ఐ వినోద్‌బాబు ఆదివారం ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఆటో యూనియన్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడాన్ని ఎస్ఐ అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు అల్లంనేని బ్రహ్మానందస్వామి, గరిమిడి జగన్మోహనరావు, యూనియన్ ప్రెసిడెంట్ శివ, వైస్ ప్రెసిడెంట్ దానియేలు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

అద్దంకి, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతాపార్టీ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం అద్దంకిలో ఘనంగా నిర్వహించారు. బంగ్లా రోడ్డులో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పట్టణంలో మోటార్‌సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఇన్‌చార్జి పులి వెంకటకృష్ణారెడ్డి, మంచెళ్ల సుబ్రహ్మణ్యం, పర్చూరి శ్రీనివాసరావు, జాగర్లమూడి యలమందరావు, కాలేషాబాబు విరాట్, మంగమూరి సురేష్ పాల్గొన్నారు.

మేదరమెట్ల : బీజేపీ ఆవిర్భావ వేడుకలను పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. రాష్ట్ర కిసాన్ మోర్చా సభ్యుడు సాతులూరి భవన్నారాయణ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కారించారు. పార్టీ ప్రారంభం నుంచి పలువురు ప్రముఖులు అధ్యక్షులుగా పని చేశారన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గుడిమెట్ల అశోక్ కుమార్, కార్యదర్శి మాధవి, మాజీ అధ్యక్షుడు రమేష్‌బాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలి

చినగంజాం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును తక్షణమే వెనక్కి తీసుకోవాలని మర్కస్ మజీద్ అధ్యక్షుడు షేక్ నబీషా డిమాండ్ చేశారు. వక్ఫ్ బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా చినగంజాం గ్రామంలో మర్కస్ మజీద్ అధ్యక్షుని ఆధ్వర్యంలో ముస్లింలు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్లకార్డులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ముస్లిం, మైనార్టీ ఆస్తులను కార్పొరేటు శక్తులకు కట్టబెట్టేందుకే కేంద్రం వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు తీసుకొచ్చిందని నబీషా అన్నారు. కార్యక్రమంలో ముస్లిం యువత, నాయకులు షేక్ పఠాన్‌సుభానిఖాన్, షేక్ జియావుల్హక్ మహమ్మద్ హబీబుల్లా, షేక్ జిలాని, షేక్ మక్బుల్, షేక్ సలాం, ఇస్మాయిల్, ఇంతియాజ్, అమీర్జాన్, గండిపూడి దరియాస్, మస్తాన్‌వలి, సుభాని, షాకీర్, ఇసుబ్, షఫీ, క్షత్రియ బాలాజీ సింగ్, అన్సర్, మాలిక్, షేక్ సునీల్, షాహుల్, ఫిరోజ్ పాల్గొన్నారు.

## యువతి అనుమానాస్పద మృతి

చీరాల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పదంగా యువతి మృతి చెందింది. కొత్తపేట ఇన్‌కంట్యాక్స్ కార్యాలయం సమీపానికి చెందిన యువతి(20) తల్లితో నివాసం ఉంటుంది. పాలిటెక్నిక్ పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటుంది. అయితే ఈమెకు ఇటీవల చీరాలకు చెందిన వ్యక్తితో వివాహ విషయమై చర్చలు జరిగాయి. ఏమి జరిగిందో తెలియదుగాని ఆదివారం ఉదయం తల్లి లేచి చూసేసరికి బ్యాగులకు వేసే రంగును తాగి బలవన్మరణం చెందింది. సమాచారం అందుకున్న టూటౌన్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతదేహానికి సోమవారం పోస్టుమార్టం నిర్వహించనున్నారు.

# దిగజారుతున్న ధరలతో వైట్‌బర్లీ రైతుల దిగాలు

- వర్ష సూచనపై ఆందోళన



వర్ష సూచనలతో వైట్‌బర్లీ పొగాకును మండెలుగా వేస్తున్న రైతులు

పర్చూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) 6 : ఓ పక్క దిగజారుతున్న ధరలు.. మరో పక్క ప్రకృతి వైపరీత్యాతాలు వైట్‌బర్లీ రైతులను కలవరానికి గురిచేస్తున్నాయి. పంట చేతికి అందివస్తున్న తరుణంలో వర్షపు హెచ్చరికలు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది. చేతికి అందివచ్చిన పంటను అమ్ముకుందామన్నా ధర లేకపోవడంతో ఏమిచేయాలో పాలుపోని స్థితిలో రైతులు ఉన్నారు. మార్కెట్‌లో ఉన్న ధరకు అమ్ముకుంటే కనీసం పెట్టుబడుల్లో కూడా నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది ఈ సమయానికి లోగ్రేడ్ పొగాకు క్వింటా రూ.14వేల ఉండగా, నాణ్యమైన పొగాకు క్వింటా రూ.18వేలు పైనే పలికింది. ప్రస్తుతం ఇదే పొగాకు క్వింటా రూ.2వేల నుంచి రూ.3వేలకు దిగజారిందని రైతులు విలపిస్తున్నారు. నాణ్యమైన పొగాకు సైతం క్వింటా రూ.8వేలకు మించి లేదని చెప్తున్నారు. పెట్టుబడులు, కూలి ఖర్చుల కోసం అమ్ముకోవల్సి వస్తోందన్నారు. రెండ్రోజులుగా వానలు కురుస్తాయన్న అధికారుల ప్రకటన కలవరానికి గురిచేస్తోందని రైతులు చెప్తున్నారు. పొలాల్లో ఆరబెట్టి ఉండడంతో దాన్ని కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. వాన కురిస్తే తప పరిస్థితి ఏంటని ఆందోళన చెందుతున్నారు. పర్చూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని పర్చూరు, కారంచేడు, యద్దనపూడి, ఇంకొల్లు మండలాల్లో 40వేల ఎకరాలకు పైగా రైతులు వైట్‌బర్లీ పొగాకును సాగు చేశారు. వ్యవసాయ ఖర్చులు, కౌలు కలుపుకుని ఎకరానికి రూ.1.5లక్షల వరకు ఖర్చు చేసినట్లు చెప్తున్నారు. ప్రస్తుత ధరను చూస్తుంటే పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని అంటున్నారు. కూలీలు దొరక్క వేల ఎకరాల్లో బర్లీ పొలాల్లోనే ఎండిపోయే పరిస్థితి నెలకుంది.



టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ విద్యుత్ ప్రభ

## వైభవంగా ఆంజనేయస్వామి తిరునాళ్ల

సంతమాగులూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కుందుర్రు గ్రామంలోని చెరువు కట్టవద్ద వెంచేసి ఉన్న శ్రీ ఆంజనేయ స్వామి తిరునాళ్ల మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవ తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా ఆంజనేయ స్వామి వారికి ప్రతేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కుందుర్రు, పరిటాల వారి పాలెం, మామిళ్లపల్లి గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకొని పొంగళ్లు వండి స్వామివారికి నివేదించి తమ మొక్కులను తీర్చుకున్నారు. తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా కుందుర్రు, పరిటావారిపాలెం గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆధ్వర్యంలో రెండు భారీ విద్యుత్ ప్రభలు కొలుదీరాయి. ఆదివారం రాత్రి విద్యుత్ ప్రభలపై జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

## అవిశ్వాసానికి రెడీ

- కౌన్సిలర్ల సంతకాలతో నేడు కలెక్టర్‌కు పత్రాలు?
- చక్రం తిప్పిన ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : చీరాల మునిసిపల్ చైర్మన్‌పై అవిశ్వాసానికి అంతా రెడీ అయ్యారు. ఈ అంశంలో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య చక్రం తిప్పారు. వైసీపీకి చెందిన మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావుపై అవిశ్వాసం పెట్టే అంశం తెరపైకి తెచ్చిన ఎమ్మెల్యే ఇప్పటికే 21 సంతకాలు పూర్తి చేసినట్లు తెలుస్తోంది. వాస్తవానికి బల నిరూపణకు మరో రెండు సంతకాలు అవసరమున్నా, రాజకీయ సమీకరణాలను దృష్టిలో పెట్టుకొని అవసరానికి మించే మరో రెండు సంతకాలు చేతిలో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. మొత్తంగా 25 మంది సంతకాలతో అవిశ్వాస తీర్మానంపై సోమవారం కలెక్టర్‌కు అందించనున్నట్లు తెలిసింది. ఇది జరిగితే ఆ పత్రాలు కలెక్టర్ ఎలక్షన్ కమిషన్‌కు పంపించి, అనంతరం మళ్లీ కౌన్సిల్ సమావేశం నిర్వహించి బలనిరూపణ చూపించాలి. అప్పుడు కొత్త చైర్మన్‌కు అవకాశం దక్కుతుంది. ఈ ప్రక్రియ అంతా పూర్తయ్యేసరికి సమయం పట్టనుండడంతో చైర్మన్ ఎంపికపై ఇంకా స్పష్టత కాపోగా, ఎవరు ఎమ్మెల్యే మనసు గెలుచుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

## బర్లీ కొనుగోలుకు చొరవ చూపాలి

పంగులూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : నల్ల బర్లీ పొగాకు సాగు రైతుల కష్టాలు పాలకులు గుర్తించాలని, నల్లబర్లీ కొనుగోలుకు కంపెనీలు ముందుకు వచ్చేలా పాలవర్గ ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని రైతు సంఘం జిల్లా నాయకుడు కందిమళ్ల రామకోటేశ్వరరావు, తలపనేని రామారావులు విజ్ఞప్తి చేశారు. ఆదివారం పంగులూరులో నల్లబర్లీ పొగాకు రైతుల సమస్యలపై రైతు సంఘం ప్రతినిధులు విలేకరులతో మాట్లాడారు. కంపెనీ ప్రతినిధుల ప్రోత్సాహంతో పర్చూరు, అద్దంకి నియోజకవర్గంలో నల్ల బర్లీ సాగు ఈ ఏడాది విస్తారంగా చేపట్టారన్నారు. పంట చేతికొచ్చి ఇళ్ల వద్ద, పొలాలలో పొగాకు మండెలు పేరుకుపోతున్నా కంపెనీలు కొనుగోలుకు ముందుకు రావడం లేదని, ఇటీవల కంపెనీ ప్రతినిధులు, రైతు సంఘాలతో కలెక్టర్ స్థాయిలో జరిగిన చర్చలు ఫలితాలు ఇవ్వకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని కంపెనీలు కొనుగోలు చేసేలా తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

బల్లికురవ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కృషితో మండలంలోని గుంటుపల్లి గ్రామానికి చెందిన పెద్ది ఏడుకొండలుకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఆదివారం మండల టీడీపీ నాయకులు మలినేని గోవిందరావు అందజేశారు. ఇటీవల అనారోగ్యం బారిన పడిన ఏడుకొండలు సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయగా, మంత్రి రవికుమార్ రూ.92వేల చెక్కును మంజూరు చేయించారు. ఈ చెక్కును బాధితుడికి టీడీపీ నేతలు అందజేశారు.



నగరంలోని శబరిశ్రీరామక్షేత్రంలో నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవంతో తాళిబొట్టు చూపుతున్న అర్చకులు



ఊరూ, వాడా ఘనంగా సీతారామ కల్యాణాలు

వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

# జైజై రామ జానకిరామా!

జిల్లా వ్యాప్తంగా ఆదివారం శ్రీరామనవమి వేడుకలు వైభవంగా జరిగాయి. పచ్చని తోరణాలు, చలువ పందిళ్ల లోగిళ్లలో భక్తుల నామస్మరణ మధ్య సీతారాముల కల్యాణాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. శ్రీవిశ్వావసు నామ సంవత్సరంలో రాములోరి కల్యాణం తిలకించినవారికి సూర్యభగవానుడి ఆశీస్సులు కలుగుతాయన్న విశ్వాసంతో భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు తరలివచ్చారు. నెల్లూరు, ఆత్మకూరు, కావలి, కందుకూరు డివిజన్లలోని అన్నీ గ్రామాల్లోనూ రాములోరి పెళ్లిళ్లు జరిగాయి. నగరంలోని శబరి శ్రీరామక్షేత్రం ఆధ్వర్యంలో జరిగిన సీతారాములు కల్యాణోత్సవానికి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సుజిత దంపతులు హాజరై స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. అలాగే పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు సమీపంలోని ఆలయాల్లో జరిగిన స్వామివారి కల్యాణాలకు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పలు ఆలయాల్లో ప్రసాదాలుగా వడపప్పు, పానకం, పులిహోర పంపిణీ చేశారు. పెద్ద ఎత్తున అన్న ప్రసాద వితరణ జరిగింది. భక్తులు వేలాదిగా తరలివచ్చారు.

- నెల్లూరు (సాంస్కృతికం) (ఆంధ్రజ్యోతి)



కల్యాణం అనంతరం సీతారాములకు నిర్వహించిన పుష్పయాగం



వెంకటాచలం మండలం శ్రీరామపురంలో జరిగిన సీతారాముల కల్యాణంలో పాల్గొన్న పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కుటుంబసభ్యులు



నగరంలోని బాలాజీనగర్‌లో సాగుతున్న అద్దాల మందిరం సాయిబాబా రథోత్సవం

## కావాలి నిధులు..
# కదలాలి పనులు

బిల్లుల పెండింగ్‌తో కీలక వర్కులకు బ్రేక్ ● జాబితాలో ఆప్రాన్, హైలెవల్, ఎస్కేఎఫ్ఎఫ్, కాజ్‌వే

● ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుంటేనే ఫలితం

కీలక ప్రాజెక్టుల పనులకు నిధుల కొరతతో బ్రేకులు పడ్డాయి. గత కొన్ని నెలలుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. కొంతమేర బిల్లులు ఇచ్చినా, ఇంకా రావాల్సిన బిల్లులు ఉండటంతో పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఈ ప్రాజెక్టుల్లో చాలా వరకూ ఇరిగేషన్‌కు సంబంధించినవే ఉన్నాయి. ఇవి పూర్తయితే వేల ఎకరాల ఆయకట్టు సాగులోకి రావడంతోపాటు మరికొన్ని వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుంది. వైసీపీ ప్రభుత్వంలో అడుగు ముందుకు పడని ఈ ప్రాజెక్టుల పనుల్లో కూటమి ప్రభుత్వం వచ్చాక కదలిక వచ్చింది. పెండింగ్ బిల్లులను చెల్లించినా ఈ మధ్యలో చేసిన పనులకు బిల్లులు అందాల్సి ఉంది. ఈ కారణంగానే కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు భయపడుతున్నారు.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

సోమశిల ఆప్రాన్ దెబ్బతినడంతో ప్రాజెక్టుకే ముప్పు ఏర్పడింది. 2022లో ఈ పనులు మొదలుపెట్టినా ఇంకా సగం కూడా పూర్తి కాలేదు. గత ప్రభుత్వంలో రూ.20 కోట్ల మేర పనులు జరగ్గా ఆ బిల్లులను అప్పటి ప్రభుత్వం ఇవ్వలేదు. దీంతో కాంట్రాక్టర్ ఏడాదిన్నరపాటు పనులు నిలిపేశారు. కూటమి వచ్చాక స్వయంగా సీఎం చంద్రబాబునాయుడు ఆప్రాన్ పనులను పరిశీలించారు. ఆ వెంటనే కాంట్రాక్టర్‌కు పెండింగ్ బిల్లులు చెల్లించడంతో పనులు పునఃప్రారంభమయ్యాయి. ఇప్పటి వరకూ 30 శాతం మేర పనులు జరిగినట్లు ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. కాంట్రాక్టర్‌కు మరో రూ.7 కోట్ల మేర బిల్లులు రావాల్సి ఉంది. ఆ కారణంతోనే రెండు నెలలుగా ఆప్రాన్ పనులు ఆగిపోయి ఉన్నాయి. సోమశిల- కండలేరు వరద కాలువ (ఎస్కేఎఫ్ఎఫ్ కెనాల్), జీకేఎన్ కెనాల్ (ఉత్తర కాలువ)ను విస్తరించేందుకు 2021లో రూ.1300 కోట్లతో మొదలుపెట్టారు. ఈ రెండు కాలువలకు ప్రస్తుతమున్న ఫ్లో కెపాసిటీని డబుల్ చేయాలన్నది ఉద్దేశం. ఒక్క ఎస్కేఎఫ్ఎఫ్ కెనాల్‌నే రూ.778 కోట్లతో చేస్తుండగా ఇప్పటి వరకూ సుమారు రూ.200 కోట్ల మేర పనులు జరిగినట్లు ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. గత ప్రభుత్వం నుంచి బిల్లులు పెండింగ్ ఉండటంతో పనులు సాఫీగా జరగడం లేదు. ఈ పనులకు కూడా రూ.14 కోట్ల వరకూ బిల్లులు చెల్లించాల్సి ఉందని, అవి చెల్లించిన తర్వాతనే పనులు మొదలు పెడతామని కాంట్రాక్టర్ చెబుతున్నారు. ముదివర్తి-ముదివర్తి పాలెం కాజ్‌వే కూడా బిల్లుల పెండింగ్‌తో కొన్ని నెలల నుంచి ముందుకు కదలడం లేదు. సుమారు రూ.100 కోట్లతో కాజ్‌వే పనులు మొదలుపెట్టగా సుమారు రూ.20 కోట్ల మేర పనులు చేశారు. అయితే కాంట్రాక్టర్‌కు ఒక్క బిల్లు కూడా రాలేదని అధికారులు చెబుతున్నారు. ఈ కారణంతోనే కాంట్రాక్టర్ పనులు చేయడం లేదని అంటున్నారు. ఇవే కాదు.. మలిదేవి డ్రెయిన్ ఆధునికీకరణ, బండేపల్లి - దేగపూడి కాలువ, డీఆర్-డీఎం ఛానెల్ ఆధునికీకరణ పనులతోపాటు కీలకమైన ఎన్డీబీ రోడ్డు వర్కులు కూడా బిల్లుల పెండింగ్ జాబితాలో ఉన్నాయి. కొన్ని వర్కులు పూర్తిగా ఆగిపోగా, మరికొన్ని వర్కులు ఒక అడుగు ముందుకు మూడడుగులు వెనక్కు అన్నట్లు సాగుతున్నాయి.



సోమశిల జలాశయం ముందు ఆగిన ఆప్రాన్ పనులు (ఫైల్)

### సీఎం దృష్టికి తీసుకెళ్లిన కలెక్టర్

ఇరిగేషన్ పనులు వేగంగా చేయడానికి వేసవి కాలం అనువైనది. వర్షాలు ఉండవు కాబట్టి పనులకు అంతరాయం ఏర్పడదు. అదే సమయంలో కొన్ని చోట్ల సాగు కూడా ఉండదు కాబట్టి రైతాంగానికి కూడా ఇబ్బందులు ఉండవు. ఈ నేపథ్యంలో ఇటీవల కలెక్టర్ ఆనంద్ కీలక ప్రాజెక్టులకు నిధుల అవసరాన్ని కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ప్రస్తావించారు. సోమశిల ఆప్రాన్, హైలెవల్ కెనాల్ నిర్మాణాలకు అవసరమైన నిధులను సమకూర్చాలని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన సీఎం ఈ అంశంపై తనతో ప్రత్యేకంగా చర్చించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. దీంతో పెండింగ్ బిల్లుల విడుదలపై కదలిక వచ్చినట్లయింది. ఇదే సమయంలో జిల్లాలోని ప్రజాప్రతినిధులు కూడా కీలక ప్రాజెక్టులకు ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఒత్తిడి తీసుకురాగలిగితే ఫలితం దక్కుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# దొంగలున్నారు జాగ్రత్త !

● వేసవిలో అప్రమత్తంగా లేకుంటే దోచేస్తారు... ● ఆభరణాలు ధరించి, ఆరుబయట నిద్రించవద్దు

● లాక్డ్ హౌస్ మానటిరింగ్ సిస్టమ్‌ను వినియోగించుకోవాలి

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): వేసవి వచ్చిందంటే దొంగలకు కూడా సీజన్ ప్రారంభమైనట్లే. సెలవుల్లో అనేకమంది ఇప్పుడిప్పుడే సొంతూర్లకు, షికార్లకు, బంధువుల ఇళ్లకు వెళుతున్నారు. ఈ క్రమంలో అప్రమత్తంగా లేకుంటే, ఇదే అవకాశంగా దొంగలు ఇళ్లను దోచేస్తున్నారు. రాత్రిళ్ల ప్రజలు ఆరుబయట, మిద్దెలపై నిద్రిస్తున్న సమయంలోనూ, ఇళ్లకు తాళాలు వేసి ఊర్లకు వెళుతున్నప్పుడు గమనించి,చోరులు తమ పని కాని చేస్తున్నారు. ముఖ్యంగా నెల్లూరు నగరంలో వేసవి దొంగతనాలు ఎక్కువగా జరుగుతూ, నగర వాసులకు కంటిపై కునులేకుండా చేస్తున్నాయి.


### జాగ్రత్తలు తప్పనిసరి

● వేసవిలో మహిళలు బంగారు, వెండి ఆభరణాలు ధరించి, ఇంటి బయటకానీ, మిద్దెపై కానీ నిద్రించవద్దు.

● ఇంట్లో పడుకున్నప్పుడు లోపల డోర్‌లాక్ చేయడం మరిచిపోరాదు.

● ఇంట్లో వారంతా ఊరు వెళ్లవలసి వస్తే, విలువైన బంగారు, వెండి ఆభరణాలను, నగదును బ్యాంకు లాకరులో భద్రపరచాలి. లేదంటే వెంట తీసుకెళ్లాలి.

● బయట ఊర్లకు వెళ్లేటప్పుడు ముందుగా పోలీసులకు సమాచారం ఇస్తే, లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్(ఎల్‌హెచ్‌ఎంఎస్)ను ఏర్పాటు చేసి, చోరీలు జరగకుండా పర్యవేక్షిస్తారు.




● అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే, వెంటనే 112 నెంబరుకు ఫోన్ చేసి సమాచారం అందించాలి.

### యాప్‌ను ఎలా వినియోగించుకోవాలి ?

ముందుగా ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌లోకి వెళ్లి రిక్వెస్టు పోలీసు వాచ్‌ను ఎంపిక చేసుకోవాలి. ఏ తేదీన ఏ సమయానికి ఊరు వెళుతున్నారు.. ఎప్పుడు తిరిగి వస్తారు .. అన్న వివరాలను యాప్‌లో పొందుపరచాలి. వెంటనే ఆ సమాచారం జిల్లా పోలీసు కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు చేరుతుంది. అక్కడ సిబ్బంది ఆ ఇంటికి వైఫైతో పనిచేసే నిఘా కెమెరాలను అమర్చుతారు. ఆ ఇంట్లో ఎలాంటి కదలికలున్నా కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సైరన్ మోగుతోంది. వెంటనే సంబంధిత పోలీసు స్టేషన్, రక్షక్, బ్లూకోట్స్ వాహనాలకు సమాచారం వెళ్తుంది. దీంతో పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని దొంగలను పట్టుకునేందుకు అవకాశం ఉంటుంది.

### ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం...



వేసవిలో జరిగే చోరీలపై ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. వేసవి సెలవుల్లో సొంతూర్లకు వెళ్లే ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ సేవలను వినియోగించుకోవాలి.

- జీ కృష్ణకాంత్, జిల్లా ఎస్పీ



వాహనంలో తరలిస్తున్న ఆవు

# నెల్లూరులో గోవధ ముఠాలు

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 6, (ఆంధ్రజ్యోతి): నగరంలో గోవధ ముఠాల ఆగడాలు ఎక్కువయ్యాయి. రోడ్లపై తిరిగే ఆవులను అపహరించి, కోతకు తరలిస్తున్నారు. రోడ్లపై గోసంచారం ప్రయాణికులకు ఇబ్బందిగా మారిందని కార్పొరేషన్ సిబ్బంది వాటిని పట్టుకెళ్లి కల్లూరిపల్లిలోని గోశాలలో ఉంచుతున్నారు. కొందరు ఆ ముసుగులో ఆవులను అపహరించుకెళ్లి మాంసం విక్రయదారులకు అమ్మేస్తున్నారు. వారాంతపు రోజులైన శుక్ర, శనివారాల్లో ఈ ముఠాలు రోడ్లపై తిరిగే ఆవులను తీసుకెళ్లి ఒక్కొక్క దాన్ని రూ.20 నుంచి రూ.30 వేలకు అమ్ముకుంటున్నారు. నగరంలోని నాలుగు ప్రాంతాల్లో ఆవులను వధించి, ఆ మాంసాన్ని ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు.

> ఆవులను అపహరించి, కోతకు తరలింపు
>
> వారాంతంలో రంగంలోకి మాఫియా
>
> ఒక్కొక్కటి రూ. 20 వేల నుంచి రూ.30 వేలకు విక్రయం
>
> నాలుగు ప్రాంతాల నుంచి మాంసం ఎగుమతి

● కార్పొరేషన్ సిబ్బంది ముసుగులో...

రోడ్లపై ఉండే ఆవులను మున్సిపల్ సిబ్బంది కల్లూరిపల్లిలోని గోశాలకు తరలిస్తున్నారు. ఇందుకు ప్రత్యేక వాహనాలను వినియోగిస్తున్నారు. ఈ వ్యవహారం ఆవులను అపహరించే ముఠాకు అనుకూలంగా మారింది. ముందుగా నగరంలో ఎక్కడెక్కడ ఆవులు ఉన్నాయో రెక్కీ నిర్వహించి, ఆ తరువాత కార్పొరేషన్ సిబ్బంది ముసుగులో రంగంలోకి దిగి వాహనాల్లో ఎక్కించుకుని పోతున్నారు. ఎవరైనా అడిగినా తాము ఎన్ఎంసీ సిబ్బందంటూ చెప్తున్నారు. ఇలా తోలుకెళ్లిన ఆవు సైజును బట్టి ఒక్కొక్క దాన్ని రూ. 20 వేల నుంచి రూ. 30 వేలకు అమ్ముకుంటున్నట్లు సమాచారం. దీంతో పలువురు యజమానులు నగరంలోని వివిధ స్టేషన్లలో ఫిర్యాదులు కూడా చేసినట్లు తెలిసింది.

● నాలుగు ప్రాంతాల నుంచి మాంసం ఎగుమతి

నగర శివార్లలోని నాలుగు ప్రాంతాల్లో ఆవులను వధించి, వాటి మాంసాన్ని ఎగుమతి చేస్తున్నట్లు ఇప్పటికే కార్పొరేషన్ అధికారులు గుర్తించారు. ఇటీవల ఎన్టీఆర్‌నగర్ ఎదురుగా ఉన్న ఓ లేఅవుట్లలో ఆటోలో తీసుకువచ్చిన సుమారు ఐదు టన్నుల ఆవు మాంసాన్ని లారీకి లోడ్ చేస్తుండగా పోలీసులు, ఎన్ఎంసీ అధికారులు పట్టుకున్నారు. దీన్ని కేరళకు తరలించేందుకు సిద్ధమైనట్లు సమాచారం. నగరంలోని బోడిగాడితోట, షైపాడుగేట్ సమీపం, వైఎస్ఆర్‌నగర్, ఆటోనగర్ ప్రాంతాలకు ఆవులను తీసుకువచ్చి చంపి, మాంసం ఎగుమతులు చేస్తున్నట్లు తెలుస్తున్నది. వీళ్లకి ఎలాంటి అనుమతులు లేకపోయినా దందా మాత్రం యథేచ్ఛగా సాగడంపై పలు అనుమానాలు కలుగుతున్నాయి.

## 'బెల్టు' వేలం రూ. 1.50 లక్షలు

● అంకభూపాలపురంలో ఘటన

వలేటివారిపాలెం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకభూపాలపురంలోని ఓ ఆలయంలో మూడు రోజుల క్రితం గ్రామస్థులు బెల్టుషాపునకు వేలం నిర్వహించారు. ఆదే గ్రామానికి చెందిన ప్రగడ సత్యనారాయణ రూ.1.50 లక్షలకు వేలం పాడినట్లు సమాచారం. గత ఏడాది రూ.50 వేలకు పోయిన వేలం, ఈ ఏడాది రూ.1.50లక్షలకు పోయింది. వేలం ద్వారా వచ్చిన నగదును గ్రామంలో పండుగలు, జాతరలకు ఉపయోగించనున్నట్లు గ్రామస్థులు తెలిపారు. బెల్టు షాపులో ఒక్కో మద్యం సీసాపై ఎమ్మార్పీ కంటే రూ. 50 అదనంగా అమ్ముతున్నట్లు సమాచారం. కాగా గ్రామంలో బెల్టుషాపునకు పాట పెట్టింది తనకు తెలియదని ఎక్సైజ్ సీఐ వెంకట్రావు పేర్కొన్నారు.తనిఖీలు నిర్వహించి చర్యలు చేపడతామన్నారు.

బుజబుజనెల్లూరులోని తల్పగిరి కాలనీలో ఉండే భూషయ్య రోజూ తన ఆవును మేతకు బయటకు వదులుతాడు. శుక్ర, శనివారాల్లో కూడా అలాగే వదిలాడు, కానీ అది తిరిగి ఇంటికి రాలేదు. చుట్టుపక్కల గాలించి కార్పొరేషన్ సిబ్బంది పట్టుకెళ్లారని గ్రహించి, గోశాలకు వెళ్లిచూశాడు. అయితే అది అక్కడలేదు. ఏమైందని ఆరా తీయగా, అతడిని వెంకటయ్య అనేవ్యక్తి తారసపడి, నీ ఆవును కసాయి ముఠా తోలుకెళ్లి ఉంటుందని, వెతకడం మానుకోమని సలహా ఇచ్చాడు. ఇలా అనేకమంది ఆవులు ఇటీవల కాలంలో చోరీకి గురయ్యాయి. నగరంతోపాటు శివారు ప్రాంతాల్లోనూ ఆవులను అపహరించే ముఠాలు సంచరిస్తున్నట్లు ఈ సంఘటనను బట్టి తెలుస్తోంది.

**చికెన్ ధరలు**

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో (రూ.లలో) |
|---|---|
| బాయిలర్ లైవ్ | 113 |
| స్కిన్ చికెన్ | 202 |
| స్కిన్‌లెస్ | 226 |
| కోడిగుడ్ల ధర (100) | 440 |

**బంగారం, వెండి ధరలు**

| | |
|---|---|
| బంగారం (22 క్యారెట్లు) | |
| ఒక గ్రాము ధర | రూ.8559 |
| వెండి కిలో ధర | రూ. 90.800 |
| వెండి ఒక గ్రాము | రూ.93.80 |

### తాగునీరు విడుదల

లింగసముద్రం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి) : మూడు రోజుల క్రితం సంపుల శుభ్రం చేయడం, వాల్వ్‌ల మరమ్మతుల కారణంగా రాళ్లపాడు- రోళ్లపాడు మంచినీటి పథకం నుంచి ఆపిన మంచినీటి సరఫరాను ఆదివారం ఉదయం నుంచి పునరుద్ధరించారు. శనివారం రాత్రి ఈ పథకం వాల్వ్‌లను పెంట్రాల లోని ఫిల్టర్ పాయింట్‌లోని సంపులకు బిగించి, నీటిని పంపింగ్ చేసి ట్యాంకుల ద్వారా ప్రజలకు అందించారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# కమనీయం.. సీతారాముల కల్యాణం


ఉలవపాడు : సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి

ఉలవపాడు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమిని పురస్కరించుకుని ఆదివారం రామాలయాల్లో రాములోరి కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. మండలంలోని చాకిచర్ల శ్రీశ్రీనగర్ ఎస్సీ కాలనీ, పెద్దపట్టపు పాలెం గ్రామాల్లో జరిగిన సీతారాముల కల్యాణోత్సవంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. అలాగే ఉలవపాడు, కరేడు, బద్దిపూడి, భీమవరం, ఆత్మకూరు గ్రామాల్లోని రామాలయాల్లో స్వామివారి కల్యాణంలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. రాత్రి గ్రామోత్సవం జరిగింది.

**కావలిటౌన్ :** కావలి పట్టణంలోని దక్షిణంపేట రామాలయం, జనతాపేట రామాలయం, సత్యనారాయణస్వామి ఆలయం, అన్నపూర్ణ క్లాత్ మార్కెట్, వడ్డిపాలెం, వెంగళరావునగర్ రామాలయాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరగాయి. భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమాలు చేపట్టారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పలు ఆలయాలు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణమహోత్సవాన్ని తిలకించారు.

**కావలిరూరల్ :** మండలంలోని పలు గ్రామాల్లో ఆలయాలను విద్యుత్ దీపాలు పచ్చతోరణాలతో అలంకరించారు. రామాలయాలు లేని అనేక చోట్ల చలువ పందిళ్లలో స్వామివారి చిత్రపటాలు ఉంచి పూజలు నిర్వహించారు. ముసునూరు ఇందిరమ్మకాలనీ శ్రీరామ్ నగర్‌లో ఉన్న భద్రాది సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు గన్నంరెడ్డి వెంకట శేషారెడ్డి, బైసాని ధనేష్ గుప్త ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. అదే ప్రాంతంలోని వినాయక మండపం దగ్గర స్వామివారి కల్యాణ వేడుక వైభవంగా జరిగిన అనంతరం స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు.

**కందుకూరు :** రామాలయాలు భక్తుల రామనామస్మరణలతో మార్మోగాయి. సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులకు సామూహిక అన్నప్రసాద కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని రెవిన్యూ కాలనీ, పెద్దబజారు రామాలయం, నందావారివీధి, ఏకలవ్యనగర్, పామూరు రోడ్డులోని రామాలయాల్లో సీతారాముల కల్యాణోత్సవాన్ని వేడుకగా నిర్వహించగా వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

**కలిగిరి :** మండలంలోని ఆలయాల వద్ద చలువపందిళ్ల కింద జరిగిన సీతారామ కల్యాణోత్సవాలను భక్తులు తిలకించారు.

**బిట్రగుంట :** విశ్వనాథరావుపేట రైల్వే ట్రాఫిక్ రామాలయంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. బిట్రగుంట రైల్వే పీడబ్ల్యూఐ కార్యాలయం నుంచి పట్టువస్త్రాలు, మంగళసూత్రం, తలంబ్రాలు అందచేశారు. బోగోలు విజయగణపతి ఆలయంలో స్వామి అమ్మవార్ల చిత్రపటాలను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు.

**దగదర్తి(బిట్రగుంట):** దగదర్తి మండలం మనబోలుపాడు కోదండరామాలయంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఉభయకర్తలుగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి, ఉమాప్రియ దంపతులు వ్యవహరించారు. స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలు, తలంబ్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అల్లం హనుమంతరావు, న్యాయవాది కొండూరు శేషారెడ్డి, జలదంకి శ్రీహరి, పులి శీనయ్య, పావన మల్లికార్జునరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


ఉదయగిరి సుద్ధబావివీధి రామాలయం ఆవరణలో కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

**కొండాపురం:** ఇస్కదామెర్ల పంచాయతీ పొట్టిపల్లి, గుడవళ్లూరు, శాయిపేట, భీమవరప్పాడు తదితర గ్రామాల్లో సీతా రాముల విగ్రహాలకు ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించి కల్యాణ వేడుకలను వైభవంగా నిర్వహించారు.

**అల్లూరు :** అల్లూరు, నార్తుమోపూరుల్లోని రామాలయాల్లో ఆది దంపతుల కల్యాణం వైభవంగా జరిగింది. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని వీక్షించారు. అల్లూరుపేటలోని కోదండరామస్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్తల వంశస్థులైన అల్లంపాటి లోకేష్, హాసిని దంపతులు, అల్లంపాటి ఇందిరమ్మలు పాల్గొన్నారు.

**జలదంకి :** మండలంలోని రామమందిరాల ముంగిట చలువ పందిళ్లు వేసి సీతారాముల కల్యాణాలు వేదమంత్రోచ్చరణాల మధ్య నిర్వహించారు. భక్తులు అదికసంఖ్యలో హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు.


కందుకూరు నందావారివీధిలోని రామాలయంలో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు


ఆత్మకూరు పట్టణంలోని కోదండరామాలయంలో సీతారామ కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

**వలేటివారిపాలెం:** వలేటివారిపాలెం వడ్డెపాలెంలో ముత్యాల తలంబ్రాలతో సీతారాముల కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. భక్తులు భక్తిశ్రద్ధలతో రామాలయాలకు వెళ్లి పూజలు చేసి సీతారాముల కల్యాణం తిలకించారు.

**లింగసముద్రం:** పెదపవని, చినపవని, లింగసముద్రం, వీఆర్ కోట తదితర గ్రామాల్లో భక్తులు కోదండరాముని దేవాలయాలను సందర్శించి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు.

**ఆత్మకూరు:** ఆత్మకూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఆదివారం శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆత్మకూరు పట్టణంలోని ఎల్ఆర్‌పల్లి, పంటవీధి, కన్యకాపరమేశ్వరి ఆలయంలోని కోదండరామస్వామి ఆలయాల్లో, కాశినాయన ఆశ్రమంలో, అరుంధతీపాళెం తదితర ప్రాంతాలలో సీతారాముల కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని నెల్లూరుపాళెం, అశోకనగర్, పిడుగురంగయ్యవీధి, మండలంలోని దేపూరు, మహిమలూరు గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

**సంగం :** మండల కేంద్రం శివాజీ సెంటర్‌లోని రామ మందిరం, అంజనేయస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. పెరమన, జంగాలదొరువు, కోరిమెర్ల, ఉడ్‌హౌస్‌పేట, తరుణవాయి, వంగల్లు, జండాదిబ్బ, అనుసూయనగర్, పల్లిపాళెం, మర్రిపాడు తదితర రామాలయాల్లో నవమి వేడుకలను నిర్వహించారు.


కావలి బ్రిడ్జి దిగువలోని రామమందిరంలో జరిగిన సీతారాముల కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

**అనంతసాగరం:** మండలంలోని వరికుంటపాడు, అగ్రహారం, అనంతసాగరం చెరువు కట్ట వద్ద ఉన్న కోదండరామస్వామి ఆలయాల్లో శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారి కల్యాణం జరిపారు.

**ఏఎస్‌పేట :** అనుమసముద్రం, చిరమన, శ్రీకోలను, రాజవోలు, దుబగుంట గ్రామాలతో పాటు మండలంలోని అన్ని గ్రామాలలో శ్రీరామనవమి వేడులను ఘనంగా నిర్వహించారు. సీతారాముల కల్యాణం వైభవంగా జరిపారు.

**ఉదయగిరి:** పట్టణంలోని సుద్ధబావివీధిలో ఉన్న రామాలయంలో స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. అలాగే స్థానిక ఆంజనేయస్వామి ఆలయం, మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు జరిపారు.

**దుత్తలూరు:** మండలంలోని దుత్తలూరు గ్రామంలో నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, అనసూయమ్మ దంపతులు పాల్గొన్నారు. అలాగే సోమలరేగడ, లక్ష్మీపురం, నందిపాడు, నర్రవాడ, బ్రహ్మేశ్వరం, కొత్తపేడ, తెడ్డుపాడు, రెడ్డదిన్నె తదితర గ్రామాల్లో కల్యాణోత్సవాలు, పూజలు చేపట్టారు.

**వరికుంటపాడు(ఉదయగిరి రూరల్):** మండలంలోని వరికుంటపాడు, పెద్దిరెడ్డిపల్లి, కనియంపాడు, తూర్పురొంపిదొడ్ల తదితర గ్రామాల్లో సీతారాముల కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామివార్లను గ్రామోత్సవం నిర్వహించారు.

**వింజమూరు :** చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టణ పురవీధుల్లో స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే వైశ్యబజార్‌లో రాములవారి గుడిలో కొండ చంద్రమౌళి కుటుంబ సభ్యులచే సీతారాముల కల్యాణం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

**సీతారామపురం:** మండలంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పడమటివీధి రాములవారి ఆలయం నుంచి పానకం బండి ఊరేగింపుతో గ్రామ దేవత అంకాలమ్మ గుడి వద్దకు వెళ్లి అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు పానకం, వడపప్పు, ప్రసాదం పంచారు. ఆదేవిధంగా రాజుగారి వీధిలో నూతనంగా నిర్మిస్తున్న సీతారామ దేవస్థానం వద్ద పాలగిరి శివకుమార్ జ్ఞాపకార్థం ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.


కావలిరూరల్ : వినాయక మండపం సెంటర్‌లో ఊరేగుతున్న దేవతా మూర్తులకు

## ఎన్నికల హామీలు తప్పక నెరవేరుస్తాం : ఎంపీ వేమిరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

ఉలవపాడు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తప్పకుండా కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పెద పట్టపుపాలెంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో కలసి పర్యటించిన ఎంపీ అక్కడ ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. ఎన్నికల ప్రచార సమయంలో పెద్దపట్టపుపాలెం ప్రజలు చూపిన ఆదరణ మరువలేదని, అందుకే గెలిచాక మళ్లీ శ్రీరామ నవమి వేడుకలకు వస్తానని చెప్పిన తాను ఈరోజు స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్నానన్నారు. గ్రామస్థులు పలు సమస్యలు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. బకింగ్‌హోమ్ కెనాల్ దాటి సముద్రంలోకి వెళ్లేందుకు బ్రిడ్జి ఏర్పాటు చేయాలని, చెరువు పూడికతీత, కాలువల పనులు చేపట్టాలని చేసిన విజ్ఞప్తి మర్చిపోలేదని, స్థానిక ఎమ్మెల్యే నాగేశ్వరరావుతో కలిసి సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు. వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్రై సైకిళ్ల పంపిణీ నిరంతర ప్రక్రియ అని, నియోజకవర్గంలో ఇంకా ఎవరైనా ట్రై సైకిళ్లు అందకపోతే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రాభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళుతున్నారని, సుపరిపాలన అందిస్తున్నారని కొనియాడారు. చాకిచర్ల శ్రీశ్రీకాలనీలో అసంపూర్తిగా ఉన్న రామాలయం నిర్మాణం పూర్తి చేసే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. కాగా అంబేడ్కర్ జయంతిరోజున ఆటల పోటీల నిర్వహణ, భోజనాలకు రూ.70,000 విరాళం అందచేశారు. కార్యకర్తల మధ్య ఉండే చిన్నచిన్న సమస్యలు పరిష్కరించుకొని కలిసికట్టుగా ముందుకు సాగితే తిరిగి 2029లో కూడా విజయం మనదేనని ఆయన స్పష్టంచేశారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎంపీ వేమిరెడ్డి సహకారంతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. పెద్దపట్టపుపాలెంలో రూ.30లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టామని, భవిష్యత్తులో మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

## ఇష్టంగా చదివితే జీవితం సుఖమయం : ఎమ్మెల్యే దగుమాటి

కావలి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ఇష్టంతో కష్టపడి చదివితే జీవితం సుఖమయం అవుతోందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. స్థానిక విశ్వశాంతి హైస్కూల్‌లో శనివారం రాత్రి జరిగిన ఆ స్కూల్ 34వ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం పాఠశాలలో వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. అనంతరం పాఠశాల యాజమాన్యం ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ డీవీ రమణయ్య, టీడీపీ నాయకులు గంగినేని వెంకటేశ్వర్లు, బొట్లగుంట హరిబాబు, మంచాల ప్రసాద్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### నేడు కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

సంగం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెలుగు కేంద్రంలో మహిళల ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని దేవదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సోమవారం సాయంత్రం 5 గంటలకు ప్రారంభిస్తారని ఎంపీడీవో షాలెట్ ఒక ప్రకటనలో తెలిపారు. కుట్టు శిక్షణకు ఎంపికైన మహిళలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

## టీడీపీ కార్యకర్తలకు సభ్యత్వ కార్డుల అందజేత


ఉదయగిరి: కార్యకర్తలకు సభ్యత్వ నమోదు కార్డులు అందజేస్తున్న బయ్యన్న

ఉదయగిరి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్డులు కార్యకర్తలకు అందచేస్తున్నట్లు మండల టీడీపీ కన్వీనర్ చింతనబోయిన ఆదివారం పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 36 బూత్‌లకు సంబంధించి సుమారు 11వేల సభ్యత్వ కార్డులు, ట్యాగులు అం దాయని, వీటిని కార్యకర్తలకు అందచేస్తామన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ నేతలు బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, మతకాల శ్రీనివాసులయాదవ్, చింతనబోయిన శివకృష్ణ, రామ్మోహన్ పాల్గొన్నారు.

●వింజమూరు : స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం పార్టీ సభ్యత్వ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు గొంగటి రఘునాథరెడ్డి క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, బూత్ కన్వీనర్లకు కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లుయాదవ్, మాజీ కన్వీనర్ గూడా నర్సారెడ్డి, నాయకులు మంచాల శ్రీనివాసులు నాయుడు, కొండపల్లి వెంకటేశ్వర్లు, దుద్దుగుంట శ్రీనివాసులు, అంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

●సీతారామపురం: మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం కార్యాలయ సిబ్బంది అంకబాబు, మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్ రాజు ఆధ్వర్యంలో క్లస్టర్ ఇన్‌చార్జ్, యూనిట్ బూత్ ఇన్‌చార్జ్‌లకు బూత్‌లవారీగా సభ్యత్వ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి పిడుగు రమేష్, మాజీ జడ్పీటీసీ కలివెల జ్యోతి, మండల తెలుగు యువత అధ్యక్షుడు ఎడమ ప్రవీణ్, జిల్లా ఎస్సీ సెల్ కార్యనిర్వాహక అధికార ప్రతినిధి జాషువా, ఇజ్రాయిల్, దేవర వెంకటేశ్వర్లు, వికాస్‌బాబు,ంఘు, కిరణ్, రాజేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

## రామాలయంలో ఉత్సవాలకు విరాళం అందజేత


నిర్వాహకులకు నగదు అందజేస్తున్న టీడీపీ నేతలు

ఉదయగిరి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుద్దబావి వీధి రామాలయంలో ఉత్సవాలకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ రూ.20 వేలు విరాళం అందజేశారు. స్వామివారి కల్యాణోత్సవం, అన్నప్రసాద వితరణ కోసం ఈ నగదును ఆదివారం ఆయన ప్రతినిధులు గడ్డం కొండలరావు, తుమ్మల కిరణ్ నిర్వాహకులకు అందించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న, మైనారిటీ నాయకులు షేక్ రియాజ్, సయ్యద్ సందానీ తదితరులు పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన

కలువాయి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా స్థానిక హిందూధర్మ పరిరక్షణ సమితి, సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కలువాయిలో నగర సంకీర్తన నిర్వహించారు. రామ కీర్తనలతో గ్రామవీధులు మార్మోగాయి.

### ఆదురుపల్లిలో రక్తదాన శిబిరం

చేజర్ల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదురుపల్లి గ్రామంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. స్థానిక యువత రక్తదానం చేశారు. ఈకార్యక్రమంలో స్థానిక ఉపాధ్యాయుడు మల్లికార్జున, రెడ్‌క్రాస్ మోటివేటర్ మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

### వెలుగొండ ప్రాజెక్టును యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలి

ఉదయగిరి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): వెలుగొండ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం అదనపు నిధులు కేటాయించి యుద్ధప్రాతిపకదిన పూర్తిచేయాలని వెలుగొండ సాధన సమితి అధ్యక్షుడు మాదాల శ్యాంప్రసాద్, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ కోరారు. ఆదివారం స్థానిక కోట్నీస్ ప్రజా వైద్యశాల ఆవరణలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రాజెక్టుల పూర్తికి పార్టీలకతీతంగా నాయకులు, రైతులు, యువకులు ఉద్యమించాలన్నారు. ఈకార్యక్రమంలో వెలుగొండ సాధన సమితి నాయకులు దస్తగిరి అహ్మద్, బసిరెడ్డి మాలకొండయ్య, మూలె వెంగయ్య, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### చలివేంద్రం ప్రారంభం

కలిగిరి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వేంకటేశ్వర స్వామి, సాయిబాబా ఆలయాల వద్ద త్రిపుల్ ఆర్ టిఫిన్ హోటల్ అధినేత రావూరి రమేష్‌రెడ్డి ఆదివారం చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. మొదటి రోజున పట్టణ వాసులకు పానకం, వడపప్పు పంచిపెట్టారు.

### పారిశ్రామికవేత్త గంగాప్రసాద్ జన్మదిన వేడుకలు

కలువాయి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్ జన్మదిన వేడుకలు ఆదివారం స్థానిక వృద్ధుల ఆశ్రమంలో టీడీపీ నాయకులు నిర్వహించారు. కేక్ కట్ చేసి, వృద్ధులకు పండ్లు, కూరగాయలు అందజేశారు. అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు జీ వెంకటేశ్వర్లు నాయుడు, అరిబోయిన సుందరయ్య యాదవ్, గడ్డం కిషోర్‌రెడ్డి, నాగిరెడ్డి రాజారెడ్డి, ఏ.మల్లికార్జునయ్య, తదితరులు పాల్గొన్నారు.

### అవార్డు గ్రహీత జయప్రకాష్‌కు సత్కారం

కావలిటౌన్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): కావలి బుద్ధవిహార్ స్థాపకుడు పి జయప్రకాష్ అంబేద్కరిజంపై చేసిన సేవలను గుర్తించిన రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర మాల ఉద్యోగుల సంఘం వారు ఇటీవల ఒంగోలులో జరిగిన కార్యక్రమంలో అంబేడ్కర్ సేవారత్న అవార్డు అందించారు. దీంతో ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్‌నగర్‌లోని బుద్ధవిహార్ వద్ద జయప్రకాష్ దంపతులను స్థానికులు ఘనంగా సత్కరించి అభినందించారు.

# ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం


కావలి ట్రంకురోడ్డు శివాజీ సెంటర్‌లో బీజేపీ జెండా ఆవిష్కరించిన ఆపార్టీ నేతలు

కావలి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మాగుంటపార్వతమ్మ ట్రంకురోడ్డులోని శివాజీ సెంటర్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. బీజేపీ కావలి ఒకటో పట్టణ అధ్యక్షుడు మంద కిరణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నేతలు అంచిపాకల కమల, క్షేత్రబ్రహ్మానందం, సీపీసీ సత్యం, అమరా వెంకటసుబ్బారావు, పరుసు వెంకటేశ్వర్లు, మద్దివెట్టి నరేంద్ర, పాతపాటి రమణారెడ్డి, వాయుగండ్ల సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

**కందుకూరు :** బీజేపీ ఆవిర్భావ దినం సందర్భంగా పట్టణంలోని కోవూరు రోడ్డులో ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహం సమీపంలో ఏర్పాటు చేసిన బీజేపీ జెండాను ఆపార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ గట్టమనేని హరిబాబు, పార్టీ నాయకులు మన్నేపల్లి వరప్రసాదరావు, జొన్నాదుల రాఘవయ్య, చుండి మురళీధర్, పాణ్యం గాంధీ, అమలనాథుని మాల్యాద్రినాయుడు, బొర్రా కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

**జలదంకి :** జలదంకి బస్టాండ్ కూడలిలో ఆదివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆ పార్టీ మండల అధ్యక్షుడు ముడి కిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ జెండాను ఎగురవేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు వడ్డే శ్రీనాథ్‌రెడ్డి, బండారు తిరుపతిరెడ్డి, చల్లా హనుమారెడ్డి, వంటేరు రాకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**బిట్రగుంట :** బోగోలులోని బీజేపీ కార్యాలయంలో ఆపార్టీ మండల అధ్యక్షుడు వీరాల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భరత్‌కుమార్, మండల మాజీ అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్ ముఖ్యఅతిథులుగా హాజరై పార్టీ జెండా ఆవిష్కరించారు. శ్రీరామనవమి పురస్కరించుకుని మండల మహిళ అధ్యక్షురాలు నూకసాని రాజ్యలక్ష్మి వడపప్పు, పానకం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జీ.వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, రాచూరికిశోర్, వెంకటరమణయ్య, అరుణ్‌కుమార్, బాలునాయుడు, గోవిందరాజులు, తదితరులు పాల్గొన్నారు.

**ఉదయగిరి :** స్థానిక పంచాయతీ బస్టాండ్ ఆవరణలో ఆదివారం భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షురాలు విజయలక్ష్మీ పతాకాన్ని ఆవిష్కరించారు. అలాగే మోటపోతుల చెన్నయ్య ఆధ్వర్యంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మూలె బాలకృష్ణారెడ్డి, గడ్డం ప్రసాద్, నారాయణరెడ్డి, మాధవరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, ఆవుల రోశయ్య, చల్లా సుబ్బరత్నం, షాజహాన్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

**కలువాయి :** బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక బస్టాండులో ఆ పార్టీ నేత దండు పెంచలయ్య ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పగడి పెంచల ప్రసాద్, శివాజీ, నరసింహ, జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.


కందుకూరు : కోవూరు రోడ్డులో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

**అనంతసాగరం :** బీజేపీ ఆవిర్భావ దినోత్సవం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు వల్లూరు రాజేష్‌రెడ్డి, కార్యదర్శి జగదీష్, వెంకటేష్, వెంకిరెడ్డి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

**వింజమూరు:** బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్‌లో ఆదివారం పార్టీ జెండాను మండల పార్టీ అధ్యక్షుడు డేగ మధుయాదవ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మంట రమేష్, నాయకులు దినేష్, దాసరి ప్రసాద్, గంగిశెట్టి హజరత్, రాజా, రమేష్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.


ఉదయగిరి : భరతమాత, పార్టీ వ్యవస్థాపకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు


కలువాయిలో జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు.


జలదంకి బస్టాండ్ సెంటర్‌లో బీజేపీ జెండా ఎగురవేస్తున్న నాయకులు